సాహితి
ప్రతి సాహిత్యాభిమానికి కరదీపిక

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 28 పేజీలు: 10+4 వెల: 6.50


కోల్‌కతాలో భూకంపం..
జనం పరుగులు
5లో

సోషల్ మీడియాపై
నియంత్రణా, నిషేధమా?



# కేజ్రీవాల్, కవితకు క్లీన్-చిట్

## ఢిల్లీ లిక్కర్ స్కాంలో సిసోడియా సహా 23 మందిపై అభియోగాలు కొట్టివేత

- సిబిఐ ఛార్జిషీట్‌లో మెరిట్‌లేదన్న రౌస్ అవెన్యూ కోర్టు
- దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన విచారణకు ఆదేశం
- ట్రయల్ కోర్టు తీర్పును హైకోర్టులో సవాల్ చేసిన సిబిఐ
- రాజకీయ కుట్రతోనే కేసు: కేజ్రీవాల్

**దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ సిఎం ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు భారీఊరట లభించింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఆయనపై ఉన్న అభియోగాలను కొట్టివేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు ఇచ్చింది. అంతేకాదు ఆయనతో పాటు మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవిత తదితరులు 23 మందిపై ఉన్న అభియోగాలను కూడా తొలగించినట్టు పేర్కొంది. ఈ కేసు విచారణ సందర్భంగా సిబిఐ దాఖలుచేసిన చార్జ్‌షీట్‌లో మెరిట్ లేదని రౌస్ అవెన్యూ కోర్టు స్పష్టం చేసింది.**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** లిక్కర్ పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా అందరు నిందితులను విడుదల చేశారు, ఢిల్లీ కోర్టు సిబిఐని తప్పుపట్టింది. లిక్కర్ పాలసీ కుంభకోణానికి సంబంధించిన అవినీతి కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను శుక్రవారం ఢిల్లీ కోర్టు విడుదల చేసింది. రౌస్ అవెన్యూ కోర్టుల ప్రత్యేక న్యాయమూర్తి జితేంద్ర సింగ్ కూడా ఈ కేసులో ఆప్ నాయకుడు మనీష్ సిసోడియాను విడుదల చేశారు. ముఖ్యంగా, ఈ కేసులో నిందితులైన 23 మందినీ న్యాయమూర్తి విడుదల చేశారు. వారు కుల్దీప్ సింగ్, నరేందర్ సింగ్, విజయ్ నాయర్, అబిషేక్ బోయిన్‌పల్లి, అరుణ్ పిళ్లై, మూత గౌతమ్, సమీర్ మహేంద్రు, మనీష్ సిసోడియా, అమన్‌దీప్ సింగ్ ధాల్, అర్జున్ పాండే, బుచ్చిబాబు గోరంట్ల, రాజేష్ జోషి, దామోదర్ ప్రసాద్ >>2



పెట్టుబడులు, ఆవిష్కరణలు
# అభివృద్ధికి ఊతం
## ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు, ఆవిష్కరణలతో ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోడీ విజ్ఞప్తిచేసారు. పరిశ్రమలకు ఆర్థిక సంస్థలు ఆచరణాత్మక పరిష్కారాలతో అండగా నిలిచి మార్కెట్ నమ్మకాన్ని పెంచాలని సూచించారు. వికసిత్ భారత్ కోసం సాంకేతికత, సంస్కరణలు, ఆర్థికం అనే అంశంపై నిర్వహించిన బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయని మోడీ అన్నారు. వివరించారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందని ప్రధాని తెలిపారు. 11 ఏళ్ల క్రితం కేవలం రూ.2లక్షల కోట్లుగా ఉన్న మూలధన పెట్టుబడులు, 2026-27 బడ్జెట్‌లో రూ.12లక్షలకోట్లకు పైగా పెరిగా >>2

డిఎంకెలో చేరిన మాజీ సిఎం పన్నీర్ సెల్వం 5లో

రవీంద్రభారతి బుకింగ్ ఇక ఆన్‌లైన్ 6లో

# ప్రజలతో కలిసి నడవండి



శుక్రవారం సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన దేవ్‌జీ మరో ఐదుగురు మావోయిస్టు నేతలు

**హింసతో ఏ సమస్యకు పరిష్కారం రాదు..**

**పునరావాస కల్పనలో ఎటువంటి లోటు లేకుండా చూస్తా**

**మాజీ మావోయిస్టు అగ్రనేతలకు సిఎం రేవంత్ హామీ**

**ముఖ్యమంత్రితో భేటీ అయిన దేవ్‌జీ, రాజిరెడ్డి, సుజాత ప్రభృతులు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి27:** జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టు అగ్రనేతలతో ముఖ్యమంత్రి ఎ .రేవంత్ రెడ్డి శుక్రవారం నాడు సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి అభ్యర్థన మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి వారితో సుదీర్ఘంగా ముఖాముఖి చర్చించారు. హింస వల్ల ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం లభించదని, ప్రజల ఆకాంక్షలు కేవలం ప్రజాస్వామ్య మార్గంలోనే నెరవేరుతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారితో అన్నారు. దశాబ్దాల పాటు అడవుల్లో గడిపిన వారు తిరిగి ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకంతో వెనక్కి రావడం అభినందనీయమని పేర్కొంటూ, వారు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు ప్రభుత్వం తరఫున పూర్తి రక్షణ, పునరావాస కల్పనలో ఎటువంటి లోటు లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న పునరావాస విధానాలను పరిగణనలోకి తీసుకుని, సాధారణ జీవితం గడిపేందుకు ముందుకు వచ్చిన వారికి మరింత మెరుగైన ప్యాకేజీని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కె.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి విజయ్ కుమార్, ఎస్.ఐ.బి (ఇంటెలిజెన్స్) ఐజిపి బి. సుమతి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో మావోయిస్టుల పునరావాస పురోగతిని ముఖ్యమంత్రికి వివరిస్తూ, గత రెండేళ్లలో ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 591 మంది మావోయిస్టులు జనజీవ స్రవంతిలో కలిసి సాధారణ పౌరులుగా జీవిస్తున్నారని డిజిపి బి.శివధర్ రెడ్డి తెలిపారు. పోలీసు శాఖ సమన్వయ కృషి, ప్రభుత్వం అమలు చేస్తున్న మెరుగైన పునరావాస విధానాల వల్ల అగ్రనేతల్లో సైతం మార్పు వచ్చిందని ఆయన వివరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మాజీ మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యులు, పొలిట్ బ్యూరో సభ్యుడు తిపిరి తిరుపతి అలియాస్ దేవుజీ అలియాస్ రమేష్ అలియాస్ సంజీవ్ అలియాస్ చేతన్ అలియాస్ కుమ్మ దాదా (సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇన్‌చార్జ్), మాజీ సెంట్రల్ కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న అలియాస్ చంద్రన్న అలియాస్ సోమన్న, పోతుల పద్మావతి అలియాస్ కల్పన అలియాస్ మైనాబాయి అలియాస్ మైనక్క అలియాస్ సుజాతలతో పాటు మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు బడే చొక్కారావు అలియాస్ దామోదర్ (తెలంగాణ >>2



విచారణకు దానం
# గైర్హాజర్
## మార్చి 2కు వాయిదా
### నేడు కడియం శ్రీహరి అనర్హతపై విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి27:** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణలో భాగంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందరిపై దాఖలైన పిటిషన్లను అసెంబ్లీ స్పీకర్ శుక్రవారం విచారించారు. దానం పార్టీ మారారని ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిలు దాఖలు చేసిన పిటిషన్లపైన స్పీకర్ చాంబర్లో విచారణ జరిగింది. అయితే, ఈ విచార >>2

ఎపి కౌన్సిల్ విపక్షనేత
# బొత్స ఆస్పత్రిలో చేరిక
## బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందన్న వైద్యులు



**హైదరాబాద్ (జూబ్లీ హిల్స్), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** వైస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి, శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. దీంతో అతన్ని గురువారం రాత్రి హుటాహుటిన హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న సిటీ న్యూరో సెంటర్‌కు తరలించారు. ఆయనకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన ఆసుపత్రి వైద్యులు స్వల్ప బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు గుర్తించారు. దీంతో ఆయనను ఆసుపత్రిలో చేర్చించుకొని వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మరోవైపు బొత్స ఆరోగ్యంపై పలువురు వైసీపీ నేతలు ఆరా తీసు_న్నారు. ఆయన ఆరోగ్య >>2



శుక్రవారం జైసల్మేర్‌లో 'ప్రచండ' యుద్ధ విమానం అధిరోహించిన రాష్ట్రపతి ముర్ము

యుద్ధ హెలికాప్టర్ 'ప్రచండ'లో
# రాష్ట్రపతి ముర్ము విహారం

**జైసల్మేర్, ఫిబ్రవరి 27:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం లైట్ కంబాట్ హెలికాప్టర్ ప్రచండ్‌లో విహరించారు. సుమారు 25 నిమిషాల పాటు ఆమె సోర్టీ నిర్వహించారు. భారత్, పాకిస్థాన్ బోర్డర్‌లో ఉన్న జైసల్మేర్ జిల్లాలో ముర్ము విహరించారు. జైసల్మేర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి హెలికాప్టర్ టేకాఫ్ తీసుకున్నది. టేకాఫ్‌కు ముందు ఆ హెలికాప్టర్ గురించి రాష్ట్రపతి ముర్ముకు కెప్టెన్ బ్రీఫింగ్ ఇచ్చారు. కాక్‌పిట్ నుంచి ఆమె చేతులు ఊపారు. సైనిక దళాల సుప్రీం కమాండర్ హోదాలో ముర్ము విహరించారు. స్వయం సమృద్ధికి శక్తివంతమైన సంకేతంగా ప్రచండ హెలికాప్టర్ >>2

జిహెచ్‌ఎంసి స్థానంలో
# కోర్ అర్బన్ చట్టం



**ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వ కార్యాలయాలు వడివడిగా నిర్మించాలి**

**చెరువులు, కుంటల అభివృద్ధికి ప్రాధాన్యం**

**మున్సిపల్, పట్టణాభివృద్ధిపై సిఎం రేవంత్ సమీక్ష**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి27:** అవుటర్ రింగురోడ్డు పరిధిలోని (కోర్ అర్బన్) మూడు కార్పొరేషన్లకు వర్తించేలా గ్రేటర్ హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ) చట్టంస్థానంలో కోర్ అర్బన్ చట్టం తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అనుమతులు, రుసుములు, అభివృద్ధి పనుల నిర్వహణ, ఇతర వ్యవహారాలన్నింటికి ఆ చట్టమే ఆధారంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 99 రోజుల కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలో చేపట్టే పనులు తొలుత చేపడతామని సీఎం తెలిపారు. ఎంఏయూడీపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కోర్ అర్బన్ ఏరియాలో పారిశుద్ధ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పలు ప్రాంతాల్లో చెత్త ఎక్కడి వేయాలో తెలియక ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారని.. ముందుగా చెత్త వేయాల్సిన ప్రాంతాలను గుర్తించి అక్కడ బోర్డులు ఏర్పాట్లు చేయాలని >>2



చిలుకూరు ఆలయ ప్రధానార్చకులు
# సౌందర రాజన్ కన్నుమూత

**మొయినాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన చెరుకుల్ బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సౌందర్యరాజన్(80)గురువారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా వృద్ధాప్య సమస్యతో బాధపడుతు మృతి చెందారు. గత 40సంవత్సరాలుగా అర్చకత్వంతో పాటు విద్యావేత్తగా పేరుంది. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రిజిస్టర్‌గాను సేవలందించారు.

# కొందరి పా'పాలు' ఎందరికో శాపాలు!

**యూరియా, డిటర్జెంట్లు, రసాయనాలతో కల్తీ**

**ఉత్పత్తి పెంచేందుకు హార్మోన్ల ఇంజెక్షన్లు**

**బ్రాండెడ్ కంపెనీల ప్యాకెట్లలో కల్తీపాలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కృత్రిమ, కల్తీ పాలు టెర్రర్ పుట్టిస్తున్నాయి. తెలంగాణలో పాల ఉత్పత్తి స్తంభించిపోవడంతో పాల కొరత ఏర్పడింది. దీంతో కల్తీ పాలకు అవకాశం ఏర్పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పశు సంపద (ఆవులు, గేదెలు) తగ్గడం, గ్రామీణ ప్రాంతాల నుండి పాల సేకరణ తగ్గిపోవడం దీనికి ప్రధాన కారణాలు. పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం సబ్సిడీపై పశువులను పంపిణీ చేసే ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. తెలంగాణలో రోజుకి సుమారు 26 లక్షల లీటర్ల పాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో ఉత్పత్తవుతున్న పాలు కేవలం 4 లక్షల లీటర్ల వరకు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఇది రాష్ట్ర అవసరాలను తీర్చేందుకు సరిపడే స్థాయిలో లేదు. పాడిపశువుల సంఖ్య తగ్గడం వల్ల పాల ఉత్పత్తిలో గణనీయమైన కోత వచ్చింది. ఇప్పటికే పాడిరైతులు పోసే పాలు రోజుకి కేవలం 50 వేల లీటర్ల వరకు తగ్గిపోవడం ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆవుల సంఖ్య 2019లో 42,32,383 ఉండగా, ఇప్పుడు 27.48 శాతం మేర 30,69,524కు తగ్గింది. >>2

# కృష్ణపై అక్రమ ప్రాజెక్టులు అడ్డుకోండి
## కెఆర్ఎంబికి తెలంగాణ ఫిర్యాదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** కృష్ణా నీటిని అక్రమంగా తరలించేందుకు ఏపీ ప్రభుత్వం పలు అక్రమ ప్రాజెక్టులను చేపడుతోందని తెలంగాణ సంచలన ఆరోపణలు చేసింది. దాదాపు రూ.47,776 కోట్లతో అనుమతుల్లేని నిర్మాణాలు చేపడుతోందని కెఆర్ఎంబికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ ఓవీ రమేష్ బాబు 7 పేజీల లేఖను శుక్రవారం కెఆర్ఎంబికి రాశారు. ఏపి ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులతో పాటు పాతవాటి సామర్థ్యం పెంచుతోందని తెలంగాణ ఆరోపించింది. పోతిరెడ్డిపాడు కెపాసిటీ పెంపు, హంద్రీ నీవా, గాలేరు నగరి, శ్రీశైలం రైట్ బ్యాంకు కెనాల్ (ఎస్ఆర్‌బిసి), తుంగభద్ర ప్రాజెక్టులకు శ్రీశైలం నుంచి నీటిని అక్రమంగా తరలించాలని చూస్తోందని విమర్శించింది.



శుక్రవారం అమరావతిలో ఏపి సిఎం చంద్రబాబుని కలుసుకొని శుభలేఖ అందజేస్తున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

# ఎపి సిఎం చంద్రబాబుతో తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి భేటీ

● కుమారుడి వివాహానికి ప్రత్యేక ఆహ్వానం

**విజయవాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి సిఎం చంద్రబాబును తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమారుడి వివాహానికి హాజరు కావాలని చంద్రబాబును భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనుంది. ఈ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు కలిసి చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల నేతలు కాసేపు ముచ్చటించుకున్నారు. ఈ సమావేశం పూర్తిగా మర్యాద పూర్వకంగానే జరిగిందని, ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టమవుతోంది. తన కుమారుడి వివాహ వేడుకకు హాజరై వధూ వరులను ఆశీర్వదించాలని చంద్రబాబును భట్టి విక్రమార్క కోరారు. ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క, తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అయ్యన్న పాత్రుడిని కలిశారు. ఈ సందర్భంగా తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి రావాల్సిందిగా భట్టి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వారు కాసేపు ముచ్చటించుకున్నారు. కాగా, మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో భట్టివిక్రమార్క తనయుడి వివాహం జరగనుంది.

# ప్రజలతో కలిసి నడవండి

>> రాష్ట్ర కమిటీ కార్యదర్శి), నూనే నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రాహుల్ అలియాస్ సన్ను ఉన్నారు. సాయుధ పోరాటాన్ని వీడి ప్రధాన స్రవంతిలోకి వచ్చేందుకు అవకాశం కల్పించినందుకు వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ భేటీలో వారు చేసిన విజ్ఞప్తులకు సానుకూల పరిష్కారం చూపుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రితో భేటీకి వెళుతున్న సమయంలో మీడియా ప్రతినిధులు 'సీఎంతో ఏం చర్చిస్తారు?' అని ప్రశ్నించగా, అగ్రనేత దేవ్‌జీ స్పందిస్తూ 'పొలిటికల్ ఎజెండా' అని క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. దీనితో వీరంతా భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందన్న సంకేతాలు వెలువడుతున్నా యి. లొంగిపోయిన నేతల పునరావాసం, వారి కుటుంబాల భద్రతపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం వీరు చేపట్టబోయే తదుపరి కార్యాచరణపై సీఎంకు వివరించినట్లు సమాచారం. ప్రభుత్వం అనుమతిస్తే జైల్లో ఉన్న మావోయిస్టులను కలుస్తామని మావోయిస్టు నేతలు పేర్కొన్నట్లు సమాచారం. మావోయిస్టులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు బాగున్నాయని మావోయిస్టులు అన్నారు. ఈ ప్రభుత్వ లొంగుబాటు పాలసీ బాగుందని సీఎంకు మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ తెలిపారు. తమ భవిష్యత్ ప్రణాళికలపై సీఎం రేవంత్‌రెడ్డికి మావోయిస్టు అగ్రనాయకులు వివరించినట్లు సమాచారం.

# అభివృద్ధికి ఊతం

>> యన్నారు. ఈ భారీ కేటాయింపులు ప్రైవేట్ రంగానికి ఒక సంకేతమని , బడ్జెట్‌లోని విషయాలపై మరింత చర్చ జరిపేకంటే దాని తక్షణ అమలుపై దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ వాటాదారులను కోరారు. బడ్జెట్ గురించి చర్చించడం దీని ఉద్దేశం కాదు. వీలైనంత త్వరగా బడ్జెట్‌ను అమలు చేయడం, అది సులభమైన మార్గంలో చేయడం దీని ఉద్దేశం. వాటాదారులందరూ దీని నుంచి ప్రయోజనం పొందాలి. బడ్జెట్‌ను కేవలం స్వల్పకాలిక వ్యాపార పత్రంగా చూడకూడదు. అది ఒక విధానపరమైన మార్గదర్శి. బడ్జెట్ ప్రభావాన్ని పటిష్టమైన, వాస్తవిక పారామితులపై అంచనా వేయాలి. ఇలాంటి విధానాలు మౌలిక సదుపాయాలను విస్తరించాలి. రుణ లభ్యతను మరింత సరళతరం చేయాలన్నారు. సులభతర వాణిజ్యాన్ని పెంచాలని, పాలనలో పారదర్శకత పెంచి ప్రజల జీవనం మరింత సులభతరం కావాలి. బడ్జెట్‌లో వీటికి సంబంధించిన నిర్ణయాలు మాత్రమే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయన్నారు. ప్రతీ బడ్జెట్ ఒక పెద్ద లక్ష్యాన్ని చేరుకునేందుకు వీలవుతుందని అలాగే ఆర్థిక రంగం గురించి కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చించారు. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి బాండ్ మార్కెట్లను మెరుగుపరిచేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడి చట్రాన్ని మరింత అనుకూలంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. విదేశీ పెట్టుబడి చట్రాన్ని సులభతరం చేస్తున్నామని, దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి బాండ్ మార్కెట్లను మరింత చురుగ్గా చేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నాం. బాండ్లను కొనుగోలు, అమ్మడం వంటి ప్రక్రియను సులభతరం చేస్తున్నాం. దీర్ఘకాలిక వృద్ధికి దోహదపడే బాండ్ మార్కెట్ సంస్కరణలను మనం చూడాలి. స్థిరమైన విదేశీ మూలధనాన్ని ఆకర్షించడానికి మనం సరికొత్త సాధనాలను తీసుకురావాలన్నారు.

# జిహెచ్ఎంసి స్థానంలో కోర్ అర్బన్ చట్టం

>> సూచించారు. ఆ తర్వాత నిర్దేశిత ప్రాంతాల్లో కాకుండా ఇష్టారీతిగా ఎక్కడిపడితే అక్కడ చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. కోర్ అర్బన్ ఏరియాలో రోడ్ల నిర్మాణ విషయంలో బాధ్య తాయుతంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఉపాధిహామీలో రోడ్ల నిర్మాణం నిర్దేశిత కాలం వరకు మళ్లీ వేయడానికి అనుమతులు రావని.. అలాంటి సాంకేతికతను వినియోగించాలని సీఎం సూచించారు. రోడ్డు నిర్మించిన తర్వాత దాని జీవిత కాలం ఎంతనేది నిర్ణయించి.. ఆ లోపు దానిని తొలగించినా... అక్కడ మళ్లీ రోడ్డు వేసినా అందుకు బాధ్యులు ఎవరో తేల్చాలని సీఎం ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో ప్రతి వీధి దీపం వెలుగుతుందో లేదో డ్యాష్ బోర్డులో కనిపించాలని సీఎం అన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే దానిని వెంటనే తెలుసుకొని పరిష్కరించాలన్నారు. కోర్ అర్బన్ ఏరియాలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. నగరంలోని అన్ని హోటళ్లలోని కిచెన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని సిఎం ఆదేశించారు. తరచూ తనిఖీలు చేపట్టడంతో పాటు పర్యవేక్షణ కొనసాగాలన్నారు. ఫుడ్ సేఫ్టీకి ఆయా హోటళ్లు తీసుకుంటున్న చర్యలను మదింపు చేసి వారికి రేటింగ్స్ ఇవ్వాలని సీఎం సూచించారు. కోర్ అర్బన్ ఏరియాలో ఫైర్ సేఫ్టీకి పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. 50 అంతస్తులకు పైగా భవంతులు నిర్మాణాలు జరుగుతున్నాయని. అంత ఎత్తులో అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన అధునాతన సామగ్రి, సాంకేతికతను సమకూర్చుకోవాలని సిఎం సూచించారు. నగరంలోని సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని ఇఎం సూచించారు. అదే సమయంలో యూనిపోల్స్‌ను ఏర్పాటు చేసి వాటిని మల్టీ యుటిలిటీ పోల్స్‌గా ఉపయోగించాలని సీఎం తెలిపారు. వివిధ యాజమాన్యాల పరిధిలో రోడ్లు ఉండడంతో ఉన్న గందరగోళాన్ని తొలగించాలని పేర్కొన్నారు. పనుల్లో ఏకరూపత, పనుల వేగవంతానికి ఇది తోడ్పడుతుందని సిఎం అన్నారు. నగరంలో వివిధ ప్రదేశాల్లో రద్దీ తగ్గించేందుకు డిజైన్ చేసిన ఎలివేటెడ్ కారిడార్ల నమూనాలను అధికారులకు ప్రదర్శించారు. వాటిని పరిశీలించిన సీఎం పలు సూచనలు చేశారు. చారిత్రాక ప్రాధాన్యం గల కట్టడాలను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని.. వాటిని పర్యాటక స్థలాలుగా మార్చాలని సీఎం సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అక్కడ అవసరమైన అనుమతులు వెంటనే తీసుకోవాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాల పనులు వేగవంతం చేయాలని సీఎం సూచించారు. నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరంలోని పెద్ద చెరువులు, కుంటల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైడ్రా పరిరక్షి ంచిన చెరువుల చుట్టూ కట్టలు కట్టి వదిలి వేయకుండా వాటి రక్షణతో పాటు సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.



శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీని కలిసి రిసెప్షన్‌కు ఆహ్వానించిన కొత్త దంపతులు విజయ్-రష్మిక

# ఎందరికో శాపాలు!

>> అలాగే గేదెలు సంఖ్య 42,26,603 నుంచి 27.78 శాతం చొప్పున 30,52,102కి తగ్గాయి. ఈ నేపథ్యంలో పాలకు కొరత ఏర్పడి కల్తీకి దారి తీస్తోంది. యూరియా, రసాయనాలతో పాలకల్తీ జరుగుతుండగా, పాల ఉత్పత్తి పెంచేందుకు పశువులకు హార్మోన్ల ఇంజెక్షన్లు ఇస్తూ వినియోగదారుల ప్రాణాలు, ఆరోగ్యాలతో అక్రమార్జన పరులు ఆటలాడు తున్నారు. ఎపిలోని రాజమండ్రిలో కల్తీపాలు తాగి దాదాపు ఆరుగురు మృతిచెందారు. రాష్ట్రంలో పాల సేకరణ, పాల తయారీ, డెయిరీలను పరిశీలిస్తున్న అధికారులకు షాకింగ్ కలిగించే దారుణ కల్తీలు బయటపడుతు న్నాయి. ఈ నేపథ్యంలో షాద్‌నగర్‌లో రసాయనాలతో తయారుచేసిన పాలను మిక్స్ చేసి అమ్ముతున్న విషయం గుర్తించారు. కాగా రాష్ట్రంలో గతం నుండి కల్తీ పాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే వీటిపై అధికారులు దృష్టిసారించక పోవడంతో కల్తీ పాల వ్యాపారం యదేచ్ఛగా సాగుతుందనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలో యూరియా, డిటర్జెంట్లు, వంటనూనె, రసాయనాలు, కొన్ని అసలు పాలతో కృత్రిమ పాలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ ఫ్యాట్ వచ్చే విడిపాలు మంచివని అనుకుంటే, వాటిలో వెన్న తీసి డాల్డా కలుపుతున్నారు. కొంతమంది పాలలో నీళ్లు, యూరియా కలిపి మిల్క్ క్వాంటిటీని పెంచుతారు. దీనివల్ల కల్తీ పాలు చిక్కగా, తెల్లగా కనిపిస్తాయి, అసలు కల్తీ జరిగిందనే విషయమే తెలియదు. పాలలో డిటర్జెంట్ మిక్స్ చేస్తున్నారు. దీంతో పాలు నురగ వచ్చి చిక్కగా కనిపిస్తాయి. ఇవి తాగితే స్టమక్ ప్రాబ్లమ్స్ వస్తాయి.

# నేను కాదు.. మీ అహంకారమే ఓటమికి కారణం

## వాస్తవాలు ఒప్పుకోవాలంటూ కెటిఆర్‌కు కవిత కౌంటర్

**హైదరాబాద్, ఫిబ్రవరి27 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** వాస్తవాలు ఒప్పుకో అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితకు క్లీన్ చిట్ ఇస్తూ వచ్చిన తీర్పుపై కేటీఆర్ స్పందించారు. మద్యం కుంభకోణం పేరుతో ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని కూల్చివేశారని, తెలంగాణలో ఆ కారణంగానే బీఆర్ఎస్ ఓడిపోయిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కవితకు అనుకూలంగా వచ్చిన తీర్పుతో న్యాయం జరిగిందని అన్నారు. మద్యం కుంభకోణం కారణంగానే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం పాలైందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోదరుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టును చూశానని, తనపై పెట్టిన కేసు వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందన్నట్లుగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలను నేను సూటిగా ప్రశ్నిస్తున్నానని, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి నేనే కారణమా సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రజలకు ఇళ్లు, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, అభ్యర్థులను మార్చకుండా దోపిడీదారులకే తిరిగి టిక్కెట్లు ఇవ్వడం, అన్నింటికంటే ముఖ్యంగా మీ అహంకార ధోరణి ఓటమికి కారణమని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈరోజు కోర్టు తీర్పును మీకు అనుకూలంగా మార్చుకుని మాట్లాడటం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ ఓటమిని నా మెడలో వేయాలని చూస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఇప్పటికైనా మీరు ప్రజల తీర్పును గౌరవించాలని కేటీఆర్‌కు సూచించారు. తాను రాజకీయ పార్టీని ప్రకటించిన తర్వాత చాలా సర్‌ప్రైజ్‌లు ఉంటాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే రెండు నెలల్లో కొత్త పార్టీని స్థాపించబోతున్నట్లు తెలిపారు. రాజకీయం చేయాలంటే ధైర్యం ఉండాలని, ఓటమిని సైతం అంగీకరించే మనస్తత్వం లేదన్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసు ఇంకా ఉంద ని బీజేపీ నేతలు మాట్లాడటం విడ్డూర మేఅన్నారు. తనను ఐదు నెలలపాటు జైల్లో పెట్టి క్షోభకు గురిచేశారని అన్నారు. తనకు ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఎవరూ పెద్దగా తెలియదని వెల్లడించారు. సంజయ్ సింగ్ ఎంపీ కాబట్టి పరిచయం ఉండేదని అన్నారు. మద్యం కేసులో క్లీన్ చిట్ వచ్చాక మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు తనను అరెస్టు చేసినప్పుడు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. సమస్యలు ఉన్నప్పుడు తాను షో చేయడానికి ఎప్పుడూ వెళ్లనని కవిత తెలిపారు. కుమ్మెర జాతర ఘటనపై తాను ఆ రోజే ఎస్పీతో మాట్లాడానని వెల్లడించారు. నింది తులకు తగిన శిక్ష పడాలని బాధిత కుటుంబం, తాము కోరుకుంటున్నామని అన్నారు. సమాజం పట్ల మన కంటే లక్ష రెట్ల అవగాహన మావో యిస్టు అగ్రనేతలకు ఉందని కవిత పేర్కొన్నారు. నేను సమాజంలో ఉండి పోరాడితే, వారు అడవుల్లో ఉంటూ సమాజం కోసం పోరాటం చేస్తు న్నారని ప్రశంసించారు. మావోయిస్టులు లొంగిపోయి సిద్ధాంతాన్ని బ్రతికించారని అన్నారు. గాంధీ సరోవర్‌ప్రాజెక్టు కింద గాంధీ విగ్రహం పెట్టడాన్ని తప్పుపట్టదలుచుకోలేదని కవిత తెలిపారు. కానీ అన్ని ఇళ్లు కూలగొట్టడం ఎందుకని ప్రశ్నించారు.

# బాల్క సుమన్ కస్టడీ పిటిషన్ కొట్టివేత

**మంచిర్యాల, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా జరిగిన అల్లర్ల కేసులో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌పై పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే బాల్క సుమన్ సహా పలువురు నాయకులపై కేసులు నమోదు చేసిన పోలీసులు, వారిని కోర్టులో హాజరుపరచగా గతంలోనే 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. అయితే, విచారణ నిమిత్తం 4 రోజుల కస్టడీతో పాటు పిటి వారంట్ మంజూరు చేయాలని రామకృష్ణాపూర్ పోలీసులు పిటిషన్ వేశారు. శుక్రవారం ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం జిల్లా ప్రిన్సిపల్ జడ్జి వీరయ్య పోలీసుల కస్టడీ పిటిషన్‌ను, పిటి వారంట్‌ను రద్దు చేశారు. కాగా, బాల్క సుమన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం సాయంత్రం వాదనలు ముగియగా, తీర్పును కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

# రాష్ట్రపతి ముర్ము విహారం

>> నిలుస్తుందని, జైసల్మేర్ జిల్లాలో విహరిస్తున్నానని, మన వీరోచిత సైనికులకు హృదయపూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నానని ముర్ము ఆ హెలికాప్టర్ కాక్‌పిట్ నుంచి సందేశం వినిపించారు. సైనికులకు సెల్యూట్ చేస్తున్నా౦ని, జై హింద్, జై భారత్ అని ఆమె అన్నారు. పోక్రాన్ ఫైరింగ్ రేంజ్ సమీపంలో హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. ఇక్కడే ఇవాళ సాయంత్రం వాయు శక్తి పేరుతో విన్యాసాలు నిర్వహించను న్నారు. ఇవాళ్టి సోర్టీతో యుద్ధ హెలికాప్టర్‌లో ప్రయాణించి తొలి భారత రాష్ట్రపతిగా ముర్ము రికార్డు క్రియేట్ చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో ఆమె అంబాలా ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన విషయం తెలిసిందే. 2023 ఏప్రిల్‌లో ఆమె సుఖోయ్ 30 ఎంకేఐ ఫైటర్ ప్లేన్‌లో ఎగిరారు. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ ఎల్‌సీహెచ్ ప్రచండ హెలికాప్టర్‌ను నిర్మించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని డిజైన్ చేసి డెవలప్ చేశారు. అడ్వాన్స్‌డ్ ఏవియానిక్స్, స్టీల్త్ ఫీచర్స్, నైట్ అటాక్ కెపాసిటీ, ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్ తీసుకెళ్లే సామర్థం దీనికి ఉన్నది.

# విచారణకు దానం గైర్హాజర్

>>ణకు దానం నాగేందర్ గైర్హాజరు అయ్యారు. దానం తరుపు న్యాయవాదులను పిటిషనర్ల తరుపు అడ్వకేట్లు క్రాస్ ఎగ్జామిన్ చేశారు. ఆధారాలకు సంబంధించిన అఫిడవిట్‌లను దానం న్యాయవాదులు దాఖలు చేయలేదని తెలిసింది. తదుపరి విచారణను మార్చి 2వ తేదీకి స్పీకర్ నాయిదా వేశారు. విచారణను స్పీకర్ ముందు ఇరువర్గాలు తమ వాదనలు మౌఖికంగా వినిపించనున్నారు. శనివారం స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్ పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టనున్నారు. కడియం సిటిషన్ విచారణతో పది మందిపైన దాఖలైన పిటిషన్లను స్పీకర్ విచారించినట్లు అవుతుంది. కాగా, ఎనిమిది నుంచి ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను విచారించిన స్పీకర్. గడ్డం ప్రసాద్ కుమార్ వాటిని ఇటీవల కొట్టివేశారు. ప్రస్తుతం దానం, కడియంల పిటిషన్ల విచారణను స్పీకర్ కొనసాగిస్తున్నారు. ఈ విచారణ సందర్భంగా అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రివార్డ్ పాలసీ రూ.కోటి ఇవ్వండి: దేవ్‌జీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి27:** తెలంగాణ ప్రభుత్వం సరెండర్ పాలసీ బాగుందని లొంగిపోయిన మాజీ మావోయిస్ట్ దేవ్‌జీ అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డితో భేటీ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. రివార్డ్ పాలసీని రూ.కోటీకి పెంచాలని కోరాం. 5 ఎకరాల భూమి ఇవ్వడం సాధ్యం కాదని సిఎం అన్నారు. ఇల్లు, ఉద్యోగం, జీవన భృతిపై హామీ ఇచ్చారు. ప్రభుత్వం అనుమతిస్తే జైళ్లలో మావోయిస్టులను కలుస్తాం. అందరం కలిసి ప్రజలకు బహిరంగం లేఖ రాస్తాం. తుపాకీ సిద్ధాంతం నడవదని వివరిస్తాం అని దేవ్‌జీ తెలిపారు.

# బొత్స ఆస్పత్రిలో చేరిక

>> పరిస్థితి అడిగి తెలుసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు కీలకనేతలు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. బోత్స ఆరోగ్య విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆసుపత్రి వైద్యులు వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## వారం - వర్జ్యం

28-02-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
ద్వాదశి రా.8.45
పునర్వసు ఉ.9.35
వర్జ్యం : సా.5.15-6.47
దు.ఉ.6.27-8.02
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** మీరు చేపట్టే కార్యక్రమములకు చిన్నచిన్న ఆటంకములు ఎదురం అవుతాయి. మిత్రుల కలయిక.

**వృషభం:** మీ అభిప్రాయములను కొన్ని సలహాలను, ఉన్నతాధికారులు సైతం పాటించడం మీకు సంతృప్తిని కలిగిస్తుంది.

**మిథునం:** గతములో మీరు పోగొట్టుకున్న ఉద్యోగమును తిరిగి పొందగలుగుతారు. ఆహారము పట్ల తగిన జాగ్రత్తలను తీసుకోండి.

**కర్కాటకం:** విధానపరమైన ముఖ్య విషయములయందు మీ అభిప్రాయాలలో రాజీ ధోరణీ ఏర్పడుతుంది.

**సింహం:** ముఖ్య చర్చలు పురోగమిస్తాయి. వ్యవహారాలలో స్పష్టత లోపిస్తుంది. మాటమీద నిలబడే వ్యక్తిగా పేరును సంపాదిస్తారు.

**కన్య :** వ్యాపారంలో రొటేషన్స్ బాగున్నప్పటికీ లాభాలు మీరు ఆశించిన స్థాయిలో ఉండవు. చేతివృత్తి పనివారికి అనుకూలం.

**తుల :** ఒదిగి ఉంటేనే ప్రయోజనాలు చేతికి అందివస్తాయని భావిస్తారు. అదే విధంగా నడుచుకుంటారు. సోదరులను కలుస్తారు.

**వృశ్చికం:** ఇ-మెయిల్స్ ద్వారా లేక ఫోన్ సంభాషణ ద్వారా మీకు ఉపకరించే సమాచారం అందుకుంటారు. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

**ధనుస్సు:** రాజకీయం, పారిశ్రామిక వర్గాలవారికి అన్ని విధాల ప్రోత్సాహం లభిస్తుంది, తనఖా వస్తువులను విడిపిస్తారు.

**మకరం :** గృహం మార్పుచేయటం కానీ, మరమ్మత్తు చేయడం గానీ జరుగుతుంది. ఉద్యోగస్థులకు అనుకూలం.

**కుంభం:** పెండింగ్‌లో రిజిస్ట్రేషన్ పనిపైన దృష్టిని సారిస్తారు. విద్య, వారసత్వ వాణిజ్య రంగాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**మీనం:** జీవిత భాగస్వామితో సలహాలు సంప్రదింపులు సాగిస్తారు. మీ కష్ట సుఖాలను చర్చించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కేజ్రీవాల్, కవితకు క్లీన్ చిట్

>> శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ కుమార్ సింగ్, చాన్‌ప్రీత్ సింగ్, కె కవిత, అరవింద్ కేజ్రీవాల్, దుర్గేష్ పాఠక్, అమిత్ అరోరా, వినోద్ చౌహాన్, ఆశిష్ చంద్ మాథుర్, శరత్ రెడ్డి. దర్యాప్తులో జరిగిన లోపాలకు సిబిఐని కోర్టు తీవ్రంగా విమర్శించింది. ఈ 'భారీ చార్జిషీట్‌లో ఏ సాక్షి లేదా వాంగ్మూలం లేకుండా అనేక లోపాలు ఉన్నాయని కోర్టు పేర్కొంది. సిసోడియాపై ప్రాథమికంగా కేసును రూపొందించడంలో సిబిఐ విఫలమైందని కోర్టు పేర్కొంది. కేజ్రీవాల్‌ను ఎటువంటి ఆధారాలు లేకుండానే నిందితుడిగా చేర్చారని న్యాయమూర్తి తెలిపారు. తీర్పు ప్రకటిస్తూ, వేల పేజీల సిబిఐ చార్జిషీట్‌లో సాక్షుల వాంగ్మూలాలకు మద్దతు ఇవ్వని అంశాలు ఉన్నాయని కోర్టు పేర్కొంది. చార్జిషీట్‌లో తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు ఉన్నాయని కూడా న్యాయమూర్తి అన్నారు. సాక్షులు లేదా ఆధారాలు లేని లోపాలు చార్జిషీట్‌లో ఉన్నాయని కోర్టు తెలిపింది. ప్రధాన నిందితుడు కుల్దీప్ సింగ్‌ను విడుదల చేస్తూ, అతనిపై ఎటువంటి ఆధారాలు లేనప్పుడు అతన్ని మొదటి నిందితుడిగా ఎందుకు ఇరికించడం ఆశ్చర్యకరమని న్యాయమూర్తి అన్నారు. మద్యం పాలసీని రూపొందించడం, అమలు చేయడంలో బాధ్యత వహించిన వ్యక్తిగా సిసోడియాపై, అతని ప్రమేయాన్ని చూపించే ఆధారాలు లేవని, ఎటువంటి రికవరీ కూడా లేదని కోర్టు పేర్కొంది. ఈ చార్జిషీట్‌లో అంతర్గత వైరుధ్యాలు ఉన్నాయని, కుట్ర సిద్ధాంతం మూలాలను తాకుతున్నాయని కోర్టు పేర్కొంది. కేజ్రీవాల్ గురించి, న్యాయమూర్తి ఎటువంటి స్పష్టమైన ఆధారాలు లేకుండా ఆయనను ఇరికించారని తేల్చారు, ముఖ్యంగా రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తికి సంబంధించినప్పుడు ఇది చట్ట నియమాలకు విరుద్ధంగా ఉంటుంది. ఏ విధమైన ప్రకటన లేదా ఆధారాలు లేకుండా ప్రాథమిక ఆధారాలు లేనందున, కుట్రలో కేజ్రీవాల్‌ను ఆరోపించడాన్ని నిలబెట్టలేమని న్యాయమూర్తి అన్నారు. సిబిఐ అధికారిపై శాఖాపరమైన విచారణకు కూడా కోర్టు ఆదేశించింది. సీనియర్ న్యాయవాది రెబెక్కా ఎం జాన్, న్యాయవాది వివేక్ జైన్‌తో కలిసి మనీష్ సిసోడియా తరపున హాజరయ్యారు. సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్, న్యాయవాది ముదిత్ జైన్ కేజ్రీవాల్ తరపున హాజరయ్యారు. అభిషేక్ బోయిన్‌పల్లి తరపున న్యాయవాది సుమేర్ సింగ్ బొపరాయ్ హాజరయ్యారు. ఇక ఢిల్లీ లిక్కర్ స్కామ్, మనీ లాండరింగ్ ఆరోపణలతో అరవింద్ కేజ్రీవాల్‌ను మార్చి 21, 2024న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేసింది. ఈ కేసులో 9 సార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ కేజ్రీవాల్ విచారణకు హాజరు కాకపోవడంతో నేరుగా ఆయన ఇంటికి వెళ్లిన ఈడీ అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. అనంతరం తీహార్ జైలుకు తరలించారు. అయితే ఆయన తీహార్ జైల్లో ఉండగానే అవినీతి ఆరోపణ కేసులో జూన్ 26, 2024న సీబీఐ కూడా కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసింది. ఈ కేసులపై కేజ్రీవాల్‌ను సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం ఆయనకు 2024 సెప్టెంబర్‌లో బెయిల్ మంజూరు చేసింది. ఇప్పుడు తాజాగా ఈ కేసులో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని రౌస్ అవెన్యూ కోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. సిసోడియా దాదాపు 530 రోజులు జైలులో ఉన్నారు. అరవింద్ కేజ్రీవాల్ రెండు కాలాల్లో దాదాపు 156 రోజులు జైలులో గడిపారు. సిబిఐ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన తర్వాత, ఇడి కేసులో ఇప్పటికే తాత్కాలిక బెయిల్ పొందిన ఆయన చివరకు సెప్టెంబర్ 13, 2024న విడుదలయ్యారు. ట్రయల్ కోర్టు తీర్పును హైకోర్టులో సవాలు చేసిన సిబిఐ మద్యం పాలసీ కుంభకోణానికి సంబంధించిన అవినీతి కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, ఇతరులను విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ట్రయల్ కోర్టు న్యాయమూర్తి ఈ ఉత్తర్వు జారీ చేసిన కొన్ని గంటల తర్వాత ఈ మేరకు రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ట్రయల్ కోర్టు, దర్యాప్తులోని అనేక ముఖ్యమైన అంశాలను విస్మరించిందని, ఆ విషయాన్ని తగినంతగా పరిగణించలేదని కేంద్ర దర్యాప్తు సంస్థ పేర్కొంది.

**మోడీ, షాలు ఇప్పుడేం చెబుతారు: కేజ్రీవాల్**

ఢిల్లీ మద్యం కేసులోతనను నిరపరాధిగా స్థానిక రౌస్ ఎవెన్యూ కోర్టు ప్రకటించడం పట్ల ఢిల్లీ మాజీ సిఎం, ఆయన కేబినెట్లోని మాజీ మంత్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేసు నమోదైనప్పుడే.. తనకు ఎలాంటి సంబంధం లేదని, అసలు ఇది కేసే కాదని, ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయమని దీనిలో ఎవరికీ మేలు జరిగేలా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పానని కానీ, ఆనాడు తన మాటను ఎవరూ పట్టించుకోలేదని కేజ్రీవాల్ అన్నారు. అంతేకాదు. తనను అక్రమార్కుడిగా, అవినీతిపరుడిగా చిత్రీకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్‌షా, బిజెపి నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. నిజం ఇప్పటికి బయటకు వచ్చింది. కానీ, జరగాల్సిన అన్యాయం మాత్రం జరిగిపోయింది. ఇప్పుడు ఎవరు మాకు సమాధానం చెబుతారు? ప్రజలు ఇప్పటికైనా నిజాలు తెలుసుకోవాలి అని కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు వెలువరించిన తర్వాత.. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఊరేగింపుగా కేజ్రీవాల్‌ను తన నివాసానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మీడియా ముందు మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీని లేకుండా చేసేందుకు కుట్రలు చేశారని వ్యాఖ్యానించారు. ప్రజల్లోనూ తమ పరువు పోయేలా వ్యవహరించారని తెలిపారు. తనతోపాటు ఐదుగురు మంత్రులను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందారని అన్నారు. కానీ, నిజాలు ఎప్పుడూ బయటకు వస్తాయని.. కాకపోతే తమ విషయంలో మరింత ఆలస్యమైందని అన్నారు. ఇప్పటికైనా కోర్టు తమను నిర్దోషులుగా పేర్కొనడం ఆనందంగా ఉందన్నారు. దర్యాప్తు సంస్థలకు తమకు నచ్చినట్టుగా, తమ ఇష్టాను సారంగా వినియోగించు కుంటున్నారని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. సిబిఐ, ఇడిల పరువు ఇప్పుడు పోయిందని, ఇప్పటికైనా దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. రాజకీయ వేధింపులకు సంస్థలను వినియోగించుకుంటున్న మోడీ, షాలు కళ్లు తెరవాలని, రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలని, దొడ్డిదారిలో కేసులు పెట్టడం సరికాదని అన్నారు.



# కర్ణాటకలో మళ్లీ క్యాంపు రాజకీయాలు

**బెంగళూరు, ఫిబ్రవరి 26:** కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పు అంశం మరోసారి తీవ్ర చర్చనీయాంశమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గానికి చెందిన దాదాపు 30 మంది ఎమ్మెల్యేలు బెంగళూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రహస్యంగా సమావేశం కావడం రాజకీయంగా మళ్లీ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుక అని పైకి చెబుతున్నప్పటికీ అధికార మార్పిడిపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రెండున్నరేళ్ల తర్వాత పదవిని తనకు అప్పగిస్తారనే ఒప్పందం ఉందని డీకే శివకుమార్ వర్గం బలంగా వాదిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన తన బలాన్ని నిరూపించుకునేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. అయితే, ఐదేళ్లూ సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారని ఆయన వర్గం స్పష్టం చేస్తోంది. ఈ సమావేశంలో ఇద్దరు మంత్రులు కూడా పాల్గొనడం గమనార్హం. డీకే శివకుమార్ వర్గం ఇక్కడ సమావేశమైన సమయంలోనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మద్దతుగా ఉన్న 20 మందికి పైగా ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనలో ఉన్నారు. వారు మార్చి 1న తిరిగి రానున్నారు. మరోవైపు, ఈ పరిణామాలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ నాయకత్వ మార్పుపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతానికి ఎలాంటి గందరగోళం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా, సిద్ధరామయ్య మద్దతుదారులు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. ఒకవేళ ముఖ్యమంత్రిని మార్చా ల్సి వస్తే, దళిత నేతకు (మల్లి కార్జున ఖర్గే లేదా జి. పరమేశ్వర) అవకాశం ఇవ్వాలని కోరుతు న్నారు. బడ్జెట్ సమావేశాల తర్వాత మార్చిలో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు జరగవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంచేపట్టిన రెండున్నరేళ్ల తర్వాత అంతర్గత ఒప్పందాపై అటు సిద్ధరామయ్య, ఇటు డికె శివకుమార్ వర్గాలమధ్య కీచులాటలు పెరగిన సంగతి తెలిసిందే. ఇరువర్గాలు ఢిల్లీవరకూ వెళ్లి తమతమ వాదనాలు వినిపించినా ఇప్పటి వరకూ సిద్ధ రామయ్యదే పైచేయిగా నిలిచింది.

# మార్చి 15 నుంచి డిఇఇ సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభా తవార్త:** డిప్లొమా ఇన్ ఎలి మెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిడీఈఈ సెట్-2026)కి సంబంధించిన దరఖా స్తులను మార్చి 15 నుంచి స్వీక రించనున్నారు. ఇందుకు సంబం ధించిన నోటిఫికేషన్ బులెటిన్‌ను మార్చి 5న జారీ చేయనున్నట్లు డీఈఈ సెట్-2026 కన్వీనర్ జి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరం కోసం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్స్/ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ (డీఈఎల్.ఈడీ) (మైనారిటీ,నాన్‌మైనారిటీతో సహా)లో రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఆన్‌లైన్ విధానం ద్వారా టిజి డీఈఈ సెట్-2026 ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యు కేషన్(డీఈఎల్.ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యు కేషన్(డీపీఎస్ఈ) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తూ శుక్రవారం నోటిఫికేషన్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. డీఈఈ సెట్ పరీక్షను మే 21, 22 తేదిల్లో నిర్వహించనున్నారు. నోటిఫికేషన్‌కి సంబంధించిన బులెటిన్ మార్చి 5 నుంచి అందుబాటులో ఉండనుంది. మార్చి 15 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు లను ఏప్రిల్ 15 వరకు స్వీకరించనున్నట్లు కన్వీనర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ. 450 ఫీజు కాగా.. ఇతరులకు రూ. 500గా నిర్ణయించారు. ఫీజును ఆన్‌లైన్ చెల్లింపు గేట్‌వే ద్వారా మాత్రమే చెల్లించాలి.

అర్హత, సిలబస్, మోడల్ పేపర్, సంబంధిత సూచనలు, దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించే విధా నానికి సంబంధించిన సమాచార బులెటిన్ మార్చి 5 నుంచి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇతర వివరణల కోసం అభ్యర్థులు హెల్ప్ లైన్ నంబర్ 8317567404కు కాల్ చేయాలని కన్వీనర్ జి.రమేష్ ప్రకటనలో పేర్కొన్నారు.

# పారిశ్రామిక అభివృద్ధిలో ముందంజలో ఆంధ్ర

## ఎపి మంత్రి టిజి భరత్

**సచివాలయం,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :** పారిశ్రామిక అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టిజి భరత్ అన్నారు.శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిసెంబర్ 11న ఆర్‌బిఐ విడుదల చేసిన హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్,రిపోర్ట్సుపై వైసీపి సభ్యులు ఈ రిపోర్టును సరిగ్గా హోంవర్క్ చేయకుండా తమకు అనుకూలంగా ఉందని భావించి ప్రస్తావించారని కానీ,వాస్తవాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని వ ం ం ( తి తెలిపారు.450పేజీల రిపోర్టును వివరించగా అధ్యాయనం చేసిన తర్వాత కీలక వాస్తవాలు బయటపడ్డాయని టిజి భరత్ వెల్లడించారు.2019-20లో ఆంధ్రప్రదేశ్‌లో 16,924పరిశ్రమలు ఉండగా,2023-24నాటికి కేవలం 16,011కు తగ్గిపోయాయని అంటే వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వ హాయాంలో 913కంపెనీలు వెళ్ళిపోయాయని ఆయన చెప్పారు.ఇతర రాష్ట్రాలన్నీ పారిశ్రామిక వృద్ధిని సాధించగా ఏపి మాత్రం క్షీణత చూడడం బాధాకరమని మంత్రి అన్నారు.వైసీపీ సభ్యులు 2019-24కాలం ఫాంటాస్టిక్ అని చెప్పడం సెల్ఫ్‌గోల్ వేసుకోవడమేనని ఆయన వ్యంగ్యంగా అన్నారు.2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిందని మంత్రి తెలిపారు.ఎన్నికల ముందు వాగ్దానం చేసిన 20లక్షల ఉద్యోగాలను సృష్టించడానికి ముఖ్యమంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ప్రత్యేక జీవో ఏర్పాటు చేశామని,పార్టనర్‌షిప్ సమ్మిట్ మరియు క్యాబినెట్ క్లియరెన్స్ పొందిన ప్రాజెక్టులతో సహా రూ.20లక్షల కోట్లు పెట్టుబడులు రాబోతున్నాయని ఆయన వెల్లడించారు. ఫోర్బ్స్ డేటా ప్రకారం ఏప్రిల్ 2025నుండి డిసెంబర్ 2025 వరకు 9నెలల్లో రూ.ఒక కోటి పైబడిన పెట్టుబడల ఆకర్షణలో ఏపి 25.3శాతంతో అగ్రస్థానంలో నిలిచిందని టిజి భరత్ గర్వంగా తెలిపారు. అర్సెల్లార్ మిట్టల్ ప్రాజెక్టు పునాది వేడుకను వచ్చే నెలలో నిర్వహించనున్నామని భారత్ పెట్రోలియం ప్రాజెక్టు 2024లోనే ఖరారైందని,పిసిబిఎల్ కంపెనీ 2019-24కాలంలో కర్ణాటకకు వెళ్ళిపోయి ఇప్పుడు చంద్రబాబు తిరిగి రావడంతో ఏపికి తిరిగి వస్తున్నారని,ప్రీమియర్ ఇంజనీరింగ్ కంపెనీ రూ.50,000కోట్లు మార్కెట్ క్యాప్‌తో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు మారిందని మంత్రి వెల్లడించారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం వల్ల సాధ్యమైందని,యువత ఎన్‌డిఏ కూటమిపై అపారమైన నమ్మకం ఉందని మంత్రి అన్నారు.అర్‌బిఐ రిపోర్టు కాపీలను సమర్పిస్తున్నామని,వాస్తవాలు రుజువులతో సహా అందుబాటులో ఉన్నాయని,వైసీపీ ని ప్రజలు ఎప్పటికీ నమ్మవద్దని చెప్పారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎపి మంత్రి టి.జి.భరత్

# అనుభవంలేని టీచర్లతో విద్యాకమిషన్ సాధించేదేమిటి?

## బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు వ్యాఖ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 27:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యాకమిషన్ ఇచ్చిన నివేదికపై మాజీమంత్రి, బీఆర్ ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. అసలు విద్యావేత్తలే లేని కమిటీని వేసి, వారితో విద్యా విధానంపై నివేదిక ఇప్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు సరికాదని ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యాకమిషన్‌లో అసలైన విద్యావేత్తలు ఎక్కడ అని ప్రశ్నించారు. తెలంగాణ విద్యా కమిషన్‌లో స్కూల్ పిల్లలకు గానీ, కాలేజీ లేదా యూనివర్సిటీ స్థాయిలో బేసిక్ పాఠాలు చెప్పిన అనుభవం ఉన్న విద్యావేత్త ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. జర్నలిజం, మాస్ కమ్యూ నికేషన్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న ఇద్దరు ప్రొఫెసర్లు మినహా, ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ చేసిన వాళ్లు కానీ, స్కూల్ సిలబస్ తయారీలో, కోర్ సైన్స్ సబ్జెక్టుల్లో పట్టున్న వాళ్లు కానీ ఈ కమిటీలో ఒక్కరైనా లేరని పేర్కొన్నారు. ఈ కమిటీ చైర్మన్ ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అని పైగా ఆయనొక ఇంజనీర్ అని అన్నారు. ఆఫీసులు నడపడం వేరు. చదువులు చెప్పడం వేరు. పరిపాలనలో అనుభవం ఉన్నంత మాత్రాన. పిల్లల సైకాలజీ, పాఠాలు చెప్పే పద్ధతుల మీద పూర్తి అవగాహన ఉన్నట్టా. తెలంగాణ విద్యా భవిష్యత్తును మార్చేంత అర్హత, నైపుణ్యం ఈ కమిటీకి ఉందని మీరు నిజంగానే నమ్ముతున్నారా అంటూ ప్రశ్నించారు.

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యంత కీలకమైన విద్యా కమిషన్‌లో విద్యావేత్తలు, అనుభవం ఉన్న టీచర్లు, పిల్లల మనస్తత్వం తెలిసిన చైల్డ్ సైకాలజిస్టులు,సబ్జెక్ట్ నిపుణులు లేకుండానే రాష్ట్రానికి ఏకంగా ఒక కొత్త విద్యా విధానాన్ని తయారు చేయొచ్చనే గొప్ప ఆలోచన మీకే దక్కుతుందని పేర్కొన్నారు. సిలబస్ ఎలా ఉండాలి, బోధనా పద్ధతులు ఎలా ఉండాలి అనేది గ్రౌండ్ లెవెల్లో పాఠాలు చెబుతున్న సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్‌కు తెలుస్తుంది కానీ.. అసలు ఆ సంబంధమే లేని అధికారులకు, వేరే రంగాల వారికి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు.

విద్యావ్యవస్థ మీద కనీస అవగాహన లేకుండా, అర్హత లేని వారితో ప్రయోగాలు చేయడం అంటే తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని అన్నారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి ఎంత నిరక్ష ్యంగా గాలికి వదిలేశారో చెప్పడానికి ఈ కమిటీ ఏర్పాటే ఒక ఉదాహరణ అని విమర్శిం చారు. కొత్త విద్యా విధానం విషయంలో తెలంగాణలోని విద్యార్థులు, తల్లి దండ్రులు, టీచర్లు పారదర్శకతను కోరుకుం టున్నారని తెలిపారు. గడిచిన రెండేళ్లుగా విద్యాశాఖను గాలికి వదిలేసి, సబ్జెక్ట్ తెలిసిన విద్యావేత్తలకు ఈ బాధ్యత అప్పగించకుండా, సంబంధం లేని వారితో కమిటీ వేసి కాలయాపన చేసి ఏం సాధిం చినట్లని ఆరోపించారు. వేసిన కమిటీ ఎంత గొప్పగా ఉంటే, వారిచ్చిన నివేదిక ఇంకెంత గొప్పగా ఉంటుందో అర్థ మవుతున్నదని, విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు.

# దేశాభివృద్ధి బిజెపితోనే సాధ్యం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (సికిందరాబాద్), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** సికిందరాబాద్ నియోజకవర్గంలో జరి గిన బస్తీబాట కార్యక్రమంలో పాల్గొన్న అనం తరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సికిందరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... జనాభా పెరుగుదలతో హైదరాబాద్ కాంక్రీట్ జంగల్‌గా మారిపోతున్నదని, ఎవరు ఊహించనంతగా మన హైదరాబాద్ విస్తరిస్తోందన్నారు. దేశంలోని మిగి లిన నగరాలతో పోలిస్తే అటు పారిశ్రామికంగా, ఇటు ఐటి సెక్టార్‌గా, కమర్షియల్‌గా హైదరాబాద్ విస్తరిస్తోందని, అయితే హైదరాబాదులో మౌలిక వసతుల కల్పనలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతు న్నాయ న్నారు. ప్రకటనలు చేస్తున్నారు.. మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప హైదరాబాద్ అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు.

పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మంచి నీటి సమస్య, రోడ్ల సమస్య, మురికివాడల సమస్య, డ్రైనేజీ సమస్య.. ఇలా ఏ సమస్య కూడా పరిష్కరించ లేదన్నారు. హైదరా బాదులో ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితి ఎలా ఉందో తెలుసునని, ఎప్పుడు ఏ బిల్డింగ్ పడిపోతుందో తెలియని పరిస్థితిలో ఉన్నాయ న్నారు. హైద రాబాద్ నుంచి తెలంగాణకు 70శాతం రెవెన్యూ వస్తోం దన్నారు. హైదరాబాద్‌లో చేసిన పనులకు డబ్బులు కోసం జిహెచ్ఎంసి కాంట్రాక్టర్లు ధర్నాలు చేయాల్సి న పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వీధిలైట్లు వేయడం లేదని లాంతరులు పట్టుకుని బిజెపి కార్పొరేటర్లు ధర్నా చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. డ్రైనేజీలో సిల్టు తీసే పరిస్థితి లేదని, ఒకవేళ సిల్టు తీసిన వర్షాలకి అది మళ్లీ డ్రైనేజీల్లోకి చేరుతుందన్నారు. జనాభాకు తగ్గట్టు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవడం లేదని, హైదరాబాద్‌కు టెక్ కంపెనీలు వస్తున్నా యని, ఒకవేళ డేటా సెంటర్‌లు పెడితే వాటికి చాలా నీటి అవసరం ఉంటుందన్నారు. గతంలో టిఆర్ఎస్, కాంగ్రెస్ హైదరాబాద్ అభివృద్ధి కోసం ఎన్నో హామీలు ఇచ్చాయి.. కానీ ఏవీ అమలు కావడం లేదు. హైదరాబాద్లో చాలామంది ఆటో డ్రైవర్లు ఆత్మ హత్యలు చేసుకుం టున్నారని, బ్యాంకులో నుంచి అప్పులు తెచ్చి వడ్డీలు కట్టలేక ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడు తున్నారన్నారు. సీఎం మెట్రో గురించి మాట్లాడుతున్నారని, ఈ విషయంలో నాపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఎల్ అండ్ టీని టేకోవర్ చేసి, పాత మెట్రో కొత్త మెట్రో కలిపి డీపీఆర్ తయారుచేయాలన్నారు. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు వచ్చిన తర్వాత అప్పుడు కేంద్రానికి పంపాలన్నారు. అప్పుడు మేము దానిపై చర్చించి ఏ రకంగా ఉందో ఆలోచించి.. అప్పుడు క్యాబినెట్ అప్రూవల్ ఇస్తుందని వివరించారు. సంవత్సరం నుంచి కిషన్ రెడ్డి ఆపుతున్నాడని విమర్శి స్తున్నారని, అలాగైతే నిన్న మొన్న కేబినెట్లో ఎందుకు అప్రూవ్ అయిందని ప్రశ్నించారు. రెండున్నర సంవత్సరాలు పూర్తయిందని, ఇప్పటికి డిపిఆర్ పూర్తి పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ఎయిర్ పోర్ట్ లా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నిర్మిస్తున్నారని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి కావడానికి మరో ఏడాది పడుతుందన్నారు. 350 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతు న్నాయని, న్యూఢిల్లీ తర్వాత అత్యధికంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కోసమే ఖర్చు ఎక్కువ పెడుతున్నారని వివరించారు. సౌత్ సెంట్రల్ రైల్వేలో అత్యధిక ప్రాధాన్యత కలిగిన రైల్వే స్టేషన్ సికిందరాబాద్, 720 కోట్ల రూపా యలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నిర్మిస్తున్నా రన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో 60 యేళ్లుగా ఉంటున్న వారిని నిరాశ్రయులు చేయ డానికి మేము వ్యతిరేకిస్తు న్నామన్నారు. ఇప్పటికే ఉన్న రిటైనింగ్ వాల్ ప్రాంతంలో మూసిని అద్భుతంగా సుందరీ కరణ చేయొచ్చని, హైదరాబాదులో బస్తీల్లోని సమస్యలు పరిష్కరిం చడానికి డబ్బులు లేవు గానీ.. మూసీ ప్రక్షాళన చేస్తామని మాత్రం చెబుతున్నారన్నారు.

# ఉదారంగా ఎంఎస్‌ఎంఇల పరపతి అభివృద్ధికి దోహదం

## రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సందీప్‌కుమార్ సుల్తానియా




**హైదరాబాద్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** ఆర్థికవృద్ధికి, ఉపాధికల్పన ఉద్దీపన ఇచ్చే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజ్ ఎంఎస్‌ఎంఇలకు ఉదారంగా పరపతి కల్పించాల్సి న బాధ్యత బ్యాంకులు గుర్తించాలని ఆర్థిక ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటి 48వ త్రైమాసిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగాహాజరై ప్రసంగించారు. పర్యావరణ హితంగా ఎంఎస్‌ఎంఇలు ఉంటాయనీ వాటికి మద్దతుగా బ్యాంకులు ముందుకు రావాలని కోరారు.స్థిరమైన అభివృద్ధి దిశగా నడపడానికి సూక్ష్మ,చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజ్‌లు దోహదపడుతాయని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి సురేంద్రమోహన్ మాట్లా డుతూ తెలంగాణలో డిజిటల్ టెనెంట్ వెరిఫి కేషన్ ఇనిషియేటివ్‌ను ప్రారంభిస్తున్నామని తెలి పారు. రైతులకు, కౌలు దారులకు రుణాలు అందించాలని నాబార్డు పాలసీ ప్రకారం క్రెడిట్ లింకేజి చేయాలని కోరారు. సెర్ప్ సిఇవో దివ్య, నాబార్డు జిఎం ఉదయ్‌భాస్కర్‌లు ప్రభుత్వం పాలసీలను బ్యాంకులు ముందుకు తీసుకెళ్ళాలని కోరారు. ఎస్‌బిఐ సిబిఎం సహదేవన్ రాధాకృష్ణ మాట్లాడుతూ మొత్తం బ్యాంకులలో రూ. 9,01,503కోట్ల డిపాజిట్లు ఉన్నాయని ఈ త్రైమాసికంలో రూ. 61,073 కోట్ల డిపాజిట్లు పెరిగాయని తెలిపారు. రుణాలు ఈ క్వార్టర్‌లో రూ. 1,11,349కోట్లు పెరిగాయని మొత్తం రుణాలు రూ. 11,92,710కోట్లు ఇచ్చామని తెలిపారు.సిడి నిష్పత్తి 130.18 నుంచి 132.30 చేరిందని తెలిపారు. 56,673కోట్లు బ్యాంకు స్వల్పకాలిక రుణాలు అందిచాయని తెలిపారు. వ్యవసాయంపై రూ.70754కోట్లు పెట్టుబడిని బ్యాంకులు పెట్టాయి.రూ. 435కోట్లు ఈ సంవత్సరం విద్యకోసం రుణాలు ఇచ్చాయి రూ.4579కోట్లు బ్యాంకులు విద్యకు రుణాలు అందిచాయని తెలిపారు. ఎంఎస్‌ఎంఇ రంగాలకు రూ. 1,28,152కోట్లు రూపాయలు రుణాలుగా ఇచ్చారని తెలిపారు.

# డిజిపిని కలిసిన నాగర్‌కర్నూలు బాధితులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** నాగర్ కర్నూలు అగ్ర వర్గానికి చెందిన నాయకుడి దాడిలో చనిపోయిన కుమ్మెరకి చెందిన శిశువుకు న్యాయం చేయాలని కోరుతూ కుమ్మెరకి చెందిన నేతలతో పాటు బిసి, ఎస్సి,ఎస్టి జెఏసి నాయకులు శుక్రవారం నాడు డిజిపి శివధర్ రె డ్డిని కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. నాగర్ కర్నూలు ఉదంతంలో పోలీసుల విచారణ ఏకపక్షంగా వుందని, బాధితులకు అండగా వుండాల్సి న పోలీసులు దాడికి పాల్పడ్డ వారికి మద్దతుగా వుండడం శోచనీయమని డిజిపిని కలిసిన బిసి, ఎస్సి,ఎస్టి జెఏసి నాయకులు తోట రాఘవేంద్ర ముదిరాజ్, రాజ్‌కమల్, వినోద్ యాదవ్, విశారదన్‌లు తెలిపారు. పోలీసుల దర్యాప్తు సవ్యంగా లేక పోవడం, తాము చేస్తున్న ఆందోళనపై కేసులు న మోదు చేయడం, దాడికి పాల్పడ్డ వారికి అనుకూలంగా మాట్లాడడంపై జెఏసి నాయకులు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలోనే నాగర్ కర్నూలులో తమ ఆందోళనను ఆకస్మికంగా విరమించి హైదరాబాద్‌కు మార్చామని వారు తెలిపారు.

## చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానఅర్చకుడు సౌందరరాజన్ మరణం పట్ల

# సిఎం రేవంత్‌రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్ సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 27:** ప్రముఖ పుణ్యక్షేత్రం చిలుకూరు శ్రీ బాలాజీ ఆలయ ప్రధానఅర్చకుడు సౌందరరాజన్ మరణించారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యాపకుడిగా, రిజిస్ట్రార్‌గా ఎంతో మంచి పేరు గడించిన సౌందర రాజన్ ఆధ్యాత్మిక చైతన్యం విస్తరింప జేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు.చిలుకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. సౌందర రాజన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. సౌందర్ రాజన్ మరణం పట్ల తెలంగాణ మాజీ సిఎం,బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సంతాపం ప్రకటించారు. సామాజిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ, తనదైన శైలిలో దైవ సేవ చేయడం ద్వారా, సౌందర్ రాజన్ ప్రజా పూజారి గా ప్రసిద్ధిగాంచారని తెలిపారు. ప్రజా జీవనంలో భాగమైన హిందూ మత సాంప్రదాయ విలువలను విశదీకరిస్తూ, దైవం ముందు అందరూ సమానమనే సమానత్వ భావనతో ప్రజలకు ఆధ్యాత్మిక సేవను అందిస్తూ, స్వామి భక్తులతో పాటు సభ్య సమాజ గౌరవాన్ని పొందిన అరుదైన పూజారి సౌందర్ రాజన్ అని కొనియాడారు. సౌందర్ రాజన్ మరణంతో శోకతప్తులైన కుటుంబ సభ్యులకు,భక్తులకు, వారి అభిమానులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**పిసిసి ఛీఫ్ మహేశ్‌కుమార్ మంత్రి పొన్నం, కెటిఆర్ సంతాపం**

సౌందర్‌రాజన్ మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తెలుసుకొని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దశాబ్దాల పాటు చిలుకూరి బాలాజీ ఆలయంలో భక్తులకు ఆధ్యాత్మిక మార్గ దర్శకత్వం అందిస్తూ, దేవస్థానం ప్రతిష్ఠను దేశవ్యాప్తంగా నిలబెట్టడంలో సౌందర్ రాజన్ సేవలు విశేషమని కొనియాడారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఆలయ పరంపరలను కాపాడటంలో ఆయన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక విలువలు, సాంప్రదాయ పరిరక్షణ, సమాజ సేవ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత అనేక మందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన మరణం దేవస్థానానికి, భక్తులకు, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ వ్యవస్థాపకుడు సౌందర్ రాజన్ మృతి పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సౌందరరాజన్ మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త తనను ఎంతో కలిచివేసిందని పేర్కొన్నారు.

# మార్చి 4న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉద్యోగ మేళా

**తిరుపతి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలోని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పిడిసిఎల్) కార్పొరేట్ కార్యాలయంలో మార్చి 4వ తేదీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం తెలిపారు.ఎస్పిడిసిఎల్ లో పొరుగుసేవల కింద ఉద్యోగాల కోసం అభ్యర్థులు ప్రజా ప్రతి నిధులు, అధికారుల ద్వారా ఒత్తిడి తీసుకు వస్తున్నారని తెలిపారు. ఎస్పిడిసిఎల్ లో ఉద్యోగ నియామ కాలకు అవకాశం లేదని స్పష్టంగా తెలియ జేస్తున్న ప్పటికీ అభ్యర్థులు ప్రజాప్రతినిధులతో ఒత్తిడి తెస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ నియామకాల కోసం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవల ప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎస్ డిసి)ను సంప్రదించామని తెలియ జేశారు. ప్రైవేటు సంస్థల ద్వారా ఉద్యోగ నియామక ప్రక్రి యను చేపట్టేందుకు ఎపిఎస్ఎస్‌డిసి ముం దుకు వచ్చిన నేపథ్యంలో వివిధ ప్రైవేటు సంస్థల ప్రతినిధులు మార్చి 4వ తేదీ తిరుపతిలోని ఎస్పీ డిసిఎల్ కార్పొరేట్ కార్యాల యంలో జరిగే ఉద్యోగ మేళాకు హాజ రై అభ్యర్థులకు ముఖాముఖి నిర్వ హిస్తారన్నారు. అర్హులైన అభ్యర్థు లను వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

# వర్షాకాలానికి ముందే మేడిగడ్డ బారాజ్‌కు మరమ్మతులు

## సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం

## ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజైన్లను రూపొందిస్తోన్న నీటిపారుదల శాఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రానున్న వర్షా కాలానికి ముందే మేడిగడ్డ మరమ్మతులు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. మేడిగడ్డ బ్యారేజీని మరమ్మతు చేసి వినియోగంలోకి తెస్తామని దిలీ రేవంత్ ప్రకటించడం తెలిసిందే. ఆ దిశగా అధికారులు డిజైన్లు సిద్ధం చేస్తున్నారు. మేడిగడ్డ మరమ్మతులకు దాదాపు రూ.500కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా. మరమ్మతుల ఖర్చును ప్రభుత్వమే భరించాలని నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ అంటుండగా , ఎల్అండ్‌టీనే భరించాలని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఏదిఏమైనా రానున్న వర్షాకాలంలోపే మేడిగడ్డ బారేజీ పునరుద్దరణ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే పనులు మొదలు పెట్టాలని నిర్ణయించింది. సాంకేతిక అధ్యయనాలు, ఎన్‌డీఎస్‌ఏ సిఫారసుల ఆధారంగా మరమ్మతు పనులు కొనసాగేలా నీటిపారుదలశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోనుంది. బిబీజుగి భరించాలని లి గి అంటుండగా, ఆ సంస్థే భరించాలని అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై చర్చలు కొనసాగుతున్నాయి.

వర్షాకాలానికి ముందే తిశిళిలో పనులు ప్రారంభించాలని నిర్ణయించారు.కాగా.. రానున్న వర్షాకాలంలోపు మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న భాగాలను (ముఖ్యంగా 7వ బ్లాక్) తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు, అగాధం ఏర్పడిన ఏడో బ్లాకులో పనులు చేపట్టనుంది. పియర్స్, బ్రేసింగ్, క్రాక్‌లను సరిచేయడం, దెబ్బతిన్న ప్రెజర్ రిలీఫ్ వాల్వ్‌ల మార్పు వంట పనులను ప్రాధాన్యతా అంశంగా చేపట్టనున్నారు.



# కోల్‌కతాలో భూకంపం.. జనం పరుగులు

## రిక్టర్ స్కేలుపై 5.3 తీవ్రత నమోదు

**కోల్‌కతా, ఫిబ్రవరి 27:** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈరోజు మధ్యాహ్నం రిక్టర్ స్కేలుపై 5.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు, అపార్ట్ మెంట్ల నుంచి బయటకు పరుగు తీశారు. నగరంలో భూకంపం సంభవించిందని, ఈ ప్రభావంతో పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు. కోల్‌కతాలో కొన్ని సెకన్ల పాటు భూప్రకంపనలు వచ్చాయి.

భూకంప కేంద్రాన్ని సమీపంలోని బంగ్లాదేశ్‌లో గుర్తించారు. కార్యాలయాలు, అపార్ట్ మెంట్లు, రహదారుల్లోని సీసీ కెమెరాల్లో భూకంపానికి సంబంధించిన వీడియోలు రికార్డయ్యాయి. ఇంట్లో సోఫాలో కూర్చున్నామని, ఆ సమయంలో హఠాత్తుగా ప్రకంపనలు వచ్చాయని, భయంతో ఇంట్లో నుంచి బయటకు పరుగు తీశామని స్వగత అనే స్థానికురాలు తెలిపారు. తమ ఇంట్లోని సోఫా, ఫ్యాన్ కదలడం తాము చూశామని తెలిపారు. టేబుల్ మీద ఉంచిన ఒక సీసా కిందపడిపోయిందని వెల్లడించారు. రాజధాని కోల్‌కత్తా నగరంలో ఒక్కసారిగా ఇళ్లన్నీ కుదుపులకు లోనుకావడంతో ప్రజలు భయాందోళనలతో బయటకు పరుగులుతీసారు.

# బొత్స సత్యనారాయణ త్వరగా కోలుకోవాలి: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ వైసిపిసి ఎమ్మెల్సీ, మాజీ ఎపిసిసి అధ్యక్షుడు, మాజీమంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థ తకు గురవడంతో ఆయన ఆరోగ్యంపై పిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేయడంతోపాటు ఆయన త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు. ప్రజల కోసం నిత్యం ఆలోచించే బొత్స సత్యనారాయణ సడెన్ బ్రెయిన్ స్ట్రోక్ రావడం దురదృష్టకరమనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన త్వరగా కోలుకుని ప్రజా జీవితంలో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షి ంచారు. దీర్ఘకాలంగా ప్రజాసేవలో ఉన్న బొత్స సత్య నారాయణ రాజకీయ రంగంలో విశేష అనుభవం కలిగిన నా యకుడని, రాజకీయాల్లో ఆయన పాత్ర ప్రాముఖ్యత గలదని తెలి పారు. ఈ క్లిష్టసమయంలో ఆయనకు ఉత్తమ వైద్య చికిత్స అందుతూ ఉండాలని, వైద్యుల పర్యవేక్షణలో త్వరగా స్వస్థత చేకూరాలని ఒక ప్రకటనలో తెలిపారు. బొత్స కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని, అభిమానులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆయన త్వరితగతిన కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు.

# జనసేన కేంద్ర కార్యాలయంలోకి చొరబడిన ఆగంతకుడు

## అదుపులోకి తీసుకున్న రోప్ పార్టీ సిబ్బంది

**విజయవాడ,ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి :** జనసేన కేంద్ర కార్యాలయంలోకి చొరబడి ఓ వ్యక్తి హల్ చల్ చేశాడు. నేరుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయంలోకి వెళ్లాడు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించడంతో వాళ్లను పక్కకు నెట్టి అక్కడే ఉన్న కర్రతో పవన్ కల్యాణ్ వాహన శ్రేణిలోని కార్ల అద్దాలు ధ్వంసం చేశాడు. రోప్ పార్టీ సిబ్బంది అతనిని అదుపులోకి తీసుకుని మంగళగిరి పోలీసులకు అప్పగించారు.జనసేన కేంద్ర కార్యాలయంలోకి చొరబడిన వ్యక్తిని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన నీలాద్రిగా పోలీసులు గుర్తించారు. ఇవాళ ఉదయం 9:30 గంటల సమయంలో కార్యాలయంలోకి చొరబడటమే కాకుండా అక్కడి ప్రాంగణంలో కార్ల అద్దాలు ధ్వంసం చేశాడు. విజయవాడ నుంచి ఆటోలో వచ్చి నీలాద్రి నేరుగా పవన్ కల్యాణ్ సీఎస్ ఓ గదిలోకి వెళ్లారు. అక్కడ సుమారు పావుగంట సేపు అటూ ఇటూ తిరిగారు. కాసేపటికి ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించడంతో వాళ్లను పక్కకు తోసి అక్కడే ఉన్న కర్రతో ఉపముఖ్యమంత్రి వాహన శ్రేణిలోని కార్ల అద్దాలు ధ్వంసం చేశాడు. రోప్ పార్టీ సిబ్బంది అతనిని అదుపులోకి తీసుకుని మంగళగిరి పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళగిరి స్టేషన్‌కు వచ్చారు. నీలాద్రిని పోలీసులు ప్రశ్నించగా నిందితుడిని పొంతనలేని సమాధానం చెప్పాడు. తనకు ఇది మూడో జన్మని పవన్ కల్యాణ్ ఆఫీసుకు అమ్మవారే పంపించారని నిందితుడు తెలిపాడు. దీంతో అతను మతిస్థిమితం లేని వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ వ్యక్తి ఎవరు? ఎందుకు అలా అలా చేశాడనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దీని వెనుక ఏమైనా రాజకీయ కుట్ర ఉందా అనే కోణంలో ఐజీ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు.

తెలంగాణ ప్రభుత్వం
మందమర్రి మునిసిపాలిటీ కార్యాలయం-మంచిర్యాల జిల్లా
టెండర్‌లు ఆహ్వానిస్తూ ప్రకటన
బాక్స్ టెండర్ ప్రకటన నెం. E1/04/BoxTender/MM/Mplty./2025-26, తేది: 27.02.2026
మందమర్రి మునిసిపాలిటీ, మునిసిపల్ కమీషనర్ వారిచే మునిసిపల్ సాధారణ నిధులు/15వ FC క్రింద రూ.2.00 లక్షల విలువైన (2) నం. పనులు చేపట్టడానికి బాక్స్ టెండర్ ప్రకటన నం: E1/04/బాక్స్ టెండర్/MM/Mplty./2025-26 తేది: 27.02.2026 ప్రకారం పేర్కొనబడిన అర్హులైన సివిల్ కాంట్రాక్టర్లు, సంస్థల నుండి బాక్స్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ షెడ్యూల్స్ జారీ కొరకు ప్రారంభ తేదీ & సమయం: 28.01.2026 మ.03.00 గం. టెండర్ షెడ్యూల్స్ జారీ కొరకు చివరి తేదీ & సమయం: 03.03.2026 మ.03.00 గం. మరియు టెండర్ షెడ్యూల్స్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 03.03.2026 సా.04.00 గం. మరి ఏ ఇతర వివరాలకైనా మందమర్రి మునిసిపల్ కమీషనర్/మునిసిపల్ ఇంజనీర్‌ను సంప్రదించండి. ఫోన్ నం.9849971283/9849986750.
సం/- కమీషనర్, మందమర్రి మునిసిపాలిటీ
DIPR.No.16141-PP/CL/Advt/1/2025-26, తేది: 27.02.2026

వార్త

విజయానికి రెండు ప్రధాన సూత్రాలున్నాయి. ఆచరణకు ముందు ఆలోచించాలి. ఆ తరువాత ఆలోచనలు ఆత్మవిశ్వాసంతో ఆచరణలో పెట్టాలి.

-రవీంద్రనాథ్ ఠాగూర్

# పాఠ్యాంశాలకు చెద?

సమాజంలో అవినీతిని ఎండగట్టేందుకు, అవినీతి పరులను శిక్షించేందుకు వేర్వేరు విభాగాలున్నట్లే న్యాయవ్యవస్థలోనూ అంతర్గత విభాగాలు, దర్యాప్తు, విచారణ చర్చలు ఉంటాయి. అన్నిటికన్నా ఏ దేశంలోనైనా న్యాయాన్ని నిలబెట్టడం కోసం ఆ వ్యవస్థ తన శక్తియుక్తులన్నీ ధారపోస్తుంది. న్యాయమూర్తులు కూడా సమాజంలోని వారే అయినా తమ వ్యక్తిగత సౌఖ్యాలు, మానవ సంబంధాలను సైతం వదులుకొని సమాజానికి దూరంగా ఉండగలగడమే వారి ఔన్నత్యానికి ప్రతీక. అలాంటి న్యాయవ్యవస్థ గౌరవాన్ని, ఔన్నత్యాన్ని నిలబెట్టే పనిలో సుప్రీంకోర్టు బాధ్యత తీసుకొంది. నిన్నగాక మొన్న ఎన్‌సిఇఆర్ 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో చొరబడిన 'న్యాయ వ్యవస్థలో అవినీతి' అనే పాఠ్యాంశంపై న్యాయవ్యవస్థ యావత్తూ ముక్తకంఠంతో అందులోని అంశాలు, విషయాలపై ధ్వజమెత్తింది. అందులో భాగంగానే ఆ పాఠ్య పుస్తకాన్ని నిషేధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం నిషేధించింది. ఆ పాఠ్యపుస్తకం ఇక ఎక్కడా ఏ రూపంలోనూ కనపడడానికి వీల్లేదు. కేంద్ర ప్రభుత్వం అధీనంలోనే ఎన్‌సిఇఆర్‌టి నడుస్తోంది. ఆ పుస్తక సంస్థ తప్పొప్పులకు బాధ్యత వహించాల్సిన కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పింది. దేశ ప్రతిష్ట ఇనుమడింప చేయాల్సిన ఒక ప్రధానమైన విద్యావ్యవస్థలోని ఒక విభాగం ఇలాంటి తప్పిదాలకు పాల్పడడం క్షమార్హం కానేకాదు. అందుకే సుప్రీం ధర్మాసనం తమ వ్యవస్థను నలుగురిలో నవ్వులపాలు చేసేందుకు కారణమైన వ్యవస్థపై ధిక్కార చర్చలు తీసుకునేందుకు నడుంకట్టింది. ధిక్కారంపై చర్యలు ఎందుకు తీసుకోరాదంటూ సుప్రీంకోర్టు విద్యా కార్యదర్శి, ఎన్‌సిఇ ఆర్టీ ఛైర్‌పర్సన్‌ను సంజాయిషీ కోరింది. ప్రధాన మంత్రి కూడా ఈ అంశంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముసాయిదా అధ్యాయాన్ని రూపొందించిన విద్యావేత్తలపై చర్యలు తీసుకుంటామని కేంద్రవిద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హామీ కూడా ఇచ్చారు. కేవలం ఇద్దరు విద్యావేత్తల క్షమార్హం కాని పాఠ్యాంశ రూపకల్పన జరిగిందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు నివేదించింది. న్యాయవ్యవస్థపై ఆన్‌లైన్‌లో ప్రచార దుర్వినియోగానికి పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని అలహాబాద్ హైకోర్టు సోషల్ మీడియా వినియోగదారులను హెచ్చరించింది. పాఠ్యపుస్తకం 'ఇ' వెర్షన్ అప్‌లోడ్ చేయలేదని ఎన్.సి.ఇ. ఆర్.టి చెబుతోంది. చాలా కాపీలను రీకాల్ చేసినట్లు, కేవలం 32 కాపీలు మాత్రమే జనంలోకి వెళ్లాయని స్పష్టం చేస్తోంది. న్యాయ వ్యవస్థ గౌరవాన్ని చులకన చేయడం, కించపరిచే వ్యాఖ్యలున్నందున దానికి కారణమైన వారిని వదలబోమని, ప్రభుత్వం చెప్పిన క్షమాపణలను అంగీకరించేది లేదని సుప్రీంకోర్టు వివరించింది.

వ్యవస్థపై తప్పుడు ముద్రవేసి క్షమాపణలడగడం సరైనది కాదని, జరిగినది పొరపాటు కాదని ఉద్దేశపూర్వకంగా చేసినదేనని సుప్రీంకోర్టు బెంచి స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలిలు ఈ ధర్మాసనంలో ఉన్నారు. వారు ఈ పాఠ్యాంశంలోని పూర్తి విషయాలను ఆకళింపు చేసుకొని మరీ వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థ విశిష్ట చరిత్రను వివరించాల్సిందిపోయి వ్యవస్థ భ్రష్టు పడుతోందంటూ, వాటి ప్రతిష్టను కించపరిచేలా రాసారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి వెనుక ఉన్న వ్యక్తులెవరో తాము తెలుసుకోవాలనుకుంటున్నామని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. భారతీయ సమాజంలో న్యాయ వ్యవస్థ ఔన్నత్యానికి మించింది లేదు. ఇటీవల నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) ఎనిమిదో తరగతి పాఠ్యాంశంలో చోటు చేసుకున్న 'న్యాయవ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంతోమందివిద్యావేత్తలు, మేధావులచే రూపకల్పన చేసిన ఈ పుస్తకంలో అవాంఛనీయ పాఠ్యాంశాలను జోడించడం ఆశ్చర్యమే మరి. ఇలాంటి అంశాలను 'రేపటి పౌరుల ' పాఠ్యాంశాల్లో చొప్పించడం ఏవిధంగానూ క్షమార్హం కాదు. ప్రఖ్యాత న్యాయవాదులు కపిల్ సిబాల్ అభిషేక్ మను సంఘ్వీలు సుప్రీం దృష్టికి తెచ్చారు. ఈ మధ్యనే న్యాయవ్యవస్థలోని అవినీతి ఆరోపణలకు సంబంధించి 2016 నుంచి 2025 మధ్య సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ జడ్జిలపై సిజెఐ కార్యాలయానికి మొత్తం 7,528 ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడైంది. అవన్నీ అభియోగాలు మాత్రమే. వాటిలో కొన్ని రుజువయ్యే అంశాలు కూడాఉండొచ్చు. ఇలాంటి ఫిర్యాదులపై అంతర్గత విచారణ, చర్యలుకూడా ఉంటాయి. వచ్చిన ఫిర్యాదులన్నీ వాస్తవాలు అయి ఉండవు. పైగా కక్షిదారులు ఎవరికి వారే నెగ్గుతారని అనుకుంటారు. కాగా తీర్పులు తమకు అనుకూలంగా లేవని ఏమాత్రం అనుమానం వచ్చినా అవి ఇలాంటి ఫిర్యాదుల్లోకి చేరిపోతుంటాయి. మరికొన్నిరాజకీయ ప్రేరేపిత ఫిర్యాదులుకావచ్చు. నిజానికి ఎంత మంది ఆరోపితులు దోషులో, నిర్దోషులో తేలకుండా ఇలాంటి అంశాలపై ఎలాంటి సమాచారం బయటికి వచ్చినా ప్రజల్లో అనుమానాలు తలెత్తే ఆస్కారముంది. ఒకవేళ విధి నిర్వహణలో వారిపై తీవ్ర అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు పార్లమెంట్‌లో అభిశంసించే అధికారం శాసన వ్యవస్థకు ఉందని ఆ పాఠ్యాంశంలోని ప్రస్తావనాంశాలు. కాగా ప్రౌఢదశలోనే ఉన్న యువతకు ఇలాంటి పాఠాలు వారిలో సమాజం పట్ల ఏవగింపు కలిగే అవకాశం ఉంది. వ్యవస్థపై దురభిప్రాయం కలిగే విధంగా పాఠ్యాంశాలు ఉండరాదు. న్యాయవ్యవస్థపై సమాజంలో గౌరవభావం కలిగించాలే తప్ప సందేహాలు రేకెత్తించరాదు.

కొందరు గొప్పవారుగా జన్మిస్తారు. మరి కొందరు గొప్పవారుగా జీవిస్తారు. ఇంకా కొందరు గొప్పవారుగా తయారవుతారు.



ఫ్రాంక్లిన్

చెవిటివాడు ఎవరు? మాట వినలేనివాడు కాదు. మంచి మాట విననివారు.



మార్టిన్ లూథర్ కింగ్

# ప్రజావాక్కు



## పాఠ్యాంశాల్లో శ్రీకృష్ణదేవరాయల వీరత్వం

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు తన పాలనతో ఎల్లలు లేని కీర్తిని సంపాదించారు. హైందవ ధర్మానికి కట్టుబడి రాజ్యం చేయటమేకాక అలుపెరుగని యుద్ధాలు సుమారు ఇరవై సంవత్సరాలు పైబడి చేసి విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీలంకతో సహా ఇటు కటకం (కటక్), అటుగోమాంతక్(గోవా)వరకువిస్తరించాడు. మొఘలులను దక్షిణానికి రానివ్వకుండా తన పాలనా దక్షతతో అడ్డుకున్నారు. ఆయనస్వయంగాయుద్ధభూమిలో పాల్గొని అనేక రాజ్యాలను తన ఛత్రం క్రిందకు తెచ్చుకున్నారు. అసలుఓటమే ఎరుగని వీరాధివీరుడు ఆయన. అలాంటి ఆయన వీరత్వాన్ని సూచించే ఏ విగ్రహం లేదు. ఈ విషయాలు అవలోకనం చేసుకుని మున్ముందు తరాలకు శ్రీకృష్ణదేవరాయల వీరత్వం తెలిపే అంశాలు పాఠ్య పుస్తకాలలో పొందు పరచటమే కాక ఆయన వీరత్వం ఉట్టిపడే భంగిమలో విగ్రహాలు నెలకొల్పాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## ఎటియంలలో డబ్బుల కొరత

ఎటియంల నిర్వహణ చాలా వరకు అస్తవ్యస్తంగా ఉంది. సెలవువస్తే ఎటియంలలో అసలు డబ్బులు ఉండటం లేదు. డిజిటల్ పేమెంట్స్ వద్దు అనుకునేవారు, నగదులోనే లావాదేవీలు చేస్తారు. అత్యవసరంగా డబ్బు అవసరమైన ఎటియంకు వెళ్తే చాలా ఎటియంలలో డబ్బులు ఉండటం లేదు. సంబంధిత బ్యాంకుఅధికారులు ఎటియంలలో నగదు ఉండే విధంగా చూడవలసిన అవసరం చాలా ఉంది. ముఖ్యంగా సెలవు దినాలలో ఎటియంలలో డబ్బు ఉండేటట్లు తగ్గ చర్యలు తీసుకోవాలి.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

## బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలి

గల్లీకొక నకిలీ వైద్యులు విస్తరించిపోతున్నారు. గతంలో ఇలాంటి వార్తలెన్నో వచ్చినా ప్రభుత్వం అంతగా పట్టించుకోలేదు. ఓపది పదిహేను మందుల పేర్లను గుర్తుంచుకునిఏజబ్బుకైనా వాటినే తిప్పితిప్పిరాస్తున్నారు. ముఖ్యంగా గల్లీల్లోనే వీరి ఆటలు సాగుతున్నాయి. ఖరీదైన ఆసుపత్రులకు వెళ్లేస్తోమతలేక బీదలు వీరినే ఆశ్రయిస్తున్నారు. అధికరోగాలను కొనితెచ్చుకుంటున్నారు. బస్తీ దవఖానాలనురెండు తెలుగురాష్ట్రాలలోనూ మరింతగా నెలకొల్పాలి.

-ఎన్. మహాలక్ష్మి, సికింద్రాబాద్

## నిర్బంధ విద్య ఒక శాపం!

పిల్లలను బెదిరించడం, కొట్టడం లేదా కఠినమైన ఆంక్షల మధ్య చదివించడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువని ప్లేటో హెచ్చరిస్తున్నారు. భయంతోచదివినప్పుడు పిల్లవాడు మీ మాట వినవచ్చు కానీ, ఆ చిన్న మెదడులోని అసలైన సృజనాత్మకత ఎప్పటికీ బయటకు రాదు. బలవంతంగా నేర్చుకునేది మెదడులో శాశ్వతంగా నిలవదు. ఆటపాటల ద్వారానే అసలైన అభ్యాసం. పిల్లలకు ఏవిషయంలో ఆసక్తి ఉంది? ఏ పని చేస్తే వారు ఆనందంగా ఉంటారు? అనేది గుర్తించి, దాని ద్వారానే విద్యను బోధించాలని ప్లేటో సూచిస్తున్నారు. ఆటల ద్వారా విషయాలనునేర్పినప్పుడు పిల్లలుఒత్తిడి లేకుండా సులభంగా గ్రహిస్తారు. ప్రతి బిడ్డ ఒక ప్రత్యేక ప్రతిభతో పుడతాడు. అందరినీ ఒకే గాటన కట్టకుండా, వారి ప్రత్యేకతను గుర్తించి ప్రోత్సహించాలి. పిల్లలు చదువును ఆస్వాదించాలంటే, ముందుగా పెద్దలు వారిని ప్రేమతో అర్థం చేసుకోవాలి. వారిలో ఉత్సుకతను రేకెత్తించేలా బోధనా పద్ధతులు ఉండాలి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## పులుల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

మధ్యప్రదేశ్‌లో మరో రెండు పులుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుద్వారా భారత దేశంలో పులుల సంరక్షణ కేంద్రా ల సంఖ్య 59కి చేరింది. 1970లలో ప్రారంభించిన ప్రాజెక్ట్ టైగర్ ద్వారా ఇందిరాగాంధీ ఒక బృహత్తర కార్యానికి నాంది పలికింది. అయితే నర్మదా నది ఉత్తర భాగంలో ఉండే త్రపని, మాధవ్ పార్కులను పులుల సంరక్షణ కేం ద్రాలుగా గుర్తించడం ద్వారా గొడుగు కింద జంతువులను కూడా కాపాడడానికి వీలు అవుతుంది. అంతమాత్రమే కాదు ఈ ప్రాజెక్ట్ టైగర్ అంతర్జాతీయ బిగ్‌క్యాట్ అలి యన్స్‌కి నాంది ప్రస్తావనగా మారింది.

-భారత అవినాష్, జనగామ

## అంతా కల్తీమయం

నేడు ఏది చూసినా కల్తీమయమే. శీతల పానీయాలు, పచ్చళ్లు, పాలు, నీళ్లు, నెయ్యి, నూనెలు, సౌందర్య ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, మిఠాయిలు, ఆహారపదార్థాలు, అన్నిటిలోను కల్తీయే. ముఖ్యంగా మనం తినే వివిధపదార్థాలలో కల్తీ బాగా జరుగుతుంది. అధిక లాభాలకు ఆశపడి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు, నాసిరకం వస్తువులు కలిపికొందరు వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. కొన్నిచోట్ల తక్కువ ధరకే టిఫిన్లులభిస్తుండడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమ్మభాషకా అంపశయ్య!

**స్వాతంత్య్రం వచ్చిన తర్వాతనే కాదు అంతకుముందు బ్రిటిష్ కాలంలో కూడా సివిల్ సర్వీస్ అధికారులు వారు పనిచేసే ప్రాంతాల్లో స్థానిక భాష కొంతవరకు వచ్చి ఉండాలనే నిబంధనలను విధించారు. ఆ నిర్ణయం మేరకే 1816లో భారత్‌లో అడుగుపెట్టిన సివిల్ సర్వీసు ఉద్యోగి చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ తెలుగు భాషను నేర్చుకోవడమే కాదు ఏకంగా ఒక నిఘంటువును రూపొందించి తెలుగు ప్రజలు మరిచిపోలేని సేవలు అందించారు. సభలు, సమావేశాలు, ఏర్పాటు చేసి తెలుగు గురించి దేశవిదేశాల్లో గొప్పలు చెప్పుకుంటే చెప్పుకోండి. అలాగే మమ్మీడాడీ చదువులు ఉండే ఉండనీయండి.కానీ తెలుగుకు పుట్టినిల్లు అయిన ఉభయ రాష్ట్రాల్లో తెలుగుకు ద్రోహం చేయడం ఏమాత్రం సమంజసంకాదు.**

దామెర్ల సాయిబాబ

మాతృభాషను సంరక్షించుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత గురించి పెద్దలు పదేపదే చెబుతుంటారు. అమ్మభాషలో ఉన్న ఆత్మీయత, ఆనందం మరెందులోనూ లభించదని తెలియని విషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషలకు లిపిలేకపోవడం, విద్యారూపంలో అందించే ప్రయత్నాలు చేయకపోవడం వల్ల కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ప్రపంచంలో గుర్తించిన ఎనిమిదివేల మూడువందల ఇరవైనాలుగు భాషల్లో ప్రస్తుతం ఆరువేల ఏడువందలు మాత్రమే వాడుకలో ఉన్నాయని ఐక్యరాజ్యసమితి విద్యా విజ్ఞాన, సంస్కృతిక సంస్థ (యునెస్కో)ఇటీవల వెల్లడించింది. వాటిలో కూడా నలభైశాతానికి పైగా కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదంలో ఉన్నాయని హెచ్చరించింది. ప్రపంచీకరణ, వలసలు, సామాజిక మార్పుల వల్ల భాషలు ఉనికిని కోల్పోతున్నాయి. ఇప్పటికీ ప్రపంచ జనాభాలో నలభై శాతానికిపైగా వారివారి మాతృభాషల్లో విద్యను అభ్యసించడానికి కావాల్సిన వసతులు, వ్యవస్థలు లేవనే చెప్పొచ్చు. ఇలా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషలు విద్యారూపంలో అందించే ప్రయత్నాలు చేయకపోవడం వల్ల కనుమరుగైపోతున్నాయి. రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన తెలుగు భాష పరిస్థితి కూడా అంత ఆశాజనకంగా కన్పించడం లేదు. ఒకనాడు సంస్కృతం, ప్రాకృతం, అరబిక్, పార్శీ, ఉర్దూ, పోర్చుగీసు, ఇంగ్లీష్‌తోసహా అనేక భాషల ప్రభావం తట్టుకొని నిలబడగలిగిన తెలుగుకు ప్రస్తుతం ఆశించిన మేరకు ఆదరణ లభించడం లేదేమోననిపిస్తున్నది. మాతృభాష అయిన తెలుగుపై పాలకులకు అభిమానం, ప్రేమ, వాత్సల్యం లేదనుకోలేం. తెలుగుకు ఉన్న ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు ప్రపంచవ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. తెలుగుభాషపై ఉన్న మక్కువను చాటేందుకు తెలుగును నలుదిశల వ్యాప్తి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను కాదనలేం. కానీ మరొక పక్క తెలుగు రాష్ట్రాల్లోనే క్షేత్రస్థాయిలో ఇంగ్లీషు మోజులో పడి తెలుగుకు తీరని అన్యాయం చేస్తున్నారనే వాదనను కొట్టివేయలేం. తెలుగుభాషకు జరుగుతున్న ద్రోహం, అందువల్ల సామాన్య ప్రజలుపడుతున్న ఇబ్బందుల గురించి ఆలోచిస్తే ఆవేదన కలుగకతప్పదు. ఇదంతా పరాయి ప్రభువులు ఎవరో చేస్తున్నది కాదు. ఉభయ రాష్ట్రాల్లో తెలుగు ప్రజల ప్రతినిధులమని చెప్పుకుంటున్న నేతలే కావడం విచారకరం. ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారిందన్న మాట వాస్తవమే కావొచ్చు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతుంటే తెలుగు, తెలుగు అని పరిమితులు గీసుకుంటే ఎలా అని ప్రశ్నించేవారు ఉన్నారు. అభివృద్ధివైపు పరుగులీడాల్సిందే. కానీ మాతృభాషపై అభిమానాన్ని పెంచుకోవడం ప్రోత్సహించడం తప్పుకాదు. అన్యభాషలను ద్వేషించమని చెప్పడం లేదు. నేర్చుకోవద్దనడం లేదు. కానీ తెలుగు రాష్ట్రాల్లోనే మమ్మీ డాడీ చదువులు ఆరంభమైన తర్వాత తెలుగులో బోధన క్రమేపీ తగ్గిపోతున్నది. తెలుగులో బోధించే ప్రభుత్వ ఎయిడెడ్‌సంస్థలు దాదాపు మూతపడ్డాయని చెప్పొచ్చు. ఇంగ్లీషు చదివించడం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. పాఠశాల స్థాయిలో తెలుగు ఒక సబ్జెక్టుగా మిగిలిపోయింది. ఒకటి నుండి పదోతరగతి వరకు తెలుగు భాషను విధిగా నేర్చుకోవాలనే నిబంధన తెలంగాణ ప్రభుత్వం విధించింది. కానీ ఏదోకారణంతో మినహాయింపులు మీద మినహాయింపులు ఇస్తున్నారు. మార్కుల కోసం ఇంటర్‌లో పరాయి భాషలను ఎంచుకునే సంప్రదాయం పెరిగిపోతున్నది. పోని ఆ భాషలైనా సక్రమంగా నేర్చుకుంటున్నారంటే అదీ లేదు. ఫలితంగా ఏ భాష రాకుండాపోతున్నది. ఇప్పటికే తెలుగు

## ఒక్క మాట

రాష్ట్రాల్లో దాదాపు అన్ని ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్ కాలేజీల్లో మార్కులకోసం పిల్లలను సంస్కృతం, ఇతర భాషల వైపు నడిపిస్తూ మాతృభాష బోధనకు తిలోదకాలిస్తున్నారు. దేశభాషల్లో తెలుగు మూడో స్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోయింది. హిందీది ప్రథమ స్థానం. 2001లో 8.1 శాతం ప్రజలు బెంగాలీ మాట్లాడుతుండగా, 2011 నాటికి 8.30శాతానికి చేరి రెండోస్థానాన్ని పదిలం చేసుకుంది. 2001లో 7.9 శాతంతో మూడోస్థానంలో ఉన్న తెలుగు భాష 2011 నాటికి తెలుగు మాట్లాడేవారి సంఖ్య 6.93 శాతానికి పడిపోవడంతో మూడో స్థానాన్ని మరాఠీ భాష దక్కించుకున్నది. దీంతో నాలుగోస్థానానికి తెలుగు చేరుకున్నది. ఇలా క్రమేపీ దేశభాషల్లో తెలుగు స్థానం తగ్గుతుండడం భాషాప్రియులకు ఆందోళన కలిగిస్తున్నది. ఎన్నో దేశాలు తమ మాతృభాష అయిన విద్యాబోధన వైపు అడుగులు వేస్తూ ఆయా భాషల ఉనికిని కాపాడుకోవడమే కాదు ప్రోత్సహించి ఉన్నత స్థానంలో ఉంచేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తున్నాయి. జపాన్, సింగపూర్, కాంబోడియా, వియత్నాం, థాయిలాండ్, మలేషియా తదితర దేశాల్లో విద్యాబోధన పాఠశాల స్థాయిలోనే మాతృభాషలోనే జరుగుతున్నది. జింబాబ్వే తదితర ఆఫ్రికా దేశాలు పాఠశాల విద్యను మాతృభాషకే పరిమితం చేస్తున్నాయి. అలాని తెలుగు భాష గురించి పాలకులు ప్రోత్సహించడం లేదని చెప్పడం లేదు. తెలుగు భాష అమలుకు ఎన్నో చట్టాలు చేశారు. మరెన్నో నిబంధనలు విధించారు. దశాబ్దాలు దాటిపోయినా నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. పేరుకు అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండు అధికార భాషా సంఘాలు ఏర్పడ్డాయి. ఏదో నామమాత్రపు అధికారాలు కూడా ఆ సంఘాలకు లేకుండా చేశారు. గతంలో పనిచేసిన అధికార భాషా సంఘం అధ్యక్షులు జిల్లాల్లో పర్యటించి తెలుగును నిబంధనల మేరకు ఎంత వరకు అమలు చేస్తున్నారో, చేయకపోతే ఎందుకు చేయలేదంటూ సమీక్షలు, సమావేశాలు పెట్టి సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. అవి అలంకారప్రాయంగా తయారయ్యాయి. వాస్తవంగా చూస్తే ఇంతటి సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలుగును 1966 మే పద్నాలుగున ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార భాషగా గుర్తించారు. పరిపాలనకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులో ఉండాలని నిర్దేశించారు. కానీ ఇప్పుడవన్నీ పక్కన పెట్టి ఇంగ్లీషుకు అగ్రపీఠం వేస్తున్నారు. ఒకటో తరగతే కాదు అంతకు ముందు రెండేళ్ల ముందే ప్రారంభమయ్యే విద్యాభ్యాసంలో నర్సరీ, ఎల్‌కెజి అంటూ ఇంగ్లీషులోనే మొదలుపెడుతున్నారు. జీవిత సారాంశాన్ని వడబోసి రచించిన సుమతీ, వేమన, దాశరథి, భాస్కర, ధర్మపురి లక్ష్మినర్సింహలాంటి శతకాలు దాదాపు కనుమరుగైపోయాయి. ఇక తెలుగుఅమలులో జరుగుతున్న నిర్లక్ష్యం, అశ్రద్ధ సామాన్యులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. గతంలో ఒకసారి పోలీసు అకాడమీ నిర్వహించిన సర్వేలు విస్తుపోయే విషయాలువెలుగులోకి వచ్చాయి. ఆంగ్ల భాష అంతగా రాని పోలీసు శాఖల్లోని ఉద్యోగులతో అభియోగపత్రాన్ని తయారు చేయించి న్యాయస్థానం ముందు పెట్టడంతో బాధితుల్లో చాలా వరకు ఆంగ్లభాష పరిజ్ఞానం లేకపోవడంతో చార్జ్‌షీట్‌లో ఏమిరాశారో తెలియకుండాపోయి కేసులు వీగిపోతున్న విషయం వెలుగుచూసింది. కంప్యూటర్లు వచ్చిన తర్వాత మరింత సులువు అయిపోయింది. ఒక్క పోలీసుశాఖే కాదు, ప్రజలతో నేరుగా సంబంధాలు ఉండే రెవెన్యూ, మున్సిపల్, రవాణా, వైద్య, ఆరోగ్యం, తదితర అన్ని శాఖల్లోనూ ఇవేఇబ్బందులు సామాన్యులు ఎదుర్కొం టున్నారు. ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ తెలుగు అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తే ఎందరో బీదాబిక్కిలకే కాదు మధ్య తరగతి వర్గాలకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పులను ఆయా భాషల్లో తర్జుమా చేయించి అందించే ఏర్పాటు చేస్తుండడం ఎందరి కో ఉపయోగపడుతున్నది. స్వాతంత్య్రం వచ్చిన తర్వాతనే కాదు అంతకుముందు బ్రిటిష్ కాలంలో కూడా సివిల్ సర్వీస్ అధికారులు వారు పనిచేసే ప్రాంతాల్లో స్థానిక భాష కొంతవరకు వచ్చి ఉండాలనే నిబంధనలను విధించారు. ఆ నిర్ణయం మేరకే 1816లో భారత్‌లో అడుగుపెట్టిన సివిల్ సర్వీసు ఉద్యోగి చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ తెలుగు భాషను నేర్చుకోవడమే కాదు ఏకంగా ఒక నిఘంటువును రూపొందించి తెలుగు ప్రజలు మరిచిపోలేని సేవలు అందించారు. సభలు, సమావేశాలు, ఏర్పాటు చేసి తెలుగు గురించి దేశవిదేశాల్లో గొప్పలు చెప్పుకుంటే చెప్పుకోండి. అలాగే మమ్మీడాడీ చదువులు ఉండే ఉండనీయండి. కానీ తెలుగుకు పుట్టినిల్లు అయిన ఉభయ రాష్ట్రాల్లోతెలుగుకు ద్రోహం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. ●

# ఉక్రెయిన్, రష్యా చర్చలు నిష్ప్రయోజనమేనా?


కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రైన్ యుద్ధం బీతా వహ వాతావరణం తలపిస్తోంది. ప్రధానమైన అంశాలలో ఎవరూ తగ్గడం లేదు. ఇప్పటికే జనవరి 23, 24 తేదీలలో ఫిబ్రవరి 4,5 తేదీలలో చర్చలు సాగాయి. ఇవి ఎటువంటి పురోగతి సాధించలేకపోయాయి. ఇది ఇలా ఉండగా ఈ యుద్ధం ఆపాలని అమెరికా కంకణం కట్టుకుంది. ఫిబ్రవరి 26న గురువారం జెనివాలో జరిగిని సమావేశంలో మూడు దేశాలు అంటే ఉక్రైన్, అమెరికా, రష్యా దేశాలు పాల్గొన్నాయి. అంతకు ముందు ఫిబ్రవరి 17,18 తేదీలలో జరిగిన చర్చలు ఫలితం ఇవ్వలేదు. చర్చలు రెండు రోజులు జరిగాయి. నాయకులు తీవ్రంగా కష్టపడ్డారు. ఎవరూ కూడా అంటే రష్యా, ఉక్రైన్ నాయకులు సుముఖత వ్యక్తం చేయలేదు. చర్చలు జరుగుతున్నంత సేపు ఉద్విగ్న వాతావరణం ఏర్పడింది. రెండు దేశాలు చెబుతున్న మాట ఒక్కటే చర్చలలో చాలా కఠిన చట్టాలు వున్నాయి అని, అవి చాలా క్లిష్టం అని, రష్యా అధికార ప్రతినిధి మిడిన్స్కి అన్నాడు. ఒక ప్రక్క చర్చులు జరుగుతుంటే దాడులు రెండు దేశాలు ముమ్మరం చేశాయి. ముందు చర్చలు జరుగుతున్నప్పుడు ఎటువంటి దాడులు జరగరాదు. అందుకే ఇవి నిష్ప్రయోజనం అవుతున్నాయేమో అని ఒక వాదన ఉంది. ఈ సారి ఎలాగైనా పురోగతి సాధిస్తాం అని చర్చలలో పాల్గొనే అమెరికా ప్రతినిధి స్టివ్ విట్ కాఫ్ అన్నాడు. ఇప్పుడు శాంతి బంతి అటు రష్యా, ఇటు ఉక్రైన్ కోర్టులో ఉంది. ఇరువురు నాయకులు బీష్మించుకుని కూర్చుంటే ఎటువంటి చర్చలు అయినా ఫలితం తేలదు. ఇప్పటికే ఈ యుద్ధం కొనసాగబట్టి సంవత్సరాలు నిండుతున్నాయి. కాని ప్రయోజనం శూన్యం. ఈ యుద్ధ నివారణకు శాంతి సంస్థ ఐక్యరాజ్య సమితి కూడా బాధ్యత తీసుకోవాలి. సమితి కూడా భాగస్వామ్యం అయి ఉంటే బాగుండేది. అయినా అమెరికా వారధిగా అటు రష్యా, ఇటు ఉక్రైన్ దేశాల ప్రతినిధులు, నాయకులు అగ్రదేశ దౌత్యం అంగీకరించాలి. ముందు ఉక్రైన్‌కు ఏమి కావాలో తెలుసుకుని చర్చ ప్రారంభించాలి. రష్యా పెద్ద దేశం కనుక కొన్ని చట్టాలు గౌరవించాలి. అలాగే ఉక్రెయిన్ కూడా రష్యాను పునర్ నిర్మాణంకు ఒత్తిడి తేవాలి. రష్యా, ఉక్రైన్ దేశాలకు సంబం ధించి ఒక ఆమోదయోగ్యమైన పార్ములా అమెరికా తెచ్చినప్పుడు రెండు దేశాలు గౌరవించాలి. ప్రధాన అవరోధం అక్కడే వస్తోంది. అప్పుడే రెండు దేశాలు సంయమనం పాటించాలి. అర్థాంతరంగా ఎవరూ లేచి రాకూడదు. అలా వస్తే యుద్ధం ఇంకా ఎక్కువ కొనసాగే అవకాశం ఉంటుంది. శాంతి చర్చలు ఫలించాలంటే రెండు దేశాల నాయకులకు చిత్తశుద్ధి ఉండాలి. పౌరుల గురించి, చిన్న బిడ్డల గురించి, గర్భవతులు గురించి, వృద్ధులు గురించి రష్యా, ఉక్రెయిన్ దేశాలు ఆలోచించాలి. యుద్ధం వలన రెండు దేశాలు తీవ్ర నష్టపోయాయి. రెండు దేశాల ముఖ్య కట్టడాలకు అగ్ర దేశం నడుం కట్టాలి. ఎందుకంటె మధ్యవర్తిత్వం వహిస్తోంది. ఏ దేశానికి అనుకూలంగా చర్చలు ఉండరాదు. ఇప్పటికే ఖర్చు మోపేడంత అయింది. ఒక్క సైన్యానికే రెండు దేశాలు విపరీతంగా ఖర్చు పెట్టాయి. సైనికులకు కూడా నిరాశ వచ్చింది. రెండు దేశాల సైనికుల మరణం అత్యంత బాధాకరం. చర్చలు మంచి సుహృద్భావ వాతావరణంలో జరగాలి. ఏతావాత రష్యా, ఉక్రెయిన్ మంకు పట్టు విడకపోతే ఎన్ని శాంతి చర్చలు జరిపినా, ఎవరు నేతృత్వం వహించిన లాభం ఉండదు. నిజం చెప్పాలంటే ఇది యుద్ధాల శకం కాదు అని భారత ప్రధాని మోదీ మాట రెండు దేశాలు గ్రహించాలి. యుద్ధం కొనసాగించాలంటే నాయకులకు ఉబలాటం కాని పౌరులకు ఎప్పుడెప్పుడు శాంతి వుంటుందా అనే దృక్పధంతో ఉంటారు. కనుక రెండు దేశాలు శాంతి చర్చలలో తీసుకునే నిర్ణయాలను గౌరవించి యుద్ధం ఆగుతుందని ప్రకటన చేయాలి. అప్పుడే పౌరులకు భరోసా ఉంటుంది. చూద్దాం ఈసారైనా జరిగే చర్చలు ఏ మేరకు ఫలం ఇస్తాయో, యుద్ధం కొనసాగుతుందా, ఆగుతుందా అనేది ఇక కొద్ది రోజులలో తెలిసి పోతుంది. యుద్ధం ఆగాలానే కోరుకుందాం. లేకపోతే చర్చలు నిష్ప్రయోజనమే. ●

# విజ్ఞాన వికాసంతోనే దేశాభివృద్ధి సాధ్యం!

డి జె మోహన రావు

భారతీయ శాస్త్రవేత్తల చారిత్రక విజయాలను స్మరించుకుంటూ, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా జరుపుకుంటారు. 1928 ఫిబ్రవరి 28న ప్రఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ అద్భుతమైన రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారు. ఈ దినోత్సవం ఆ చారిత్రక ఘట్టానికిప్రతీక. కోల్‌కతాలోని ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్ ప్రయోగశాలలో చేసిన ఈ పరిశోధన ప్రపంచ విజ్ఞాన శాస్త్రగతిని మార్చివేసింది. కాంతి అణువుల ద్వారా చెదిరినప్పుడు, ఆ కాంతి తరంగదైర్ఘ్యంలో మార్పు వస్తుందనేది విప్లవాత్మక ఆవిష్కరణ. ఇది భౌతిక, రసాయన శాస్త్రాలలో స్పెక్ట్రోస్కోపీ విభాగానికి పునాది వేసింది. ఈ విశేష కృషికి గాను 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. తద్వారా భారతదేశం ప్రపంచ శాస్త్రీయ పటంలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంది. 2026 జాతీయ సైన్స్ దినోత్సవం అనేక ప్రత్యేకతలను సంతరించుకుంది. ప్రధానంగా 'విజ్ఞాన శాస్త్రంలో మహిళలు, వికసిత భారత సాధనలో చోదక శక్తులు' అనే థీమ్ ద్వారా పరిశోధన, సాంకేతికత, స్టెమ్ రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై తీవ్ర దృష్టి సారించారు. మరొకవైపు, భారత ప్రభుత్వ శాస్త్రసాంకేతిక విభాగం 'ప్రత్యేక ప్రతిభావంతుల కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే వినూత్న థీమ్‌ను ఎంచుకుంది. సాంకేతిక ప్రగతి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి, ముఖ్యంగా వికలాంగులకు అందాలన్న సమ్మిళిత దృక్పథం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వేడుకల్లో భాగంగా టైర్2 నగరమైన వరంగల్‌లో దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించే సంఘటన జరుగుతోంది. చారిత్రక కాకతీయ రాణి రుద్రమ దేవి గౌరవార్థం రుద్రమదేవి.1 అనే నమూనా రాకెట్‌ను ప్రయోగించడానికి సన్నాహాలు చేస్తున్నారు. చిన్న నగరాలలో కూడా అంతరిక్ష శాస్త్రీయ ఆవిష్కరణల పట్ల పెరుగుతున్న ఆసక్తికి ఇది సజీవ సాక్ష్యం. భారత రక్షణ వ్యవస్థలో మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వేగవంతమైన, మౌలికమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భారతదేశం ఒకవైపు ఆర్థికంగా, సాంకేతికంగా పురోగమిస్తున్న సమయంలో, దాని సహజ వనరుల పరిరక్షణ అత్యంత క్లిష్టమైన సవాలుగా మారింది. భౌగోళికంగా ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన, అరుదైన జీవవైవిధ్య ప్రాంతాలలో పశ్చిమ కనుమలు అగ్రస్థానంలో ఉన్నాయి. దాదాపు 60,000చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ పర్వత శ్రేణి, దేశంలోని 40నదీ వ్యవస్థలకు పరీవాహక ప్రాంతంగా సేవలు అందిస్తోంది. అయితే విపరీతమైన జనాభా పెరుగుదల, వ్యవసాయ భూముల విస్తరణ, గనుల తవ్వకాల వల్ల



ఈ జీవవైవిధ్య ప్రాంతం విపరీతమైన ఒత్తిడికి గురవుతోంది. ఈ నేపథ్యంలో ప్రఖ్యాత పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మాధవ్ గాడ్గిల్ ప్రతిపాదించిన విధానాలు దేశ పర్యావరణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ ఆంక్షల ద్వారా సాధించబడదని బలంగా విశ్వసించారు. ఆయన చొరవతో 2002నాటి బయోలాజికల్ డైవర్సిటీ యాక్ట్‌లో పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్ అనే విప్లవాత్మక భావన పరిచయం చేశారు. స్థానిక కమ్యూనిటీల భాగస్వామ్యంతో వారి చుట్టూ ఉన్న జీవసంపదను అధికారికంగా డాక్యుమెంట్ చేయడం దీని ఉద్దేశ్యం. బహుళజాతి సంస్థలు స్థానిక పరిజ్ఞానాన్ని దొంగిలించడాన్ని అరికట్టడంలో ఇది ఒక చట్టబద్ధమైన అస్త్రంగా పనిచేస్తోంది. కేరళలోని వాయనాడ్ సమీపంలో ఉన్న గురుకుల బొటానికల్ శాంక్చువరీ పర్యావరణ పరిరక్షణలో అద్భుతాలు చేస్తోంది. మునుపు టీ, అల్లం తోటలుగా ఉన్న ఈ భూమిని తిరిగి ఉష్ణమండల వర్షారణ్యంగా మార్చారు. మొక్కలు పెరగడంతో ఆవాసం పునరుద్ధరించబడి, ఏనుగులు, పెద్ద పులులు వంటి జంతువులు తిరిగి రావడంప్రారంభించాయి. 2030 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్న భారతదేశ సుదీర్ఘ లక్ష్యం నేరుగా దేశ విద్యా వ్యవస్థ నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. ఈదిశగా జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశపెట్టిన మౌలిక సంస్కరణలు 2025 నాటికి క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో అమలులోకి వచ్చాయి. భారతీయ విద్యా వ్యవస్థను దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న అతిపెద్ద అవరోధం బట్టీ పట్టే విధానం. ఈ వ్యవస్థలో వచ్చిన మార్పుల్లో ప్రధానమైనది బోర్డు పరీక్షల ప్రక్షాళన. విద్యార్థులలో పరీక్షల ఒత్తిడిని తగ్గించే ఉద్దేశ్యంతో సంస్కరణలు తెచ్చారు. అయితే, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విద్య విషయంలో క్షేత్రస్థాయి గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతికత, విద్యా రంగాలలో భారతదేశం గొప్ప ఆశయాలను ప్రకటించినప్పటికీ, ఈ లక్ష్యాల సాధనకు పునాది అయిన రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ పై చేస్తున్న వ్యయం ఆందోళనకరంగా ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో పరిశోధన వ్యయం దశాబ్దాలుగా కేవలం 0.6నుండి 0.7పరిమితికే పరిమితమైంది. అభివృద్ధిచెందిన దేశాలు తమ జీడీపీలో ఏకంగా 2శాతం పైగా వెచ్చిస్తున్నాయి. ఈఫండింగ్ కొరత, అధునాతన మౌలిక సదుపాయాల లేమివల్ల ప్రతిభావంతులైన భారతీయ పరిశోధకులు మెరుగైన అవకాశాల కోసం విదేశాలకు వలస వెళ్తున్నారు. దీనినే బ్రెయిన్ డ్రెయిన్ అని పిలుస్తారు. ఈ తీవ్రమైన అంతరాన్ని పూడ్చేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ఏకంగా14,000 కోట్ల బడ్జెట్‌తో అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించింది. దేశంలో ఇన్నోవేషన్‌ను రూపొందించేందుకు రూ. 1.0లక్షల కోట్లతో బృహ త్తరమైన ఖరీసెర్చ్, డెవలప్మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. ఈ కృషితో గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్ తన ర్యాంకును అద్భుతంగా మెరుగుపరచుకుంది. ప్రపంచ మేధోసంపత్తి ఫైలింగ్స్‌లో 6వ స్థానంలో నిలి చింది. వ్యవస్థాగత సవాళ్లను నిరంతరం అధిగమిస్తూ ముందుకు సాగితే, 2047 నాటికి భారతదేశం నిజమైన వికసిత్ భారత్‌గా ప్రపంచానికి ఆదర్శంగా నిలవడం తథ్యం. ●

# సోషల్‌మీడియాపై నియంత్రణా, నిషేధమా?

## అత్యధికశాతం నియంత్రణే మేలంటున్న నిపుణులు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** 16 సంవత్సరాల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించే అంశంపై దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఆలోచిస్తున్నట్టు వస్తున్న వార్తలు పెద్ద చర్చకు దారితీశాయి. చిన్నపిల్లల మానసిక ఆరోగ్యంపై సోషల్ మీడియా చూపిస్తున్న తీవ్రమైన ప్రభావమే ఈ చర్చకు ప్రధాన కారణం. సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాలా లేక నియంత్రణ సరిపోతుందా అనే అంశంపై నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇలాంటి ఒక చట్టాన్ని అమలు చేస్తోంది. యువతను హానికరమైన కంటెంట్ నుంచి, అధిక స్క్రీన్ టైమ్ బారిన పడకుండా రక్షించడం ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం. అక్కడ ఈ చట్టాన్ని తీసుకురావడానికి ముందు ప్రభుత్వం పిల్లలు, వారి తల్లిదండ్రులతో విస్తృతంగా చర్చలు జరిపింది. ఈ అంశంపై ట్రస్ట్ అండ్ సేఫ్టీ నిపుణుడు, జర్నలిస్ట్ జతిన్ గాంధీ స్పందిస్తూ ఇది కచ్చితంగా సరైన దిశలో వేస్తున్న ముందడుగు. ఇన్నాళ్లూ సోషల్ మీడియాకు అడ్డూ అదుపూ లేకుండా పోయి, మన సమాజంలో గందరగోళం సృష్టించింది. మొదట నిషేధించి, ఆ తర్వాత నియంత్రించి, ఆపై నిబంధనలను సడలించడం సరైన పద్ధతని గట్టిగా వాదించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు లాభాలకే ప్రాధాన్యత ఇస్తూ నాణ్యతను ఎలా తగ్గిస్తున్నాయో ఆయన వివరించారు. గతంలో మనం కంటెంట్ కోసం వెతికేవాళ్లం, కానీ ఇప్పుడు కంటెంటే మన అభిరుచులను గుర్తించి మనల్ని వెతుక్కుంటూ వస్తోంది అని ఆయన హెచ్చరించారు. సంపూర్ణ నిషేధం ఆచరణ సాధ్యం కాదని మరికొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పుణేలోని ఎంఐటీ ఆర్ట్, డిజైన్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీకి చెందిన సంబిత్ పాల్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో పిల్లలను స్మార్ట్‌ఫోన్లకు, సోషల్ మీడియాకు పూర్తిగా దూరం చేయడం వాస్తవికం కాదు. దీనికి బదులుగా, తల్లిదండ్రుల పర్యవేక్షణ, సరైన అవగాహన కల్పించడం ద్వారా దాని దుష్ప్రభావాలను తగ్గించవచ్చని సూచించారు. ఈత రాకుండానే పిల్లలను అంతులేని కంటెంట్ సముద్రంలోకి తోసేయడం ప్రమాదకరం. పెద్దలే అందులో తేలడానికి ఇబ్బంది పడుతుంటే, పిల్లలు ఒంటరిగా ఈదగలరని ఎలా ఆశించగలమని ఆయన ప్రశ్నించారు. ఫ్యాక్ట్ చెకింగ్ నిపుణుడు జాయ్‌దీప్ దాస్‌గుప్తా కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వాడకం వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, ఆన్‌లైన్ వేధింపులు, అనారోగ్యకరమైన పోలికల బారిన పడే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు స్క్రీన్ టైమ్‌పై పరిమితులు విధించాలని తెలిపారు. మొత్తం మీద, నిషేధమా లేక నియంత్రణనా అనే దానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, పిల్లలను సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి కాపాడాలన్న విషయంలో మాత్రం అందరూ ఏకాభిప్రాయంతో ఉన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణతో పాటు సోషల్ మీడియా సంస్థలు కూడా కఠినమైన వయోపరిమితి నిర్ధారణ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.




# అఫ్ఘాన్ నగరాలపై పాక్ వైమానిక దాడులు

## ఉభయ దేశాల మధ్య పెరిగిన ఉద్రిక్తతలు

**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 27:** పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. సరిహద్దులో ఇరుదేశాల మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో పాక్ కీలక ప్రకటన చేసింది. అఫ్ఘాన్‌పై బహిరంగ యుద్ధం ప్రారంభించినట్లు తెలిపింది. ఈ మేరకు పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. 'మా సహనం నశించింది. ఇప్పుడు మాకు.. మీకు మధ్య బహిరంగ యుద్ధమే' అని అఫ్ఘానిస్థాన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. ఆపరేషన్ గజబ్‌లిల్ హక్.. గురువారం రాత్రి అఫ్ఘాన్ దాడులకు బదులుగా పాక్ వైమానిక దాడులు ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్'గా పేర్కొంది. కాబుల్‌లో మూడుసార్లు పేలుడు శబ్దాలు వినిపించాయని తాలిబన్ అధికారులు పేర్కొన్నారు. కాబుల్, కాందహార్, పక్తియా ప్రావిన్స్‌లలో వైమానిక దాడులు జరిగాయని అఫ్ఘాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబీహుల్లా తెలిపారు. అయితే, ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని వెల్లడించారు. పాక్‌పై చేపట్టిన దాడుల్లో 55 మంది ఆ దేశ సైనికులు చనిపోయారని అఫ్ఘాన్ ప్రకటించింది. అయితే, ఇస్లామాబాద్ దీన్ని తోసిపుచ్చింది. ఘర్షణల్లో ఇద్దరు పాక్ సైనికులు మరణించారని, మరో ముగ్గురు గాయపడ్డారని పేర్కొంది.

ఇస్లామాబాద్ సైనికుల నిర్బంధంపై అఫ్ఘాన్ చేసిన ప్రకటనను పాక్ ప్రభుత్వ ప్రతినిధి మోషరఫ్ అలీ జైదీ ఖండించారు. అఫ్ఘాన్ సైనికులే 133 మంది మరణించారని.. 200 మందికిపైగా గాయపడ్డారన్నారు. తొమ్మిది మంది సైనికులను నిర్బంధించినట్లు తెలిపారు. ఇటీవల తమపై జరిగిన వైమానిక దాడులకు ప్రతీకారంగా పాక్‌పై అఫ్ఘాన్ విరుచుకుపడింది. ఇది ఇరు దేశాల మధ్య తాజా ఉద్రిక్తతలకు దారి తీసింది.



## సింగపూర్‌లో పోలీసునని నమ్మించి మహిళపై అత్యాచారం..

### భారత సంతతి వ్యక్తికి 12 యేళ్ల జైలుశిక్ష, 12 కొరడా దెబ్బలు

**సింగపూర్, ఫిబ్రవరి 27:** భారత సంతతికి చెందిన ఓ వ్యక్తి.. తనను తాను పోలీసుగా చెప్పుకొని, ఓ మహిళకు సాయం చేస్తానంటూ నమ్మించి మోసం చేశాడు. ముఖ్యంగా సింగపూర్‌లో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే నేరం రుజువు కావడంతో.. సింగపూర్ కోర్టు అతడికి కఠిన శిక్ష విధించింది. ముఖ్యంగా 12 యేళ్ల జైలుశిక్షతో పాటు 12 కొరడా దెబ్బల శిక్షను ఖరారు చేసింది. అసలేం జరిగిందంటే..? 2022 జూలై 11న రాత్రి 8 గంటల సమయంలో ఈ దారుణం జరిగింది. ఇండోనేసియాకు చెందిన 35 యేళ్ల మహిళ తన స్నేహితులతో కలిసి సింగపూర్‌లోని లిటిల్ ఇండియా మెట్రో స్టేషన్ సమీపంలో వేచి చూస్తోంది. అప్పుడే అక్కడకు భారత సంతతికి చెందిన మలేసియా వ్యక్తి షర్వేన్ శెట్టి (48) వెళ్లి.. తనను తాను ఓ పోలీసు అధికారిగా పరిచయం చేసుకున్నాడు. అతడి మాటలు నమ్మిన ఆమె.. తన వద్ద ఏదో తనిఖీ చేయాలని నాటక మాడాడు. అలా ఆమెను తన స్నేహితులకు దూరంగా.. మెట్రోస్టేషన్ ఎగ్జిట్ ఎఫ్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసు కెళ్లాడు. ఆపై అక్కడే ఉన్న పొదల్లో ఆమెపై అమానుషంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. షర్వేన్ శెట్టిని అరెస్టు చేసి ఈ నెల 3న హైకోర్టులో హాజరుపరిచారు. అయితే మొదట్లో తాను నేరం చేయలేదని బుకాయించిన షర్వేన్‌శెట్టి.. విచారణ రెండో రోజున తన తప్పును అంగీకరించాడు. బాధితురాలు విదేశీ యువతి కావడం, ఆమెకు స్థానిక అధికారుల పట్ల పూర్తి అవగాహన ఉండదని ఈ అత్యాచార దాడికి పాల్పడటం తీవ్రమైన నేరమన్నారు.

# డిఎంకెలో చేరిన మాజీ సిఎం పన్నీర్‌సెల్వం



**చెన్నై, ఫిబ్రవరి 27:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ, రాష్ట్ర రాజకీయాల్లో కనీవినీ ఎరుగని భారీ మార్పు చోటుచేసుకుంది. దివంగత ముఖ్యమంత్రి జయలలితకు అత్యంత నమ్మకస్తుడు, మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఏఐఏడీఎంకే మాజీ నేత పన్నీర్‌సెల్వం అధికార ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె)లో చేరారు. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ ఉదయం చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్న అరివాలయం ఒక్కసారిగా సందడిగా మారింది. కొన్ని రోజులుగా జరుగుతున్న ఊహాగానాలకు బలం చేకూరుస్తూ, పనీర్ సెల్వంతోపాటు ఆయన కుమారుడు, మాజీ ఎంపీ రవీంద్ర నాథ్, ఎమ్మెల్యే అయ్యప్పన్, ఇతర కీలక నేతలు కూడా డీఎంకేలో చేరారు. స్వయంగా సీఎం స్టాలిన్ ఆయనకు ఆహ్వానం పలికారు. పార్టీ కండువా కప్పి డీఎంకేలోకి సాదరంగా ఆహ్వానించారు. డీఎంకేలో చేరిన అనంతరం పన్నీర్ సెల్వం భావోద్వేగంగా మాట్లాడారు. డీఎంకేను తల్లిలాంటి పార్టీగా అభివర్ణించారు. అరిగ్నర్ అన్నా, కలైంజ్ఞర్ కరుణానిధి నిర్దేశించిన మార్గంలో పయనిస్తూ స్టాలిన్ అద్భుతమైన పాలన అందిస్తున్నారు. గత ఐదేళ్లలో ఆయన అందించిన అభివృద్ధిని చూసి దేశమంతా ఆశ్చర్యపోతోంది. అందుకే వారి నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకున్నానని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, జయలలితకు అత్యంత నమ్మకస్తుడిగా ముద్రపడ్డ నేత, దశాబ్దాల రాజకీయ ప్రత్యర్థి పార్టీలో చేరడం ఏఐఏడీఎంకే శ్రేణులకు పెద్ద షాక్ అనే చెప్పాలి. ఇది ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. పళని స్వామి, పన్నీర్‌సెల్వంలమధ్య కొనసాగిన విభేదాలు చివరకు పనీర్ సెల్వంను బహిష్కరించే వరకు వెళ్లింది. బహిష్కరణ అనంతరం పనీర్ తిరిగి ఏఐఏడీఎంకేలోకి చేరాలని భావించినా పళనిస్వామి సానుకూలంగా స్పందించలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పనీర్ సెల్వం తన కుమారుడు, తన అనుకూల నేతలతో కలిసి డీఎంకేలో చేరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పనీర్ సెల్వం డీఎంకే తరఫున తన సొంత నియోజకవర్గమైన బోడి మెట్టు నుంచి పోటీ చేయనున్నారు. పనీర్ చేరికతో దక్షిణ తమిళనాడులో డీఎంకేకు ప్రయోజనం ఉంటుందని ఆ పార్టీ భావిస్తోంది. అక్కడ తేవార్ల ఆధిపత్యం ఎక్కువ. దీంతో తేవార్లకు చెందిన పనీర్ సెల్వం ఓటు బ్యాంకు కలిసొస్తుందని పార్టీ విశ్వాసం. డీఎంకేలో చేరిన సందర్భంగా పనీర్ మాట్లాడుతూ పళనిస్వామి వైఖరితో ఏఐఏడీఎంకే రాబోయే ఎన్నికల్లో గెలిచే అవకాశం లేదన్నారు. అతడి అహంకారం, అధికార దుర్వినియోగం కారణంగా పార్టీ ఎన్నికల్లో గెలిచే పరిస్తితి లేదని పనీర్ అన్నారు.

# ఇకపై సిమ్ ఉంటేనే వాట్సాప్

## కేంద్రం కీలక నోటిఫికేషన్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** మెసేజింగ్ యాప్ వాట్సాప్‌పై కేంద్రం నిబంధనలు వెల్లడించింది. ఈ నెల 28వ తేదీ తర్వాత సిమ్ లేకుండా వాట్సాప్ పనిచేయదు. వాట్సాప్ వాడాలంటే సిమ్ తప్పనిసరిగా ఉండాలంటూ జారీచేసిన సిమ్ అనివార్యం నిబంధనకు ఈనెల 28 డెడ్‌లైన్‌గా కేంద్రం గతంలో ప్రకటించింది. ఈ డెడ్‌లైన్‌ను పొడిగించబోమని కేంద్రం స్పష్టంచేసింది. జాతీయ భద్రతకు, సైబర్ నేరగాళ్ల నుంచి యూజర్లను కాపాడేందుకే వీటిని అమలులోకి తెస్తున్నట్టు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, స్నాప్‌చాట్, షేర్‌చాట్, జియోచాట్, అరాటై, జోష్ లాంటి సామాజిక మాధ్యమాల వినియోగానికి మొబైల్ ఫోన్‌లో తప్పనిసరిగా సిమ్ ఉండాల్సిందే. అలాగే కంప్యూటర్‌లో లాగిన్ చేసిన వాట్సాప్ కూడా ఆరు గంటల తర్వాత ఆటోమేటిక్‌గా లాగౌట్ అయిపోతుంది. సైబర్ నేరగాళ్లను పట్టుకోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మార్చి 1వ తేదీ నుంచి వాట్సాప్ నిబంధనలు కూడా మారిపోతున్నాయి. గతంలో మొబైల్ నుంచి సిమ్ తొలగించినా వాట్సాప్ యాప్ యథావిధిగా పనిచేసేది. మార్చి 1 నుంచి రిజిస్టరైన సిమ్ తప్పనిసరిగా మొబైల్‌లో ఉండాలి. పైగా అది క్రియాశీలకంగా (అంటే రీచార్జి చేసి) ఉండాలి. అలాగే గతంలో పర్సనల్ కంప్యూటర్లలో వాట్సాప్‌ను లాగిన్ చేస్తే అది ఎన్ని రోజులైనా క్రియాశీలకంగా ఉండేది. కొత్త నిబంధన ప్రకారం ఆరు గంటల తర్వాత అది ఆటోమేటిక్‌గా లాగౌట్ అయిపోతుంది. గతంలో ఎక్కడి నుంచైనా ఓటీపీని ఉపయోగించి వాట్సాప్‌కు లాగిన్ అయ్యే వారు. ఇప్పుడు సిమ్ లేకపోతే వాట్సాప్ పనిచేయదు.

# విడాకులు కోరుతూ విజయ్‌భార్య కోర్టులో పిటిషన్



**చెన్నై, ఫిబ్రవరి 27:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీవీకే పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు భారీ షాక్ తగిలింది. విజయ్ నుంచి విడాకులు కావాలని కోరుతూ ఆయన భార్య సంగీత చెంగల్పట్టు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒక సినీ నటితో విజయ్‌కు వివాహేతర సంబంధమే కారణమని విడాకుల పిటిషన్‌లో సంగీత పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణకు అంగీకరించిన కోర్టు ఏప్రిల్ 20న కోర్టుకు రావాలని విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. నటుడు విజయ్, సంగీత వివాహం 1999లో జరిగింది. విజయ్ ఒక సినీ నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపిస్తూ, ఈ కారణంగానే అతడి నుంచి విడాకులు కోరుతున్నట్లు సంగీత తన పిటిషన్‌లో వివరించారు. రెండేళ్లక్రితం విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతడిపై ఇటీవల బీజేపీ నేత తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నాయనార్ నాగేంద్రన్ మాట్లాడుతూ త్రిష ఇంటి నుంచి విజయ్ బయటికి రావాలన్నారు. తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలకు వాడుతున్నారని విజయ్ విమర్శించాడు. ఈ అంశంపై త్రిష కూడా స్పందించింది. తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాల కోసం వాడుకోకూడదని సూచించింది. దీంతో నాగేంద్రన్ తర్వాత క్షమాపణ చెప్పాడు. దీంతో నెమ్మదిగా ఈ అంశం కనుమరుగైనట్లు అనిపించినా తాజాగా విజయ్ భార్య విడాకుల పిటిషన్‌తో ఈ ఎపిసోడ్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది. నిజానికి విజయ్ త్రిష మధ్య బంధం గురించి చాలా కాలం నుంచి ప్రచారం జరుగుతోంది. ఇటీవల నాగేంద్రన్ వ్యాఖ్యలు, విడాకుల పిటిషన్ అంశం వీటికి బలం చేకూరుస్తోంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ టీవీకే పోటీ చేయనున్న నేపథ్యంలో ఈ అంశం అతడి రాజకీయ భవిష్యత్‌పై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది.

# సంక్షిప్తంగా..

## జీవితఖైదు వేసారని జడ్జిని బెదరించిన నిందితులు

**లక్నో, ఫిబ్రవరి 27:** కారుతో ఢీకొట్టి ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులకు న్యాయమూర్తి శిక్ష విధించగా, వారు బెదిరింపులకు పాల్పడిన సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని బిజ్‌నోర్‌లో జరిగింది. మీ ఇల్లు ఎక్కడో తెలుసునని, విడిచిపెట్టేది లేదని ఇద్దరు నిందితులు బెదిరించగా, ప్రభుత్వం జడ్జికి అదనపు భద్రత కల్పించింది. 2024లో ఒక వ్యక్తిని కారుతో ఢీకొట్టి హత్య చేసిన కేసుపై బిజ్‌నోర్ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జస్టిస్ నిజేంద్ర కుమార్ విచారణ జరిపారు. నిందితులుగా తేలిన జైదీప్, పింటూ చౌహాన్‌లకు ఆయన జీవిత ఖైదు శిక్షను విధిస్తున్నట్లు తీర్పు వెలువరించారు. జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి ప్రకటన చేయగానే నిందితులు ఇద్దరు ఆగ్రహంతో ఊగిపోయారు. మీ ఇల్లు ఎక్కడో తెలుసంటూ బెదిరింపులకు గురి చేసే ప్రయత్నం చేశారు. నిందితులు బెదిరించిన నేపథ్యంలో న్యాయమూర్తికి అదనపు భద్రత కల్పించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంగ్రామ్ సింగ్ వెల్లడించారు.

## 'కేరళ స్టోరీ'పై నిషేధం ఎత్తివేత



**తిరువనంతపురం, ఫిబ్రవరి 27:** ది కేరళ స్టోరీ 2 సినిమా విడుదల కాకుండా కేరళ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. దీంతో ఈ చిత్రం విడుదలకు మార్గం సుగమమైంది. ఈ చిత్రం విడుదల కాకుండా హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవల స్టే ఇచ్చింది. సీబీఎఫ్‌సీ తీరును తప్పుబడుతూ సినిమాను పునఃపరిశీలించాల్సిందిగా ఆదేశించింది. 15 రోజుల పాటు సినిమాపై స్టే విధించింది. సింగిల్ బెంచ్ తీర్పును చిత్ర నిర్మాత కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. ఈరోజు సాయంత్రం వరకు ఇరువర్గాల తరఫున సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ పీవీబాలకృష్ణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసింది. 2023లో విడుదలైన ది కేరళ స్టోరీ చిత్రానికి సీక్వెల్ ది కేరళ స్టోరీ 2 రూపొందింది.

## కోర్టు తీర్పును శిరసావహించాల్సిందే: అన్నాహాజారే




**ముంబై, ఫిబ్రవరి 27:** లిక్కర్ పాలసీపై ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పును అంగీకరించాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే అన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై ఆయన స్పందించారు. న్యాయ వ్యవస్థ దేశానికి వెన్నెముక లాంటిదని, దాని నిర్ణయాలను గౌరవించాలని స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ మంత్రి సిసోడియాతో పాటు 23 మందిని నిర్దోషులుగా రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం ప్రకటించింది. మద్యం విధానాన్ని రూపొందించే క్రమంలో అవినీతి జరిగినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొంది. కాగా, అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ ఎదుగుదలకు ముఖ్యులైన అన్నా హజారే దీనిపై స్పందించారు. న్యాయ, భద్రతా వ్యవస్థల బలం మీద మన దేశం నడుస్తుందని తెలిపారు.

# స్కూలుబస్సులో ఒంటరిగా ఏడుగంటలు.. అల్లాడిపోయిన చిన్నారి బాలుడు



**గురుగ్రామ్, ఫిబ్రవరి 27:** నోయిడాలో ఆసక్తికర ఘటన జరిగింది. స్కూల్ బస్సులో నిద్రపోయిన ఒక చిన్నారి బాలుడు ఏడు గంటలు అందులోనే ఉండిపోయాడు. బస్సులోంచి బయటికి ఎలా రావాలో తెలియక ఒంటరిగా అల్లాడిపోయాడు. నోయిడాలో ఒక ప్రైవేటు స్కూలుకు చెందిన ఐదేళ్ల బాలుడిని అతడి తల్లి గురువారం ఉదయం స్కూల్ బస్సు ఎక్కించింది. తర్వాత కొంతసేపటికి బస్సు స్కూల్‌కు చేరుకుంది. అందరు విద్యార్థులు బస్సు దిగి స్కూల్‌కు వెళ్లిపోయారు. కానీ, ఈ బాలుడు మాత్రం వెనకాల ఒక సీట్లో పడుకుని అలాగే ఉండిపోయాడు. బస్సు సిబ్బంది, స్కూల్ సిబ్బంది కూడా గమనించలేదు. అనంతరం బస్సును చాలా దూరంగా పార్కింగ్ ప్లేసులో నిలిపి డ్రైవర్ వెళ్లిపోయాడు. ఆ పార్కింగ్ ప్లేసులో వాహనాలు తప్ప ఎవరూ లేరు. మధ్యాహ్నం ఆ చిన్నారి బాలుడి కోసం తల్లి స్కూల్‌కు వచ్చింది. బాలుడు స్కూల్‌కు రాలేదని యాజమాన్యం చెప్పింది. తానే స్కూల్ బస్సు ఎక్కించానని తల్లి చెప్పింది. దీంతో స్కూల్ బస్సు అటెండెన్స్ చెక్ చేయగా బాలుడు అందులోకి ఎక్కినట్లు ఉంది. బాలుడు ఎలా మిస్సయ్యాడో తెలియక తల్లి, స్కూల్ సిబ్బంది, బస్సు సిబ్బంది తలలు పట్టుకున్నారు. భయాందోళనకు గురై బాలుడి గురించి వెతకడం ప్రారంభించారు. చివరకు చాలా సేపటి తర్వాత బాలుడిని పార్కింగ్ చేసిన బస్సులో గుర్తించారు. బాలుడిని గుర్తించేందుకు ఏడు గంటలు పట్టింది. అంటే ఏడు గంటలపాటు బాలుడు బస్సులోనే ఉండిపోయాడు. ఒంటరిగా సాయం కోసం అర్థించినా, అక్కడ చిన్నారిని పట్టించుకునే వాళ్లెవరూ లేరు. ఏడుస్తూ గంటలపాటు ఎదురు చూశాడు. చివరకు బాలుడిని గుర్తించిన సిబ్బంది తల్లికి అప్పగించారు. ఈ ఘటనలో బస్సు సిబ్బంది, స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంపై తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషంలో బస్సుల్ని మార్చడం వల్ల ఈ పొరపాటు జరిగిందని, చిన్నారి బాలుడిని తల్లికి అప్పగించామని యాజమాన్యం తెలిపింది.

## ఇరాన్ క్షిపణులపై ట్రంప్ వ్యాఖ్యలు తిరస్కరించిన ఇరాన్



**టెహ్రాన్, ఫిబ్రవరి 27:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్టేట్ ఆఫ్ ది యూనియన్ స్పీచ్‌లో ఇరాన్ క్షిపణి సామర్థ్యంపై చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ స్థాయిలో పెద్ద చర్చకు దారితీశాయి. ఇరాన్ అభివృద్ధి చేస్తున్న అత్యాధునిక క్షిపణులు త్వరలోనే అమెరికా గడ్డను తాకే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ను ట్రంప్ హెచ్చరించారు. ఈ విషయంలో అధ్యక్షుడి మాటలను అమెరికా సొంత నిఘా సంస్థలే తోసిపుచ్చాయి. ఇరాన్ కు అంత సామర్థ్యంలేదని, ఇప్పట్లో అది సాధ్యం కాదని చెప్పాయి. దీంతో వైట్ హౌస్ లో భేదాభిప్రాయాలు ముదిరాయి. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (డీఐఏ) నివేదికల ప్రకారం ఒక పూర్తిస్థాయి ఖండాంతర క్షిపణిని తయారు చేయడానికి ఇరాన్ కు 2035 వరకు సమయం పడుతుంది. ఒకవేళ చైనా లేదా ఉత్తర కొరియా వంటి దేశాలు సాంకేతిక సాయం అందించినా సరే కనీసం ఎనిమిదేళ్ల వరకు ఇరాన్ అమెరికాను తాకగలిగే క్షిపణిని సిద్ధం చేయలేదని మూడు ఇంటెలిజెన్స్ వర్గాలు ధ్రువీకరించాయి. ట్రంప్ తన వాదనను అతిశయోక్తిగా చెబుతున్నారని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ఆరోపణలను ఇరాన్ మంత్రి కొట్టిపారేశారు.

# జెఎన్‌యులో నిరసనలు హింసాత్మకం!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** రాజధానిలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)కి చెందిన స్టూడెంట్ యూనియన్ (జేఎన్‌యూఎస్‌యూ) విద్యార్థులు చేపట్టిన ర్యాలీ హింసాత్మకంగా మారింది. ముందురోజు సాయంత్రం చేపట్టిన నిరసన ర్యాలీ హింసాత్మకంగా మారడంతో పోలీసులు విద్యార్థి నేతలను అరెస్టు చేశారు. జేఎన్‌యూఎస్‌యూకు చెందిన 14 మంది అగ్రనేతలు సహా మొత్తం 51 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జేఎన్‌యూఎస్‌యూ ప్రెసిడెంట్ అదితి మిశ్రా, మాజీ ప్రెసిడెంట్ నితీష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ గోపికా బాబు, జాయింట్ సెక్రెటరీ దానిష్ అలీసహా ఇతర నేతలను అరెస్టు చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. నిందితులపై వసంత్ కుంజ్ నార్త్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

## ముంబైలో విదేశీ యువతికి చేదు అనుభవం

**ముంబయి, ఫిబ్రవరి 27:** ముంబైలో పర్యటిస్తున్న ఓ విదేశీ యువతికి వేధింపులు ఎదురయ్యాయి. తనకు ఎదురైన ఈ చేదు అనుభవాన్ని బాధితురాలే స్వయంగా వీడియో తీసి తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై ముంబై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండు నెలలుగా తాను భారతదేశంలో పర్యటిస్తున్నానని, ఇక్కడి ప్రజలు ఎంతో దయతో, ఆప్యాయంగా పలకరించారని, అయితే ఈ ఒక్కరోజు మాత్రం అందుకు భిన్నంగా జరిగిందని బాధితురాలు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మేము వద్దని చాలాసార్లు చెప్పినా, ఇద్దరు వ్యక్తులు మమ్మల్ని 15 నిమిషాలకు పైగా వెంబడించారు. ఫొటోలు కావాలంటూ తీవ్రంగా ఒత్తిడి చేశారు. దీంతో నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. ఒకానొక దశలో వారిని పక్కకు నెట్టేయాల్సి వచ్చింది. నో అంటే కాదని అర్థం చేసుకోవాలి. మన భద్రత, సౌకర్యమే అన్నింటికంటే ముఖ్యమని ఆమె రాసుకొచ్చారు. ఈ వీడియో వైరల్ కావడంతో ముంబై పోలీసులు స్పందించారు. అగ్రిపాడు పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు గుర్తుతెలియని నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 78(1), 3(5) కింద కేసు (ఎఫ్ఐఆర్ నెం. 97/26) నమోదు చేశారు. నిందితులను గుర్తించి, అరెస్ట్ చేసేందుకు దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. విదేశీ పర్యాటకుల పట్ల ఇలాంటి ఘటనలు జరగడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది డిసెంబర్ 10న గౌహతిలో జరిగిన ఓ సంగీత కచేరీలో తనను అసభ్యంగా తాకారన్నారు.

# విత్తనోత్పత్తి రైతులకు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోండి

**రాష్ట్ర రైతు కమిషన్, సభ్యులతో మాజీ ఎమ్మెల్సీ కవిత భేటీ**
**కవితను అభినందించిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**
**త్వరలో రాష్ట్ర పరిధిలో విత్తన చట్టం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పత్తి విత్తనోత్పత్తి రైతులకు బకాయిలు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి మాజీ ఎమ్మెల్సీ కవిత విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం గద్వాల జిల్లా విత్తనోత్పత్తి రైతులతో కలిసి బీఆర్కె భవన్‌లో కమిషన్‌ను ఆమె కలిశారు. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డితో సమావేశమై రైతుల సమస్యను వివరించారు. గతంలోనే గద్వాల్ పత్తి విత్తనోత్పత్తి రైతుల ఇష్యూ కమిషన్ దృష్టికి తేగా కలెక్టర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి కంపెనీల నుండి నష్టపరిహారం ఇప్పించిన విషయాన్నికమిషన్ చైర్మన్ కోదండరెడ్డి వివరించారు. అయితే గత సీజన్‌లో సాగుచేసిన రైతులకు నష్టపరిహారం అందలేదని కొంత బకాయిలు ఉన్నట్లు కమిషన్ దృష్టికి మాజీ ఎమ్మెల్సీ కవిత తీసుకొచ్చారు. సమావేశం అనంతరం కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. కవిత ఒక ప్రతిపక్ష నాయకురాలిగా పనిచేస్తోందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం మంచి సాంప్రదాయమన్నారు. గద్వాల్ జిల్లాలో రైతులు పత్తి విత్తనాలను ఎక్కువగా పండిస్తున్నారని, గతంలోనే ఈ సమస్య కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. అక్కడి ఆర్గనైజర్లతోనే ఈ సమస్య వస్తుందని విత్తన కంపెనీల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. విత్తన కంపెనీలు ఆర్గనైజర్లను అడ్డం పెట్టుకొని విత్తనోత్పత్తి చేస్తున్నాయని, విత్తన కంపెనీలు ఇచ్చే విత్తనాలే రైతులు సాగుచేస్తున్నారని, రంజిత్ కుమార్ ద్వారా 10వేల మంది రైతులకు రూ.200 కోట్ల బకాయిలు ఉన్నాయని కవిత కమిషన్ దృష్టికి తీసుకొచ్చిందని ఆయన వివరించారు. ఇది సీరియస్ విషయమేనని, ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. సీఎం రేవంత్.. వ్యవసాయ రంగానికి అధిక ప్రాముఖ్యత ఇస్తున్నారని, రుణ మాఫీ, భరోసా, బోనస్ ఇచ్చి రైతులకు అండగా నిలబడ్డారని చెప్పారు. ఇటీవల సీఎంతో కమిషన్ సమావేశమైనప్పుడు చాలావిషయాలు చర్చకు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లపై కేంద్రం ఆంక్షలు పెట్టడం సరికాదని ఈ సందర్భంగా కోదండరెడ్డి స్పష్టం చేశారు. వరి కొనుగోళ్ల విషయంలోనూ ఇబ్బంది పెడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ చట్టాలు రైతులకు ఇబ్బందిగా ఉన్నాయని, తెలంగాణ రాకముందు విత్తన కంపెనీల అనుమతి కోసం వ్యవసాయశాఖ కార్యాలయానికి వచ్చేవాళ్లని, కానీ గత పదేళ్లకాలంలో సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇచ్చుకునే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కల్తీ విత్తనాలు బాగా పెరిగాయని, విత్తనం అనేది రైతు హక్కు అని స్పష్టం చేశారు. పూర్వకాలం విత్తనాన్ని కొనేవారు కాదని, కానీ ఇప్పుడు విత్తనం కొనుకొని పంటవేసుకునే పరిస్థితి వచ్చిందని వాపోయారు. కేంద్ర విత్తన చట్టం ముసాయిదా దారుణంగా ఉందన్న కోదండరెడ్డి అభ్యంతరం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం, కమిషన్ కేంద్రానికి లేఖ రాసిందన్నారు. రాష్ట్ర పరిధిలో విత్తన చట్టం తీసుకురానున్నామని చెప్పారు. బీటీ పత్తి విత్తనం అమ్మకానికి అనుమతి లేదని, భారతదేశంలో నిషేధం ఉందన్నారు. ఆర్గనైజర్లు విత్తనోత్పత్తి చేసే రైతులు కూడా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో చాలామంది రైతులకు రుణమాఫీ అందలేదని, కో ఆపరేటివ్ బ్యాంకుల్లో ఆధార్ అనుసంధానం కాలేదని, యూరియా యాప్ విషయంలో కూడా రైతులు కాస్తా ఇబ్బంది పడ్డున్నారని ప్రభుత్వానికి కమిషన్ వివరించిందని చెప్పారు. కలుపు మందు వినియోగం విషయంలో కూడా రైతులను అప్రమత్తం చేయాలని, వసువు రైతులకు యంత్రపరికరాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించామని చెప్పారు. అనంతరం కమిషన్ సభ్యులు గోపాల్‌రెడ్డి మాటాడుతూ.. రాష్ట్రంలో యూరియా మోతాదును మించి వాడుతున్నారని, సేంద్రియ వ్యవసాయం చేయాలని రైతులకు పిలుపు నిచ్చారు. విత్తనోత్పత్తి చేస్తున్న రైతు బాగుపడటం లేదు కాని విత్తనోత్పత్తి కంపె నీలు, ఆర్గనైజర్లే బాగుపడుతున్నారని మండిపడ్డారు.


రవీంద్రభారతి వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏనుగు నరసింహారెడ్డి, గోవింద్ తదితరులు

# రవీంద్రభారతి బుకింగ్ ఇకనుండి ఆన్‌లైన్

**సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** రవీంద్రభారతిలో కార్యక్రమాలు చేసుకోవాలనుకునే వారు ఇకనుంచి ఎక్కడ నుండైనా వేదికను అంతర్జాలం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చునని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంత్రి రవీంద్రభారతి వెబ్‌సైట్ డబ్లుడబ్లుడబ్లు. రవీంద్రభారతి. ఆన్‌లైన్‌ను శుక్రవారం సాయంత్రం రవీంద్రభారతి ప్రాంగణంలోని కళాభవన్‌లోని తన కార్యాలయంలో రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, గోవింద్ తదితరులతో కలిసి ఆవిష్కరించి వివరాలను తెలిపారు. రవీంద్రభారతిలో ప్రధాన మందిరం 1036 కెపాసిటీతో, మొదటి అంతస్తులోని సమావేశ మందిరం 120 కెపాసిటీతో, రెండో అంతస్తులో ప్రివ్యూ థియేటర్ 100 కెపాసిటీ అందు బాటులో ఉన్నాయని, ప్రతి వేదికలో ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు స్లాట్లుగా కేటాయించబడుతుంది. ప్రివ్యూ థియేటర్‌లో లఘుచిత్రాల ప్రదర్శనకు అవకాశం ఉంటుంది. ఔత్సాహిక ప్రదర్శనా కారులైనా తమ స్లాట్లను 90 రోజులు ముందుగా బుక్ చేసుకునే అవకాశం ఉంది. కళాప్రదర్శకులు వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమకు కావలసిన రవీంద్రభారతిలోని వేదికను ఎంచుకుని తమకు కావాల్సిన తేదీని, స్లాట్లను పరిశీలించి బుక్ చేసుకోవచ్చునని చెప్పారు. బుక్ చేసుకున్న స్లాట్ ఖాళీగా ఉన్నట్లయితే వెంటనే పేమెంట్ రెక్వెస్ట్ సమాచారం వస్తుంది. పేమెంట్ చేయగానే ఆ స్లాట్ మీ పేరున రిజర్వు అయిపోతుంది. ఒకవేళ స్లాట్ ఖాళీగా లేకపోతే మీ అభ్యర్థనను వెయిటింగ్‌లో పెట్టి తర్వాత ఖాళీ అయితే పేమెంట్ రెక్వెస్ట్‌ను రవీంద్రభారతి యాజమాన్యం పంపిస్తుందని చెప్పారు. ఔత్సాహిక ప్రేక్షకుల సౌకర్యార్థం రోజూవారీ కార్యక్రమాల వివరాలను ఈ వెబ్‌సైట్‌లో చూసుకుని సభలకు రావచ్చునని వెల్లడించారు.

# ‘విద్య’తోనే బిసిల శక్తివంతానికి ఉక్కు సంకల్పం

**రాష్ట్ర బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** విద్య ద్వారానే బిసిలను శక్తివంతం చేయాలని ఉక్కు సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలంగాణ బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పథకాలు బిసి వర్గాల పిల్లలకు జీవితంలో ఎవరితోనైనా పోటీపడే అవకాశాలు కల్పిస్తున్నాయని, కులం ఎవరి కలలకు అడ్డు రాకూడదని ఈ ప్రభుత్వ అభిమతం అని అన్నారు. వెయ్యి సంవత్సరాల చీకటిని ఒక దీపం పార దోలి వేయగలదు, అని సత్యాన్ని నమ్మి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ మట్టిలో శతాబ్దాలు అణగారిన వర్గాలు పై మాటనే నమ్మి బతుకుతున్నాయని అన్నారు. ఆ దీపం పేరే ‘విద్య’ అని అన్నారు.ఆ వెలుగును అందుకోవడం ఎంత కఠినమో మన సామాజిక చరిత్ర చెబుతుందని కులం పేరుతో అణచివేత, వివక్ష, పేదరికం, ఇవన్నీ తరతరాలుగా బలహీన వర్గాల జీవితాలలో చెప్పలేనంతగా గాయాలు మిగిల్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నిటికీ విరుగుడు మార్గమే ‘ఎద్యు కేషన్ ఈస్ ది ఓన్లీ లిబరేషన్’ అని ప్రజా పాలన ప్రభుత్వం నమ్మింది అన్నారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాలు బిసి వర్గాల పిల్లలు జీవితంలో ఎవరితోనైనా సమానంగా పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు. కులం ఎవరి కలలకు అడ్డు రాకూడదు అని మా ప్రభుత్వ అభిమతం అని అన్నారు. పిల్లలకు కూడా ప్రతిభను ప్రదర్శించేందుకు సరియైన వేదికలు కల్పించడం కాంగ్రెస్ తన బాధ్యతగా భావిస్తుందని అన్నారు కుటుంబాల పేదరికం సామాజిక వెనక బాటు పిల్లల భవిష్యత్తును నిర్ణయించే పరిస్థితి ఉండకూడదని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బిసిలు శ్రమజీవులు ఉత్పత్తిదారులు సేవలను అలాంటి వర్గాలు అణగారిపోవడం సమాజానికే నష్టం కాబట్టి బిసి వర్గాల గౌరవాన్ని హక్కులను అవకాశాలను కాపాడడం కేవలం పరిపాలనా నిర్ణయం కాదని అది సామాజిక న్యాయం అని అన్నారు. చదువుకోలేని అజ్ఞానం పెద్ద శత్రువు అని ఈ అజ్ఞానాన్ని మట్టు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుందని నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు . తెలంగాణ బిసిల ఆత్మవిశ్వాసం నిండిన రేపటి పునాది విద్య. ఆ పునాదిని బలపరచడం కోసం సమాజంలో కొత్త ఉత్సాహాన్ని నింపడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలంగాణను సమానత్వపు సమాజంగా మార్చే దిశలో ముందడుగు వేస్తున్నామని ఇలాంటి కార్యక్రమాలు మాత్రమే కుల వివక్షను తుడిచిపెట్టి ఒక ఏకీకృత సమాజాన్ని నిర్మిస్తాయని విద్యా విజ్ఞానాన్ని అందిస్తుందని విజ్ఞానం విచక్షణను అందిస్తుందని తద్వారా సామాజిక సమా నత్వం, రాజ్యాధికారం లభిస్తాయని నూతి శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు.



# పంచాయతీరాజ్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి

**నూతన ప్రత్యేక ప్రధానకార్యదర్శితో మంత్రి సీతక్క**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను ఆశాఖ నూతన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలి జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో సంజయ్ కుమార్ గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్కను కలిశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేసి గ్రామీణాభివృద్ధిశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా సంజయ్ కుమార్‌కు మంత్రి సీతక్క సూచించారు. త్వరలోనే శాఖలోని వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సమామేశమవుతానని చెప్పారు. వివిధ విభాగాధిపతులు బడ్జెట్ కసరత్తులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఎక్సైజ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆసరా

**ఒకరోజు పెన్షన్ రూ.2.80 లక్షల చెక్కు అందజేత**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 27:** విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఎక్సైజ్ శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ సభ్యులు తమ ఒక రోజు పెన్షన్ మొత్తాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు రూ.2.80 లక్షల చెక్కును ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సౌమ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న ఒక సహోద్యోగి కుటుంబానికి విశ్రాంత ఉద్యోగులు తమ పెద్ద మనసుతో అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయిన సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటికే రూ. కోటి ఆర్థిక సాయంతో పాటు, ఆమె సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించిందని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఎక్సైజ్ సిబ్బంది కృషిని ప్రభుత్వం గుర్తిస్తుందని, వారికి అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో గంజాయి, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీల ప్రక్రియకు మోక్షం లభించనుందని మంత్రి జూపల్లి వెల్లడించారు. వారం రోజుల్లోగా సుమారు 2,500 మంది కానిస్టేబుళ్ల బదిలీలను పూర్తి చేస్తామని, అనంతరం ఇతర హోదాల్లోని అధికారుల బదిలీలను దశలవారీగా చేపడతామని వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతరలో చిన్నారి మృతి చెందడం పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారని తెలిపారు. తెలంగాణను దేశీ, విదేశీ పర్యాటకులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నూతన పర్యాటక విధానం ద్వారా వాటర్ స్పోర్ట్స్, ఎకో, వెల్నెస్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే రహదారుల వెంట పర్యాటకులకు సమాచారం అందించే సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ముకుంద రెడ్డి, ప్రతినిధులు విష్ణు స్వరూప్ రెడ్డి, నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సౌమ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎప్‌స్టీన్ అత్యాచార ఘటనలపై నేడు మహిళా కాంగ్రెస్ నిరసన

**హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం అనంతరం శనివారం మధ్యాహ్నం.. అమెరికాలో ఎప్‌స్టీన్ సామూహిక అత్యాచార ఘటనలపై నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అధ్యక్షతన గాంధీభవన్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశంతో పాటు దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా సామూహిక అత్యాచార ఘటనలపై నిరసన వ్యక్తం చేస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేయనున్నారు. అందరూ తెలుపురంగు టీషర్టులు ధరించి, నల్లజెండాలతో నిరసన కార్యక్రమంలో పాల్గొంటారు.


డిజిపి శివధర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్.కృష్ణయ్య, జస్టిస్ ఈశ్వరయ్య, కవిత, విశారదన్, బాధిత కుటుంబసభ్యులు

# నాగర్‌కర్నూల్ కుమ్మెర బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలి

**డిజిపి శివధర్‌రెడ్డికి విజ్ఞప్తి చేసిన ఆర్.కృష్ణయ్య**

**హైదరాబాద్ (నాంపల్లి), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ కుమ్మెర గ్రామం బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిజిపి శివధర్‌రెడ్డిని కలిసి ఆర్.కృష్ణయ్య, జస్టిస్ ఈశ్వరయ్య, కవిత, విశారదన్ గంటసేపు చర్చలు జరిపారు. గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా అగ్రకులాల దాడుల్లో రెండు నెలల పసిపాప మృతి ఘ టన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్న నేపథ్యంలో ఈ ఘటనపై తక్షణమే నిష్పా క్షిక, వేగవంత మైన దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిజిపిని ఆయన డిమాండ్ చేశారు.

డిజిపితో జరిపిన చర్చల్లో నింది తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు లోనుకాకుండా ఎస్సీ ఎస్టీ కేసుపెట్టి 8 మంది నిందితులను అరెస్టు చేయా లని, బాధితులకు కోటి ఎక్స్‌గ్రేషియా, ఒక ఉద్యో గం, ఇల్లు మంజూరు చేయాలని, బాధితులకు ప్రభుత్వం పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని కోరారు. ఈ ఘటనపై ఎటువంటి రాజకీయ లేదా స్థానిక ప్రభావాలు లేకుండా పారదర్శక దర్యాప్తు జరపాలని, అవసరమైతే ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ నియమించాలని సూచించారు. 24 నెలలు నిండిన పసిబిడ్డని నిర్దాక్షిణ్యంగా దురహంకారంతో హత్యచేయడం దుర్మార్గపు చర్య అన్నారు. నిందితులని తక్షణమే అరెస్టుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించి నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. బిసిలు దీనిని ఆత్మగౌరవ పోరాటంగా ముందుకు తీసుకువెళ్లాలని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు.


సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 335

**హైదరాబాద్(బేగంపేట), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మహాత్మాజ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 335 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 107 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు 65,ఇందిరమ్మ ఇండ్ల కోసం 114, ప్రవాసీ ప్రజావాణికి 3దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబం ధించి 46 దరఖాస్తులు అందాయి. సిఎం ప్రజావాణీ అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏసీపీ ఉమేందర్, ఎన్ఆర్ఐ సలహా మండలి వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, ప్రవాసీ ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్‌రెడ్డి దరఖాస్తులను స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# హైదరాబాద్ పరిసర ప్రాంతంలో బిందు సేద్యం

**అమెజాన్, నెటాఫిమ్ ఒప్పందం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివారు వ్యవసాయ ప్రాంతాల్లో అత్యాధునిక బిందు సేద్యం ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయి. పర్యావరణ పరిరక్షణతోపాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతంచేసే దిశగా ప్రముఖ ఇ కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా, నీటిపారుదల రంగంలో ప్రపంచ అగ్రగామి నెటాఫిమ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఉమ్మడి భాగస్వామ్యంతో యేటా దాదాపు 325 మిలియన్ లీటర్ల నీటిని ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సంప్రదాయ వరద నీటిపారుదల పద్ధతికి స్వస్తి పలికి, బిందు సేద్యాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా ఈ భారీ మార్పు సాధ్యం కానుంది. ఇది భూగర్భ జలాల సంరక్షణతో పాటు పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న నీటి ఎద్దడిని తగ్గించడానికి దోహదపడుతుంది. మొత్తం 120 హెక్టార్ల సాగు భూమిలో ఈ ప్రాజెక్టు అమలవుతుంది. దాదాపు 110 మంది స్వతంత్ర రైతులకు ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. బెంగళూరులో టమాటా, హైదరాబాద్‌లో మొక్కజొన్న, కూరగాయల సాగు చేసే రైతులకు ఇది ఎంతో మేలు చేస్తుంది. హైదరాబాద్ పరిసరాల్లోని 40 హెక్టార్లలో 40 మంది రైతులకు బిందు సేద్య పరికరాలను అందించనున్నారు. దీంతో ఏటా 150 మిలియన్ లీటర్ల నీరు ఆదా అవుతుంది. ఇక్కడి పొలాలు ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్ నుండి నీటిని పొందుతున్నాయి. రైతులు తమ సాగు పద్ధతులను మెరుగుపరుచుకునేలా ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తున్నామని అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అభినవ్ సింగ్ తెలిపారు.

# ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ.745 కోట్లు విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** తాజాగా ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియర్ కోసం రూ.745 కోట్లును ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఫిబ్రవరి మాసానికి సంబంధించిన బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం ఆదేశించిన దరిమిలా ఆర్థిక శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు ప్రతినెల రూ.700 కోట్లకు తగ్గకుండా పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. అ హామీ మేరకు గత జూన్ నెలాఖరులో రూ.183 కోట్ల రూపాయలు విడుదల చేసింది. గత సంవత్సరం ఆగస్టు నుంచి ప్రతి నెల కనీసంగా రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది. తాజాగా విడుదలైన బిల్లుల్లో గ్రాట్యూటీ, జిపిఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్సులు ఉన్నాయి.

# ఆజాద్ చంద్రశేఖర్ స్ఫూర్తిగా యువత దేశసార్వభౌమాధికార రక్షణకు కట్టుబడాలి

**నివాళులర్పించిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్**

**హైదరాబాద్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ సూర్తిగాతీసుకొని యువత దేశ సార్వభౌమాధికార పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీభవన్‌లో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి స్మరించుకొని మహేష్‌కుమార్ ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల దొరలపై ఎగిసిన విప్లవ కెరటం, చంద్రశేఖర్ ఆజాద్ అని అభివర్ణించారు. చంద్రశేఖర్ ఆజాద్ మార్గదర్శకం తీసుకొని యువతకు సాహసం, త్యాగం, దేశభక్తి అనే విలువలను ఆచరణలో చూపించాలని, యువత చెడు అలవాట్లతో నిర్వీర్యం కావొద్దని ఆయన కోరారు.చంద్రశేఖర్ త్యాగస్ఫూర్తి, దేశసేవా నిబద్ధత తరతరాలకు ప్రేరణ గా ఉంటుందనీ ఆయన అన్నారు. భారత స్వాతంత్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన విప్లవ వీరుల త్యాగాల ఫలితమే మనకు లభించిన స్వేచ్ఛ అని గుర్తుచేసుకొన్నఆరు. దేశ సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలనీ సూచిం చారు. చంద్రశేఖర్ ఆజాద్ జీవితం యువతలో దేశభక్తి జ్వాలను రగిలించేదిగా నిలిచిందని, వారి ఆశయాలను సాకారం చేయడం ద్వారా నిజమైన నివాళి అర్పించిన వారమవుతామనీ అన్నారు.

# బడ్జెట్‌లో బిసిల వాటా వారికే కేటాయించాలి

**ఉద్యమానికి పూర్తి సంఘీభావం: ఎంపి ఈటల రాజేందర్.. ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష**

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** బడ్జెట్‌లో బిసిల వాటా బిసిలకే కేటాయించాలని ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బడ్జెట్‌లో బీసీలకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా మాజీ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఛైర్మన్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్యఅతిథులుగా ఈటల రాజేందర్‌తోపాటు శాసనమండలి సభాపక్షనేత కే.మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్‌భాస్కర్ పాల్గొని మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా మన జీవితాలు మాత్రం మారటం లేదని, మన పోరాటం మన వాటా మనకు కావాలి అని తప్ప, మీది మాకు కావాలని అడగటం లేదని స్పష్టం చేశారు. ఎల్లమ్మ బండలో 300 ఎకరాల్లో 150 ఎకరాలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదలకు పంచితే, అదే సర్వే నెంబర్‌లో ఉన్న 150 ఎకరాల ప్రభుత్వ భూమి ఎలా ప్రైవేట్ భూ మి అవుతుందని సూటిగా ప్రశ్నించారు. 7వేల కోట్ల రూపాయల భూమి పరాధీనం అయ్యింది, అదే ఉంటే మన పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకా యి లు తీరి, వారి ఆత్మహత్యలు ఆగేవి కదా అన్నారు. మేము చేస్తున్న పోరాటం ఎవరికీ వ్యతి రేకం కాదని స్పష్టం చేశారు. కేంద్రంలో కూడా ఒక బీసీ మంత్రిత్వ శాఖ రావాలని, చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు కావాలని అన్నారు. మధుసూదనాచారి మాటాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. బీసీలు చేస్తున్న న్యాయపోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నేటి కాంగ్రెస్ పాలనలో శాంతియుతంగా ధర్నా చేసే హక్కు కూడా లేకుండా పోయిందని ఆరోపించారు. దీక్షా కార్యక్రమంలో మాజీ డిజీపీ పూర్ణచందర్‌రావు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ నేతలు దుర్గయ్య, అయిలి వెంకన్న గౌడ్, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం నేతలు బైరి శేఖర్, విజయ్‌కుమార్, నారాయణగౌడ్, రమణ, అబ్బాస్, శ్రీకాంత్, లలిత, కీర్తి లాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో అభివాదం చేస్తున్న ఎంపి ఈటల రాజేందర్, శాసనమండలి సభాపక్ష నేత మధుసూదనాచారి తదితరులు

# ప్రతిపక్ష నేతగా రాహుల్ సలహా ఇచ్చినా అమలులో విఫలమైన ప్రధాని మోడీ

**ఢిల్లీలో మీడియా సమావేశంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ బాధ్యత గల ప్రతిపక్ష నేతగా దేశ ప్రజల సంక్షేమం కోసం పార్లమెంట్ సాక్షి గా విలువైన సలహాలు ఇస్తున్నారురాహుల్ గాంధీ సలహాలు ప్రధాని మోడీ వింటున్నారు కానీ అమలులో విఫలమౌతున్నారని టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కరోనా, డిల్లీ పొల్యూషన్ విషయంలో రాహుల్ గాంధీ సూచనలను ప్రధాని మోడీ లెక్కచేయలేదనీ ఆవేదన చెందారు. దేశం లో కరోనా రావడానికి ముందే రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని అలెర్ట్ చేశాడనీ గుర్తుచేశారు. విదేశాల నుండి ఇండియా వచ్చే వారి పై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారుని జగ్గారెడ్డి గతంను గుర్తుచేసుకొన్నారు. ప్రధాన మంత్రి మోడీ రాహుల్ గాంధీ గారి సూచనలు విన్నాడు, కానీ అమలు చేయలేదు,తర్వాత ఏమైందో మనం అంతా చూశాం అని ఆయన వివరించారు. రెండేళ్ల పాటు దేశం మొత్తం కరోనా కారణంగా ఇబ్బంది పడ్డాం జగ్గారెడ్డి ఆవేదన చెందారు. డిల్లీ లో పెరుగుతున్న కాలుష్యం పై సైతం ఒక బాధ్యత గల ప్రతిపక్ష నాయకుడు గా పార్లమెంట్ లో మాట్లాడుతున్నాడు, అవసరమైన సూచనలు చేస్తున్నాడని అన్నారు.. డిల్లీ లో పెరుగుతున్న కాలుష్య నివారణకు రాహుల్ గాంధీ ఇస్తున్న సూచనలను ప్రధానమంత్రి వింటున్నాడు. కానీ అమలు చేయడం లేదనీ ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడిగా దేశ ప్రజల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ ఎప్పటికప్పుడు తన సలాహాలు, సూచనలు ఇస్తున్నారు. కానీ వాటిని అమలు చేయడంలో ప్రధానమంత్రి మోడీ ఫెయిల్ అవుతున్నారనీ అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉంటే జగ్గారెడ్డి శుక్రవారం రైలులో తెలంగాణకు తిరుగు ప్రయాణమయ్యారు.

## ఇంటర్, 10వ తరగతి విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి27:** ఇంటర్మీడియట్. పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.పరీక్షలను ఒత్తిడిగా భావించకుండా, తమ జ్ఞానం, ప్రతిభను చూపించే మంచి అవకాశంగా భావించాలని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండి, సమయాన్ని సక్రమంగా వినియోగించుకొని తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని, ఆత్మ విశ్వాసం విజయానికి ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆయన ప్రశంసించారు. పరీక్షలకు హాజరవుతున్న ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.

## సమగ్ర నివేదిక రూపొందించండి

### 99 రోజుల యాక్షన్‌ప్లాన్ సబ్‌కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 27:** రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం ఏం చేసింది, రాబోయే రోజుల్లో ఏం చేయాలనుకుంటుంది ప్రజలకు స్పష్టంగా అర్థం అయ్యేలా వివరించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రజాభవన్ లో 99 డేస్ యాక్షన్ ప్లాన్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ స్థాయిల్లో ఏ తరహా కార్యక్రమాలు చేపట్టాలి, వివిధ శాఖలను ఏ విధంగా సమన్వయం చేసుకోవాలి, పూర్తి సమాచారంతో కూడిన నివేదికల రూపొందించడం అనే అంశాలను నివేదికలో జోడించాలని మంత్రులు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, యోగితా రానా, క్రిస్టిన, అనిత రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## 'మీ టికెట్' యాప్ ద్వారానే బస్‌పాస్‌లు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 27:** మీసేవ ఆధ్వర్యంలోని 'మీ టికెట్' యాప్‌లో టిజిఎస్ఆర్‌టిసి సేవలను సమగ్రంగా అనుసంధానించడంతో, బస్‌పాస్‌ల కోసం డిపోలు, కౌంటర్ల వద్ద క్యూలు నిలబడే రోజులకు ముగింపు పడనుంది. ప్రభుత్వ మొబైల్ యాప్ ద్వారానే బస్‌పాస్‌లు జారీ చేసే రాష్ట్రంగా తెలంగాణ దేశంలో తొలి రాష్ట్రంగా నిలుస్తోంది. ఆ దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోంది. ఐటీ మంత్రి డి. శ్రీధర్‌బాబు నేతృత్వంలో పౌర సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మీటికెట్ యాప్ ఇప్పటికే రెండు లక్షలకు పైగా డౌన్‌లోడ్‌లు సాధించగా, రూ.2.9 కోట్లకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 221 ప్రాంతాలు, 190 సేవా కేంద్రాల ద్వారా ఈ వ్యవస్థ విస్తరించినట్లు అధికారులు తెలిపారు. మీసేవ ఈ గవర్నెన్స్ వ్యవస్థలో భాగంగా రూపొందిన ఈ యాప్ ద్వారా ప్రయాణికులు నగర బస్‌పాస్‌లు, అంతర్రాష్ట్ర టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే పొందగలుగుతున్నారు. డిపోలకు వెళ్లడం, ఫారమ్‌లు నింపడం, క్యూలో నిలబడడం వంటి ప్రక్రియలు అవసరం లేకుండానే బస్‌పాస్‌లు జారీ కానున్నాయి. దరఖాస్తు, చెల్లింపు, పాస్ జారీ అన్నీ మొబైల్ ఫోన్ ద్వారానే పూర్తవుతున్నాయి.



మోడీ మిషన్-విజన్ పత్రం లోగోను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

## మోడీ మిషన్-విజన్ పత్రం లోగో..

### ఆవిష్కరించిన ఎంపి డా. కె. లక్ష్మణ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్ర మోదీ జీవన ప్రయాణం, ఆయన నాయకత్వంలోని పరిపాలనా మైలురాళ్లను వివరిస్తూ రూపొందించిన "నరేంద్ర మోదీ మిషన్-విజన్" పత్రం లోగో, కవర్ పేజీలను శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు ఈ త్రిభాషా మూడు సంపుటాల ప్రాజెక్టును రూపొందించారు. అశోక్‌నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.లక్ష్మణ్ ఆవిష్కరించి మాట్లాడుతూ.. సమకాలీన నాయకత్వం, దేశాభివృద్ధిలో మోదీ సాధించిన విజయాలను భావి తరాలకు అందించేలా ఈ గ్రంథాలు ఉండటం అభినందనీయమన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడానికి, విద్యార్థుల అధ్యయనానికి ఇవి ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ గ్రంథాలు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో మూడు సంపుటాలుగా వెలువడనున్నాయి. ప్రధాని మోదీ నాయకత్వ మైలురాళ్లు, జాతీయ స్థాయి విధానాలు, సంక్షేమ కార్యక్రమాల సమాహారంగా ఇది రూపొందుతోంది. కాగా గత ఐదు నెలలుగా సాగుతున్న ఈ గ్రంథ రచన తుది దశకు చేరుకుంది. మార్చి చివరి వారంలో న్యూఢిల్లీ వేదికగా ఈ పుస్తకాలను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ నిర్వాహకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. నేటి నుంచి ఈ లోగో, కవర్ పేజీలను అధికారిక కార్యకలాపాలు, సామాజిక మాధ్యమాలలో ప్రచారానికి వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## వైద్యవిద్య అడ్మిషన్ల పేరుతో భారీ మోసం

### రూ.2.35 కోట్లకు పైగా మోసం.. ఇద్దరు నిందితుల అరెస్టు

**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** వైద్య విద్యలో ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తామని చెప్పి తల్లిదండ్రులను మోసం చేసిన ఇద్దరు నిందితులను పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. జీడిమెట్లకు చెందిన ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితుడి కుమార్తెకు మేనేజ్‌మెంట్ కోటాలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని నమ్మబలికి రూ.39,54,500 వసూలు చేసి, నకిలీ అలాట్‌మెంట్ లెటర్లు చూపించి మోసం చేసినట్లు విచారణలో తేలింది. ప్రధాన నిందితుడు అర్గడప అర్విండ్ రావు అలియాస్ ఆదిత్య కుమార్ అలియాస్ ఆదిత్య దేశ్‌ముఖ్ (40) తాను ఎదువి లెర్నింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పరిచయం చేసుకుని మోసానికి పాల్పడ్డాడు. అమీర్‌పేట్‌లో కార్యాలయం ఏర్పాటు చేసి టెలికాలర్ల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించినట్లు పోలీసులు తెలిపారు. ఇతనిపై దేశవ్యాప్తంగా 23 కేసులు నమోదైనట్లు సమాచారం. సహనిందితుడు కుసుమే వెంకటరావు (58), అదే సంస్థలో హెచ్ఆర్ మేనేజర్‌గా పనిచేస్తూ, వసూలైన డబ్బును తన బ్యాంక్ ఖాతా ద్వారా స్వీకరించి ప్రధాన నిందితుడికి అందించినట్లు వెల్లడైంది. ఫిబ్రవరి 27న అమీర్‌పేట్‌లో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, నకిలీ సీట్ అలాట్‌మెంట్ లెటర్లు, ఒప్పంద పత్రాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ఇప్పటివరకు 100 మందికి పైగా బాధితులు వివిధ రాష్ట్రాల నుండి గుర్తించబడ్డారు. మొత్తం మోసం సుమారు రూ.2.35 కోట్లకు పైగా ఉన్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తామని చెప్పే ఏజెంట్లను నమ్మవద్దని పోలీసులు సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు.

# పోలీసు శాఖలో మహిళల ప్రాధాన్యత పెంచే సిఫార్సుల పరిశీలన

### పోలీసు శాఖ పబ్లికేషన్ల ఆవిష్కరణలో సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో మహిళల ప్రాధాన్యతను మరింత పెంచేందుకు ఉద్దేశించి పోలీసు శాఖలో మహిళా అధికా రుల సదస్సు చేసిన తీర్మానాలను అమలు చేసేందుకు సిఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. దీని అమలుకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏ ర్పాటు చేయాలని ఆయన సూచించారు. సచివాలయంలో శుక్రవారం నాడు పోలీసు శాఖకు సంబంధించి పోలీసు అకాడమి ముద్రించిన రెండు ప బ్లికేషన్లను సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఇందులో ఒకటి పోలీసు అకాడమి పబ్లికేషన్ కాగా రెండవది గత ఏడాది ఆగస్టులో అకాడమిలోనే జరిగిన మహిళా పోలీసు అధికారుల సదస్సులో చేసిన తీర్మానాలకు సంబంధించి రూపొందించినది. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడు తూ రాష్ట్ర పోలీసు శాఖలో మహిళా అధికారుల పనితీరు దివ్యంగా వుందని కొనియాడారు. గత ఏడాది ఆగస్టులో పోలీసు అకాడమిలో జరిగిన మ హిళా ధికారుల సమావేశంలో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ తీర్మానాల గురించి డిజిపి శివధర్ రెడ్డితో పాటు అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్, ఎస్‌పిఎఫ్ అదనపు డిజి స్వాతి లక్రా, సిఐడి చీఫ్ చారు సిన్హా తదితరులు సిఎంకు వివరించారు. పోలీసు శాఖలో ఎస్‌హెచ్‌ఓలుగా మహిళలను నియమించాలని, సాయుధ బలగం, బెటాలియన్లలో మహిళలకు మరింత ప్రాముఖ్యతను ఇవ్వాలని తీర్మానించామని వారు వివరించారు. దీనిపై సిఎం స్పందిస్తూ ఇందులో సాధాసాధ్యాలను పరిశీలించే ందుకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని, దీంతో పాటు ఇతర రాష్ట్రాలలో వున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. పోలీసు శాఖ లో ఇతర రాష్ట్రాలలో వున్న విధి, విధానాలలో ఉన్నతమైనవి ఏమిటనే దానిపైనా పరిశీలన చేయాలని సిఎం సూచించారు. ఈ సమావేశంలో సీని యర్ పోలీసు అధికారులు పలువురు పాల్గొన్నారు.



పోలీసు శాఖ పబ్లికేషన్లను ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో డిజిపి శివధర్‌రెడ్డి సహా సీనియర్ మహిళా ఐపిఎస్ అధికారులు

## తెలంగాణలో పిడిఎస్ బియ్యం నాణ్యతపై కొత్త నిబంధనలు

### రైస్ మిల్లర్లతో జరిపిన సమావేశంలో పౌర సరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్‌రవీంద్ర

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా ప్రజలకు అందించే ఆహార ధాన్యాల నాణ్యతను మెరుగుపరిచే దిశగా తెలంగాణ పౌరసరఫరాలశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ కింద సరఫరా చేసే బియ్యానికి కొత్త కఠిన నాణ్యత ప్రమాణాలను అమలు చేయనున్నట్లు పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రాష్ట్రంలోని రైస్‌మిల్లర్లతో కీలక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ తాజా మార్గదర్శకాలను వివరించారు. వచ్చే ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2026-27 నుంచి దేశవ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) సరఫరాలో కొత్త నాణ్యత ప్రమాణాలు అమల్లోకి రానున్నాయని మిల్లర్లకు సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం... ఇకపై రా రైస్(ముడి బియ్యం)లో గరిష్టంగా 10శాతం బ్రోకెన్ గ్రైన్స్‌కు మాత్రమే అనుమతి ఉందని, ఉడకబెట్టిన బియ్యంలో (బాయిల్డ్ రైస్) 5శాతం బ్రోకెన్ గ్రైన్స్ మాత్రమే ఉండాలని , ఈ ప్రమాణాలకు అనుగుణంగా మిల్లింగ్ యంత్రాలను ఆధునీకరించుకోవాలని మిల్లర్లను ఆదేశించారు. కాగా.. తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ కొత్త నాణ్యత ప్రమాణాలను పూర్తిగా అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అదే సమయంలో మధ్యాహ్న భోజన పథకం, ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం దృష్ట్యా ఇతర సంక్షేమ పథకాల కోసం ప్రత్యేకంగా స్టీమ్డ్ రైస్ సరఫరా చేయనున్నట్లు కమిషనర్ స్టీఫెన్ ప్రకటించారు. ఈ కార్యక్రమాల కోసం రైస్ మిల్లర్లు ప్రత్యేకంగా 20,000 మెట్రిక్ టన్నుల స్టీమ్డ్ రైస్ సరఫరా చేయడానికి అంగీకరించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడం లక్ష్యంగా సివిల్ సప్లైస్ శాఖ పంపిణీ వ్యవస్థపై కఠిన పర్యవేక్షణ కొనసాగిస్తుందని కమిషనర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. నాగేందర్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విజయవంతంగా ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం పూర్తి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** తెలంగాణలో ఫార్మర్ రిజిస్ట్రీ విజయవంతంగా పూర్తయిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రోత్సాహకంగా రూ. 424 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. ఈ ఘనతను దేశంలో 3 రాష్ట్రాసాధించగా అందులో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ లక్ష్యాన్ని పూర్తి చేసినందుకు అధికారులను అభినందించారు. కాగా..వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్రం 'ఫార్మర్ రిజిస్ట్రీ' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఫార్మర్ రిజిస్ట్రీ అనేది భారతదేశంలోని రైతుల సమాచారాన్ని సేకరించే ఒక సమాఖ్య డిజిటల్ డేటాబేస్. ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా రైతుల ఆధార్ నంబరు, భూమి, ఇతర వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి. రిజిస్ట్రేషన్ అయిన అన్నదాతలకు మాత్రమే కేంద్ర పథకాలైన పీఎం కిసాన్, పంటల బీమా తదితర పథకాలు వర్తించే అవకాశం ఉంటుందని, నమోదు కాని వారికి వర్తించవని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా అసైన్‌మెంట్ పొలాలు మినహా సాగుభూమి ఉన్న ప్రతి రైతుకు 11 అంకెల యూనిక్ ఐడీ జారీ చేస్తారు.2026-27 సంవత్సరం నుంచి యూనిక్ ఐడీ ఉంటేనే వ్యవసాయానికి సంబంధించిన పథకాలు అందుతాయని అధికారులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధులు పొందాలంటే కచ్చితంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. అదే విధంగా సాయిల్ హెల్త్ కార్డు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, యాంత్రిక పరికరాల సబ్సిడీ, కిసాన్ క్రెడిట్ కార్డు, విత్తన సబ్సిడీ, పంట నష్ట పరిహారం, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రామాణికం అని స్పష్టం చేస్తున్నారు.

**బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ విత్తన చట్టం ముసాయిదా**

రైతులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తెలంగాణ విత్తనచట్టం ముసాయి రూపకల్పన పూర్తయింది. సామాన్య రైతులతోపాటు విత్తనోత్పత్తి రైతులకు రక్షణ కల్పించేలా తెలంగాణ నూతన విత్తన చట్టం ముసాయిదాలో కఠిన నిబంధనలను చేర్చారు. రాబోయే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు. నకిలీ విత్తనాలతో రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన విత్తన చట్టం ముసాయిదాను సీడ్ కార్పోరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ రూపొందించింది. రెండు, మూడు రోజుల్లో నూతన చట్టం ముసాయిదాపై సీఎం రేవంత్‌రెడ్డితో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా భేటీ కానున్నట్లు సమాచారం.

## పోషకాహార లోపరహిత రాష్ట్రంగా తెలంగాణ

### త్వరలో అంగన్‌వాడీ చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం: మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రాన్ని పోషకలోపరహిత రాష్ట్రంగా తీర్చి దిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న చర్యలతో అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారుల హాజరుశాతం గణనీయంగా పెరుగుతోందని స్పష్టం చేశారు. ప్రభుత్వం 2199 అంగన్వాడి భవనాలు మంజూరు చేస్తే ఇప్పటివరకు కేవలం 500 భవనాలే పూర్తయ్యాయని, మిగిలిన భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా లోపం లేదా నిర్లక్ష్యం జరిగితే ఉపేక్షించబోమని ఉన్నతాధికారుల ను హెచ్చరించారు. ఈ మేరకు హైదరాబాద్ మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమశాఖపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీజీ ఫుడ్స్ చైర్మన్ ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, టిజి ఫుడ్స్ ఎండి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ చిన్నారులకు అందించే అల్పాహారాన్ని మంత్రి సీతక్క స్వయంగా రుచిచూశారు.బ్రేక్‌ఫాస్ట్ మిక్స్ మరింత మృదువుగా ఉండేలా చూడాలన్నారు.

## ఆధునిక పరిజ్ఞానంతో ప్రాజెక్టుల్లో పూడికతీత పనులు

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** సాగునీటి ప్రాజెక్టుల్లో పూడికతీత రెండోదశ పనులకు సత్వరమే శ్రీకారం చుట్టాలని ఉన్నతాధికారులను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. వర్షాకాలానికి ముందే పనులకు పూర్తిచేయాలని నిర్దేశించారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మట్టితో పూడిపోయిన ప్రాజెక్టుల్లో నీటి సామర్థం పూర్తిగా పడిపోవడం ప్రధాన సమస్యగా పరిణమించిందని చెప్పారు. నీటి భద్రత కల్పించేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో తీసుకొచ్చిన పూడికతీత విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అంకురార్పణ చేసిందని పేర్కొన్నారు. చారిత్రాత్మక బాక్రానంగల్ నుండి రాష్ట్రంలో సుప్రసిద్ధ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరకు మట్టితో పూడి పోయి ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థం పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 120 టీఎంసీల సామర్థం ఏకంగా 80 టీఎంసీలకు పడిపోయిందని మంత్రి ఉత్తమ్ గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే మొదటిదశలో చేపట్టిన పూడికతీత పనులు దిగ్విజయంగా పూర్తయ్యాయని చెప్పారు.

**తెలంగాణ అభివృద్ధి కోసం కలసి నడుద్దాం**

మారుమూల గ్రామాల్లో రోడ్ల నుంచి భారీ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం వరకూ బిల్డర్లు కాంట్రాక్టర్లు ఎదుర్కొనే సవాళ్లు, సమస్యలకు తాను ప్రత్యక్ష సాక్షి నని, బిల్డర్ల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఉన్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా దేశంలోనే అత్యంత పురాతన సంస్థ అని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంస్థ కాంటాక్టర్స్‌కు ప్రభుత్వానికి మధ్య గొప్ప వారధిగా పనిచేస్తోందని కొనియాడారు.

## రైల్వేల్లో వివాద పరిష్కారానికి ఆర్బిట్రేషన్ కీలకం

### జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో "ఫోర్టీపై లెక్చర్ సిరీస్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం సమన్వయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్బిట్రేషన్‌పై దృష్టి సారించి రైల్వేలలో వివాద పరిష్కారం" అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఇది విజిలెన్స్ బ్రాంచ్ నిర్వహించిన ఆరవ ఉపన్యాసం. సంస్థాగత జ్ఞానాన్ని బలోపేతం చేయడం, ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడం మరియు రైల్వే అధికారుల వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గుంటూరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్ణ సేన్, ఐఆర్ఏఎస్ ప్రధాన వక్తగా పాల్గొని ఉపన్యాసం ఇచ్చారు. రైల్వేలలో వివాద పరిష్కార విధానాలపై, ముఖ్యంగా ఆర్బిట్రేషన్, మధ్యవర్తిత్వ విధానాల ఆచరణాత్మక అమలుపై ఆమె సమగ్రంగా వివరించారు. పరిపాలనా అనుభవం, ఆర్థిక నైపుణ్యంతో కూడిన తన ప్రసంగంలో కాంట్రాక్టు వివాదాల పరిష్కారంలో ఆర్బిట్రేషన్ ప్రాముఖ్యతను విశదీకరించారు. కార్యక్రమానికి జనరల్ మేనేజర్ దక్షిణ మధ్య రైల్వే సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మరియు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఆశిష్ మెహ్రోత్రా సహా ప్రధాన కార్యాలయానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. విజయవాడ, గుంతకల్, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు, అలాగే ఆరు డివిజన్లు, మూడు వర్క్‌షాప్‌ల అధికారులు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా పాల్గొనడంతో జోన్ వ్యాప్తంగా విస్తృత భాగస్వామ్యం నమోదైంది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ రైల్వే పరిపాలనలో ఆర్బిట్రేషన్ అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. రైల్వేలలో గణనీయమైన కాంట్రాక్టు వివాదాలు ఆర్బిట్రేషన్ ద్వారా పరిష్కారమవు తున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెరుగుతున్న సంక్లిష్టతల దృష్ట్యా అధికారులు తాజా చట్టపరమైన నిబంధనలను అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్బిట్రేషన్, సయోధ్య చట్టం, 1996కు 2015, 2019, 2021లో చేసిన సవరణల ప్రాముఖ్యతను సుదేష్ణ సేన్ వివరించారు. మధ్యవర్తుల నియామక విధానం, ప్రక్రియ నిర్వహణ, చట్టబద్ధ సమయపాలన, విధానపరమైన క్రమశిక్షణ వంటి అంశాలను సమగ్రంగా చర్చించారు.



మాట్లాడుతున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

## సర్వైకల్ కేన్సర్ నివారణే లక్ష్యంగా నేటి నుంచి హెచ్‌పివి వ్యాక్సినేషన్

### 4 లక్షల మంది బాలికలకు టీకాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సర్వైకల్ కేన్సర్ లేకుండా చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. అందులో భాగంగా నేడు(శనివారం) రాష్ట్ర వ్యాప్తంగా సర్వైకల్ కేన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను చేపట్టనున్నారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కిగ్‌కోఠిలోని జిల్లా ఆసుపత్రిలో వ్యాక్సినేషన్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో కేన్సర్ నివారణ దిశగా అడుగులు వేస్తూ.. సర్వైకల్ కేన్సర్ నివారణే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు ఆరోగ్యశాఖ ప్రకటించింది.

## గ్రామపంచాయతీలకు శుభవార్త

### రూ. 389 కోట్లు విడుదల

### తెలంగాణ ఆర్థిక శాఖ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఆర్థిక ఊరట కల్పించేలా కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల కోసం రాష్ట్ర ఆర్థికశాఖ తాజాగా రూ.389 కోట్ల నిధులను విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు శుక్రవారం నిధులు విడుదలైనట్లు అధికారులు తెలిపారు. గ్రామస్థాయి పరిపాలన బలోపేతం చేయడం, స్థానిక సంస్థల నిర్వహణ సజావుగా కొనసాగించడం లక్ష్యంగా ఈ నిధులను విడుదల చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. గ్రామ పంచాయతీల రోజువారీ నిర్వహణ ఖర్చులు, పారిశుధ్య కార్యక్రమాలు, మౌళిక వసతుల అభివృద్ధి పనులకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. గ్రీన్ ఛానల్ విధానం ద్వారా బిల్లుల చెల్లింపులు వేగవంతం చేస్తూ, స్థానిక సంస్థలకు ఆర్థిక స్థిరత్వం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎసిఇ కొత్త గ్రూపు

### అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులు

### 2026-27 నుంచి మొదటి సంవత్సరం ప్రారంభం

### సర్క్యులర్ జారీ చేసిన ఇంటర్ బోర్డు కార్యదర్శి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్‌లో కొత్త గ్రూప్‌ను ప్రారంభించనున్నారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్(ఏసీఈ) గ్రూప్‌ను మొగటి సంవత్సరంలో ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల కాలేజీల్లోనూ ఈ గ్రూప్‌ను ప్రారంభించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి సర్క్యులర్ జారీ చేశారు. రానున్న విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరంలో ప్రారంభించనున్నట్టు సర్క్యులర్‌లో పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ (ఏసీఈ) సబ్జెక్టులతో కొత్త ఎలక్టివ్ గ్రూపును ఇంటర్ బోర్డు ప్రవేశ పెట్టనుంది. వ్యాపారం, వాణిజ్యం, ఆర్థిక రంగాలలో రాణించాలనే లక్ష్యంతో విద్యార్థులకు క్రమబద్ధమైన విద్యా మార్గాన్ని అందించడానికి ఈ గ్రూప్ రూపొందించబడిందని బోర్డు సెక్రటరీ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఇంటర్ బోర్డుతో అనుబంధం గుర్తింపు ఉన్న జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ అందరూ ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని విద్యార్థులందరికీ తెలియజేయాలని సర్క్యులర్‌లో ఆదేశించారు. రాబోయే అడ్మిషన్స్ సమయంలో విద్యార్థులకు ఈ కొత్త గ్రూప్ గురించి తెలుసుకునేలా చూసుకోవడానికి, కళాశాలలు ఈ కొత్త గ్రూప్ కోసం విస్తృత ప్రచారం అందించాలని సూచించారు.

## లిక్కర్ స్కాం పేరుతో బిఆర్‌ఎస్‌ను రాజకీయంగా దెబ్బతీశారు: కెటిఆర్ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 27:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవితకు కోర్టులో న్యాయం జరిగిందని, ఇదే విధంగా తమ పార్టీ నేతలపై పెట్టిన ప్రతి ఒక్క అక్రమ కేసు వీగిపోతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కల్పిత ఆరోపణలతో సృష్టించిన ఈ కేసు ద్వారా బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీశారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో స్పందించారు.కెటీఆర్ తన ప్రకటనలో, "లిక్కర్ స్కాం అనే కట్టుకథతో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కూల్చేశారు. అదే కథనాన్ని అడ్డం పెట్టుకుని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను రాజకీయంగా నష్టపరిచారు. ఈరోజు కోర్టులో కవితకు న్యాయం జరిగింది. ఇదే స్ఫూర్తితో మా నేతలపై బనాయించిన ప్రతి కేసు అబద్ధమని, రాజకీయ ప్రేరేపితమని, కల్పితమని త్వరలోనే రుజువవుతుంది" అని పేర్కొన్నారు. ఆ నిజం నిలదొక్కుకునే వరకు కాంగ్రెస్, బీజేపీల నుంచి నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం కొనసాగుతూనే ఉంటాయని అన్నారు.ప్రధాన పార్టీలు చేసే ఆరోపణలకు మీడియా ట్రయల్స్ తోడై తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు.'దురదృష్టవశాత్తు ఇదే న్యూ ఇండియాలో కొత్త ధోరణిగా మారింది. ఇక్కడ ఆధారాలతో పనిలేదు, ఆరోపణలు చేస్తే చాలు. న్యాయ ప్రక్రియ స్థానంలో మీడియా కథనాలు ప్రచారం పొందుతున్నాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ, ఎన్ని కుట్రలు చేసినా, ఎంత దుష్ప్రచారం చేసినా చివరికి న్యాయమే గెలుస్తుందని, తమపై మోపిన కేసులన్నీ అవాస్తవాలని తేలిపోవడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుల వేతనాలపై విద్యాకమిషన్ సిఫారసులకు ఉపాధ్యాయ సంఘాల మండిపాటు

**హైదరాబాద్,ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల వేతనాలు ఎక్కువగా ఉన్నాయని విద్యా కమిషన్ ఛైర్మన్ చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. తెలంగాణ విద్యా విధానంపై సిఫారసులు చేయాలని కమిషన్‌కి సూచిస్తే.. ఇటువంటి వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని సంఘాలు మండిపడ్డాయి. ఉపాధ్యాయుల వేతనాలపై విద్యా కమిషన్ ఛైర్మన్ వ్యాఖ్యలు విచారకరమని టిఎస్ యుటిఎఫ్ మండిపడింది. తెలంగాణ విద్యాకమీషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సమర్పించిన విద్యావిధాన పత్రం 2026ను అమలు చేసేముందు ఉపాధ్యాయ సంఘాలతో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని టిఎస్‌యుటిఎఫ్ డిమాండ్ చేసింది. కమీషన్ సిఫారసులో కొన్ని ప్రభుత్వ విద్యారంగానికి మేలు చేసేవిగా ఉన్నప్పటికి ఉపాధ్యాయులకు సంబంధించి వారు చేసిన సిఫారసులు చాలా వరకు అభ్యంతరకరంగా ఉన్నాయని చావ రవి, వెంకట్ అన్నారు.

## మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్.. వైజాగ్ నేరగాడి అరెస్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** అవివాహితులైన వారిని లక్ష్యం చేసుకుని మ్యాట్రిమోనియల్ మోసాలకు పాల్పడుతున్న వైజాగ్‌కు చెందిన ఓ ఘరానా సైబర్ నేరగాడిని సిటీ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఇతను కాంబోడియాకు వెళ్లి సైబర్ నేరాలపై తర్ఫీదు పొందాడు. దీనికి సంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. గత ఏడాది అక్టోబర్ నెలలో హైదరాబాద్‌కు చెందిన 28 ఏళ్ల వ్యక్తి మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్‌లో 11 లక్షల 17 వేల 834 రూపాయలు పోగొట్టుకుని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేబట్టిన సైబర్ క్రైం పోలీసులకు ఈ గోల్‌మాల్‌కు పాల్పడింది వైజాగ్‌కు చెందిన పెదపూడి ప్రసన్న కుమార్‌గా తేలింది. ఇతను వైజాగ్ కేంద్రంగా ఈ గోల్‌మాల్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలింది. 2024లో ఇతను కాంబోడియాలో ఉద్యోగం కోసం వెళ్లగా అక్కడి సైబర్ నేరగాళ్లతో పరిచయం ఏర్పడింది. అమాయకులను ఎలా మోసం చేయాలనే దానిపై శిక్షణ పొందాడు. వైజాగ్ తిరిగివచ్చి సైబర్ నేరాలలో అరెస్టైన రవికిరణ్, గంగరాజు అనే వ్యక్తుల నుంచి 500 సిమ్ కార్డులను పొందాడు. ఈ సిమ్‌కార్డులను వాడి ప్రసన్న కుమార్ మ్యాట్రిమోనియల్‌తో పాటు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ నేరాలకు పాల్పడసాగాడు. గురువారం చెన్నై విమానాశ్రయానికి వస్తున్నట్లు సమాచారం అందగా సైబర్ క్రైం పోలీసులు నిఘా వుంచి అరెస్టు చేశారు. శుక్రవారం ఇక్కడి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

# నేడు నింగిలోకి రుద్రమ రాకెట్

## భద్రకాళి సాక్షిగా వరంగల్‌లో ప్రయోగం



నింగిలోకి దూసుకెళ్లడానికి సిద్ధం చేసిన రుద్రమ వి.0.1

**వరంగల్ సిటీ ఫిబ్రవరి27 ప్రభాతవార్త:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఎడ్యుకేషనల్ మోడల్ రాకెట్ ప్రయోగానికి ఓరుగల్లు వేదిక అయ్యింది. వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువులో రుద్రమ వి.0.1 అనే మోడల్ రాకెట్ ప్రయోగం జరుగబోతోంది. ఈ తరహా ప్రయోగం రాష్ట్రంలో ఇదే మొదటి సారి కావడం గమనార్హం. వరంగల్‌కు చెందిన యువ శాస్త్రవేత్త ఏటిడిఆర్ ఎల్ వ్యవస్థాపకుడు, ఇస్రో రిజిస్టర్డ్ స్పేస్ ట్యూటర్ శశాంక్ భూపతి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5గంటలకు ఈ మోడల్ రాకెట్ ప్రయోగం జరుగబోతోంది. కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) సహకారంతో ఏటిడిఆర్‌ఎల్, ఎన్‌ఐటి వరంగల్ ఆధ్వర్యంలో ఎక్స్ ప్లోరా 2026 పేరిట ఈ మోడల్ రాకెట్ లాంచ్ చేయబోతున్నారు. భద్రకాళి బండ్ వద్ద రాకెట్‌కు కావాల్సిన పూర్తి ఏర్పాట్లు చేశారు. కాగా ఎక్స్ ప్లోరా 2026 పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఈ నెల 18 నుంచి 27 వరకు ఔత్సాహికులకు టెలిస్కోప్ ద్వారా గ్రహాలను వీక్షించే అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. రాణి రుద్రమదేవి వీరత్వానికి ప్రతీకగా నేడు ఆమె పేరుతో రుద్రమ వి.01 రాకెట్‌గా నిర్వాహకులు నామకరణం చేశారు. ఇస్రో రిజిస్టర్డ్ స్పేస్ ట్యూటర్ శశాంక్ భూపతి ఆలోచనలను కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, వైస్ చైర్పర్సన్ చాహత్ బాజ్ పాయ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ ప్రయోగాం అంకురార్పణ జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రయోగానికి అవసరమైన నిధులను కుడా వెచ్చిస్తుండటం గమనార్హం. కాళోజీ కళా క్షేత్రంలో నేడు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4:30 గంటల వరకు సమావేశం నిర్వహించనున్నారు. దీనిపై పలువురు శాస్త్రవేత్తలు ప్రసంగించనున్నారు. అనంతరం సాయంత్రం 5:30 గంటలకు భద్రకాళి బండ్ నుంచి రాకెట్ లాంచ్ చేయనున్నారు. 4అడుగుల పొడవు, తేలికపాటి (దాదాపు 500 గ్రాములు) బరువు ఉంటుందని తెలుస్తోంది. భూమి నుంచి సుమారు 3వేల అడుగుల వరకు నింగిలోకి దూసుకెళ్లి, ప్యారాచూ ట్ సహాయంతో సురక్షితంగా తిరిగి దిగుతుంది. స్పేస్ ఎడ్యుకేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడం, భవిష్యత్‌లో ఆసక్తి పెరిగేలా చేయడమే రుద్రమ వీ. 01 రాకెట్ ప్రయోగం ముఖ్యఉద్దేశ్యం అని తెలిపారు.



## బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీ

- నలుగురు ఉద్యోగులు తొలగింపు...
- అర్చకుడికి చార్జ్ షీట్ ● ఈవో, సూపరింటెండెంట్ సస్పెన్షన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ప్రముఖ బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న అవకతవకలపై ఇటీవల ఫిర్యాదులు అందడంతో సిబ్బందికి ముందస్తు సమాచారం లేకుండానే శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించిన పలువురు అధికారులపై వేటు వేశారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం వంటి తీవ్రమైన అంశాలను గుర్తించి మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నలుగురు సిబ్బందిని ఆలయ సేవల నుండి తొలగించాలని ఆదేశించారు. స్వీపర్ (ఔట్‌సోర్సింగ్) జి. రాము, అటెండర్ (రెగ్యులర్) ఎస్. శ్రీహరి, స్వీపర్ (ఔట్‌సోర్సింగ్) పి. నరసింహ, సీనియర్ అకౌంటెంట్ (ఔట్‌సోర్సింగ్) జి. ప్రభాకర్‌రావును విధుల నుండి తొలగించాలని ఆదేశించారు. అర్చకుడు ఎ. శ్రీనివాసాచార్యులపై చార్జ్ షీట్ మెమో జారీ చేయాలని ఆదేశించారు. అలాగే, పరిపాలనా, పర్యవేక్షణ లోపాల కారణంగా దేవాలయ సూపరింటెండెంట్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)లను సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని, తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ నిర్వహణ పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేసినట్లు తెలిసింది.

## విద్యా కమిషన్ నివేదికపై చర్చలు జరపాలి

- కమిషన్ నివేదికను సవరించాలి... ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 27:** తెలంగాణ విద్యాకమిషన్ నివేదికపై చర్చలు జరపాలని అఖిల భారత విద్యారి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. విద్యా కమిషన్ నివేదికను సవరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020)కి భిన్నంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న తెలంగాణ విద్యా విధానంపై తెలంగాణ విద్యా కమిషన్ రూపొందించిన సిఫార్సు నివేదక విడుదల చేసిన నేపథ్యంలో ప్రభుత్వం నివేదికపై విద్యార్థి సంఘాలు, మేధావులు, విద్యావంతులతో చర్చలు జరపాలన్నారు. నివేదికపై లక్షలాది మంది తల్లిదండ్రులు అభిప్రాయాలు సేకరించి 45 పేజీల నివేదిక రూపొందించామని చెబుతున్న కమిషన్ ఒక్క విద్యార్థి సంఘం అభిప్రాయం తీసుకోకుండా నివేదిక ఎలా రూపొందించారని ప్రశ్నించారు. అభిప్రాయ సేకరణ ఏ ప్రాంతంలో, ఏ యూనివర్సిటీలో, ఏ కళాశాలలో నిర్వహించారో తెలుపాలని డిమాండ్ చేశారు. కొన్ని సిఫార్సులు బాగున్నాయని అందులో విద్యార్థి సంఘాలకు ఎన్నికల నిర్వహణ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టడం బాగానే ఉన్నాయని, మిగిలిన సిఫార్సులు విద్యార్థులకు ఉత్తీర్ణత శాతం 35 మార్కుల నుంచి 45 మార్కులకు పెంచాలనే సిఫార్సుని రద్దు చేయాలన్నారు. ఈ విద్యా విధానం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేటట్లు ఉండాలని, ప్రభుత్వం కేవలం విద్యా కమిషన్ వారు ఇచ్చిన రిపోర్టు ఆమోదించి అమలు చేస్తామంటే ఒప్పుకునేది లేదని ప్రభుత్వంపై తప్పకుండా ఒత్తిడి తెస్తామని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు.



కుమ్మెర బాధితులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, చిత్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య

## కుమ్మెర బాధితులకు న్యాయం చేయాలి: ఆర్. కృష్ణయ్య

**చిక్కడపల్లి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో దౌర్జన్యానికి గురైన బాధితుల ఆందోళన శుక్రవారం సాయంత్రం ఉద్రిక్తతకు దారితీసింది. ఒక సందర్భంలో బిసి సంఘాల నేతలంతా బాధితులతో కలిసి డీజీపీని కలవడానికి వెళ్తుండగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. ఈ ఆందోళనకు ముందు బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ బహుజనులు తిరగబ డితే పరిస్థితి వేరేలా ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రంలో ఒక వర్గం పాలన సాగుతోందని, నిందితులను కాపాడుతున్నారని ఆరోపించారు. బహుజనులంతా తిరగబడితే మీరు తట్టుకోలేరు, తరిమికొట్టే పరిస్థితి వస్తుంది అని హెచ్చరించారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ బాధితులకు తక్షణమే రక్షణ కల్పించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు నిందితులకు కొమ్ముకాస్తు న్నారని విమర్శించారు. బాధితుల పక్షాన నిరా హార దీక్ష చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారని, అదే సమయంలో నిందితులతో ర్యాలీ నిర్వహిం చేలా ప్రోత్సహించి అక్కడ 144 సెక్షన్ విధించడం దారుణమన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు హత్యానేరం కింద కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేస్తే పట్టించుకోకుండా, నిందితులు పెట్టిన కేసును పోలీసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరపకపోతే జాతి వివాదానికి దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### కన్నీరుమున్నీరైన బాధితులు

తమను కర్కశంగా కొట్టారని బాధితులు గణేష్, మోనిక, చంద్రకళలు కన్నీటి పర్యంతమయ్యారు. నా బిడ్డను కాపాడమని వాళ్ల కాళ్ల మీద వేసినా కనికరించకుండా కాలుతో తన్నారని, ఆ దెబ్బకే పాప చనిపోయింది అని ఆవేదన వ్యక్తం చేశారు. పాప చావుకు కారణమైన వారికి ఉరిశిక్ష పడే వరకు పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు.

### బాగ్ లింగంపల్లి లో తోపులాట.. ఉద్రిక్తత

మీడియా సమావేశం తర్వాత బాధితులతో కలిసి డీజీపీని కలవడానికి వెళ్తుండగా బాగ్లింగంపల్లిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు ర్యాలీని అడ్డుకోవడంతో నాయకులకు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. చివరకు పోలీసుల ఎస్కార్ట్‌లో బాధితులు, కొందరు నాయకులు డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు, రాఘవేంద్ర ముదిరాజ్, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా హైదరా బాద్ ట్రాఫిక్ పోలీసులు భారీ వాహన డ్రైవర్లకు 'ఆరైన్ అలైన్,సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటనరీహాల్‌లో అరైన్ అలైన్ రెండవ దశ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.సుమారు 150 మంది భారీవాహనా డ్రైవర్లకు అవగాహన సదస్సు చేపట్టి వారికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలను చేపట్టారు. హైదరాబాద్ ట్రాఫిక్-2 డిప్యూటి కమీషనర్ కాజల్ మాట్లాడుతూ రహదారి భద్రతలో భాగంగా మొదటి దశ పూర్తి చేసుకున్న తర్వాత రెండవ దశను చేపట్టడం జరిగిందన్నారు. రహదారి భద్రతలో కీలకమైన డ్రైవర్ల దృష్టి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి మెడి విజన్ ఐ కంటి ఆసుపత్రి సహాకారంతో భారీ వాహన డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు చేపట్టం జరిగిందన్నారు. గత కొన్నేళ్లుగా ప్రమాద రహితంగా సేవలు అందిస్తున్న ఇద్దరు సీనియర్ డ్రైవర్లను డిసిపి కాజల్ శాలువ కప్పి సన్మానించారు. భద్రత నిబంధనలు 150 మందికి భారీ వాహన డ్రైవర్లకు సీట్‌బెల్ట్ ప్రాముఖ్యత ను వివరించారు. మధ్యపాన సేవించి చేసి వాహనం నడుపరాదని, డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వాడకాన్ని పూర్తిగా నిషేదించాలన్నారు.

## బస్సులపై జీఐ వారసత్వ ప్రదర్శనకు ఆర్‌టిసి శ్రీకారం

**గోషామహల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** దేశంలోనే తొలిసారిగా జీఐ ఆన్‌వీల్స్ కార్యక్రమానికి ఎంజిబిఎస్‌లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డిలతో కలిసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ మాట్లాడుతూ జిఐ గుర్తింపు పొందిన కళారూపాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసురావడం ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తెలంగాణ యువ రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేసుకోవడం అవసరమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం గవర్నర్ దూరదృష్టి ఫలితమన్నారు. జిఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్, విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. ఈచర్యల ద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థికస్థితి మెరుగు పడుతుందన్నారు. ఆర్‌టిసి ద్వారా ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో అమలు చేయడా నికి సహాకారం అందిస్తామని హామి ఇచ్చారు. అదే విధంగా పోచంపల్లి, ఇక్కత్ వరంగల్, తివాచీ, కరీంనగర్ బస్సులపై ప్రదర్శించిన డిజైన్లను జెఎన్‌టియు విద్యార్థులు రూపొందించారు. వారికి నగదు బహుమతులు మెమెంటోలు అందచేశారు. జిఐ గుర్తింపుల సాధనలో సేవలందించిన సుభజిత్ సహా ప్రత్యేకంగా సన్మానించారు. రాష్ట్రానికి 18జిఐ గుర్తింపు ద్వారా సంప్రదాయ కళలు, వారసత్వాన్ని సంరక్షించడం, నకిలీలను నివారించడం, కళాకారులకు గుర్తింపు కల్పించడం వారి జీవనోపాధిని స్థిరంగా నిలుపుటకు దోహదపడుతుందని జిష్ణుదేవ్‌వర్మ అన్నారు.




జీఐ హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో కలెక్టర్ హరిచందన దాసరి, ఆర్‌టిసి ఎండి.నాగిరెడ్డి

## ఇన్ సర్వీస్ పీజీ అర్హత కలిగిన వైద్యులను లాటరల్ ఎంట్రీతో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించాలి

- మంత్రి దామోదర్ రాజనర్సింహకి తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 27:** ఇన్ సర్వీస్ పీజీ అర్హత కలిగిన వైద్యులను లాటరల్ ఎంట్రీ విధానంలో డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఈ) వైపు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టిపిహెచ్‌డిఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీవ్రంగా ఉన్న దృష్ట్యా, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ వైపు పనిచేస్తున్న స్పెషలిస్ట్ వైద్యులను లాటరల్ ఎంట్రీ విధానం ద్వారా మెడికల్ కాలేజీ, ఆస్పత్రుల్లో నియమించడం ద్వారా వైద్య అధ్యాపకుల కొరతను తీర్చడంతో పాటుగా పేద ప్రజలకు స్పెషాలిటీ వైద్య సేవలకు కూడా ఆటంకాలు తొలగిపోతాయని అసోసియేషన్ ప్రతినిధులు ఆరోగ్య శాఖ మంత్రి గారికి వివరించారు. అసోసియేషన్ విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. ఈ అంశంపై సోమవారం అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారని అసోసియేషన్ నేత డాక్టర్ కత్తి జనార్ధన్ తెలిపారు. అర్హత కలిగిన ఇన్ సర్వీస్ పీజీ వైద్యుల లాటరల్ ఎంట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ కత్తి జనార్ధన్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ అనిల్, డాక్టర్ అభిరామ్, డాక్టర్ శ్రీపతి, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

## సింగరేణి నుండి నాణ్యమైన బొగ్గు రావడం లేదు

- తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ అసంతృప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి విషయంలో థర్మల్ కేంద్రాలకు కావాల్సిన నాణ్యమైన బొగ్గు సింగరేణి కాలరీస్ నుండి సరఫరా కావడం లేదని తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు జెన్కో అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా లేఖ రాశారు. సింగరేణి బొగ్గు నాణ్యతపై విశ్వాసం సన్నగిల్లుతోందని తెలిపింది. సింగరేణి నుండి నాణ్యమైన బొగ్గు రాకపోగా, ఆ సంస్థ సరఫరా చేస్తున్న బొగ్గు ధర ఎక్కువగా ఉంటోందని, కోల్ ఇండియా బొగ్గు కన్నా అధికంగా ఉందని ఆ లేఖలో వివరించినట్లు సమాచారం. నాణ్యమైన బొగ్గు సరఫరా కాకపోవడడంతో గరిష్టంగా 3500 ఉష్ణ శక్తి ఇచ్చే అవకాశం కనిపించడం లేదని తెలిపింది. కాగా రాష్ట్రం 4500 ఉష్ణ శక్తి ఇచ్చే బొగ్గు సరఫరా అయితేనే కొత్త విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు నడిచే వీలుంటుందని స్పష్టం చేసింది. లోని యాదాద్రి థర్మల్ కేంద్రంలో ఈ వేసవి కాలం నాటికి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయలనే లక్ష్యంతో జెన్కో ఉంది. ఇందుకు గాను జెన్కోకు ప్రతీ రోజూ దాదాపు లక్ష టన్నులకు పైగా బొగ్గు అవసరం ఉంటుందని అంచనా. ఈ మొత్తం బొగ్గును సింగరేణి కాలరీస్ సరఫరా చేసే అవకాశం కనిపించడం లేదని పేర్కొంది.

## మొక్కల ఆరోగ్య నిర్వహణలో ఎఐ ఆవిష్కరణలు

- ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ జనరల్ హన్‌మాన్‌సింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పంటల తెగుళ్ల గుర్తింపు, సలహా వ్యవస్థల కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ) సాధనాలను అన్వేషిస్తున్నామని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ తెలిపారు. స్థిరమైన వ్యవసాయం, ఉత్పత్తుల ఎగుమతి ప్రమోషన్ కోసం మొక్కల ఆరోగ్య నిర్వహణలో ఆవిష్కరణలు అనే అంశంపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్‌లో నిర్వహించిన మూడు రోజుల సమావేశాలు ముగిశాయి. ఈ సమావేశంలో డైరక్టర్ జనరల్ హనుమాన్ సింగ్ మాట్లాడుతూ మొక్కల సంరక్షణ సమన్వయంతో కూడిన, సాంకేతికత ఆధారిత విధానాల వైపు మళ్లాలన్నారు. మొక్కల ఆరోగ్య ముప్పును ధీటుగా ఎదుర్కొనేందుకు శాస్త్రవేత్తలు, రైతులు వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ పూనమ్ జస్రోటియా మొక్కల సంరక్షణ, ఎగుమతికి సంబంధించిన పంటల ఉత్పత్తులను ప్రభావితం చేసే సవాళ్లను గూర్చి వెల్లడించారు. డాక్టర్ జెపి సింగ్ రిమోట్ డయాగ్నస్టిక్ ప్రాముఖ్యతను, పురుగు మందులు, బయోపెస్టిసైడ్లలో నాణ్యత నియంత్రణను నొక్కి చెప్పారు. సహజ వ్యవసాయ వ్యవస్థలలో మరింత పరిశోధన అవసరం గురించి మాజీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎస్ఎన్ పూరి మాట్లాడారు. సమావేశంలో విస్తరణ అధికారులు, విద్యార్థుల కోసం నిల్వ చేసిన ధాన్యం, పురుగు మందుల నిర్వహణ పద్ధతులపై రెండు ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించారు. డిజిటల్ తెగులు నిర్ధారణ సాధనాలు, ఇంటిగ్రేటెడ్ నిర్వహణ పద్ధతులపై దృష్టి సారించేలా తెలంగాణ రైతుల కోసం ప్రత్యేక సెషన్‌లు జరిగాయి.

## మూడో డిస్కం సిఎండిగా ఫరూఖీ

- ఎస్పీడీసీఎల్ సిఎండిగా జితేష్ బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మూడో కొత్త విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) సిఎండిగా ముషారఫ్ ఫరూఖీ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పిడిసిఎల్) సిఎండిగా జితేష్ వి. పాటిల్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయా సంస్థలకు చెందిన కార్యాలయాల్లో శుక్రవారం ఇరువురు సిఎండిలు బాధ్యతలు స్వీకరించారు. కొత్త విద్యుత్ పంపిణీ సంస్థ బాధ్యతల్లో చేరిన తొలి రోజునే డిస్కం రూపకల్పనపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని తెలిపారు. కాగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నూతన సిఎండిగా బాధ్యతలు చేపట్టిన జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక వసతులు పెపొందించాలి

- కరాటే విజేతలకు టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అభినందనలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లోక్రీడా మౌళిక వసతులు పెపొందించాలనీ అప్పుడే తెలంగాణ యువత క్రీడా రంగంలో మరింతగా రాణిచగలరనీ టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులను ఆయన ఘనంగా సన్మానించారు. సీనియర్ 55 కేజీల కుమిట్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన పి. బబ్బి వర్మను, అండర్ 21 సంవత్సరాల 84 కేజీల కుమిట్ విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్న కె. కౌశిక్ ప్రణయ్‌కు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు తీసుకువచ్చిన ఈ యువ క్రీడాకారులు రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడాకారుల కుటుంబ సభ్యులు, కోచ్‌లు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ యువత క్రీడా రంగంలో మరింతగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

# వైభవంగా మహా పూర్ణాహుతి, శ్రీ చక్రస్నానం



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లకు మహా పూర్ణాహుతి శ్రీ చక్ర స్నానాన్ని ఘనంగా నిర్వహించారు. గత పది రోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా హావన గుండంలో సకల దేవతలకు సుదర్శనం, నారసింహం, లక్ష్మీ, విష్ణు, గరుడ, గంధర్వ, యక్ష, రామాయణ, మహాభారత, భాగవత, ఉపనిషత్తుల, వివిధ దేవతల మూల మంత్రాలతో హావనం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేద పండితులు రుత్వికులు చదివే వేద మంత్రాలతో పూర్ణాహుతి సామాగ్రికి ప్రత్యేక పూజలను జరిపి మహా పూర్ణాహుతిని నిర్వహించారు. భక్తుల ఆనందోత్సాహాల మధ్య శ్రీ చక్రస్నానం కళ్యాణం పూర్తి చేసుకున్న నవ దంపతులైన లక్ష్మీ నరసింహా స్వామి వార్లకు ఆలయ అర్చకులు మంగళ స్థానాలను ఆచరింపజేశారు. దేవతా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వివిధ పుష్పాలతో శోభాయమానంగా విష్ణు పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తోడ్కొని, విష్ణు పుష్కరిణి వద్ద విష్వక్సేన పూజ, నివాహావాచనం నిర్వహించారు. తదుపరి శ్రీ చక్ర పెరుమాళ్లను ఆలయ ప్రధాన అర్చకులు కాందూరి వెంకటాచార్యులు తలపై ఊరేగింపుగా విష్ణుపుష్కరిణిలో గంగపూజను నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తుల మధ్య ద్విచక్ర పెరమాలతో ఆలయ అర్చకులు, అధికారులు శ్రీ చక్ర స్నానాన్ని విష్ణు పుష్కరణలో స్థానమాచరించారు. అంతకుముందు విష్ణు పుష్కరిణి స్వామివారి తిరునామాలు, శంఖ చక్రాలతో అందంగా తీర్చిదిద్దారు. ఘనంగా దేవతా ఉద్వాసన శ్రీ పుష్పయాగం లోక సంరక్షణ అర్థం, జగత్ రక్షణార్థం స్వామి అమ్మవార్ల ఉత్సవాలు ఘనంగా జరగడం కోసం ముక్కోటి దేవతల, అష్ట దిక్పాలకుల, నవగ్రహాల, గరుడ, యక్ష, కిన్నెర, కింపురుష మొదలైన ఈ ఉత్స వాలకు ఆవాహనచేసి తిరిగి వారి వారి స్వస్థలాలకు పంపడమే దేవత ఉద్వాసన కార్యక్రమం. దీనిలో 12 కలశాలలో సకల దేవతలను ఆవాహన చేసిన తిరిగి వాటికి ఉద్వాసన పూజను నిర్వహించారు. శ్రీ పుష్పయాగంలో స్వామి అమ్మవార్లకు సుమారు 108 రకాల పుష్పాలతో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ డైరెక్టర్ హాను మంతరావు, డీఈఓ దౌర్భాల భాస్కర్ శర్మ, ఉన్నతాధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఊదారంగు





ఫ్యాషన్ ఫ్యాషన్


అమ్మాయిలకు ఇష్టమైన కలర్ అనగానే పింక్ అని చెప్పేస్తారు. కానీ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో మహిళలు సాధించిన విజయాలకు సంకేతంగా ముచ్చటగా మూడు రంగుల్ని ఎంపికచేసింది ఐక్యరాజ్యసమితి. స్త్రీల స్వచ్ఛమైన మనసుకు తెలుపు రంగునీ, ఆశావాద దృక్పథానికి ఆకుపచ్చనీ, స్త్రీల వ్యక్తిత్వాన్నీ గౌరవాన్నీ పోరాటాన్నీ ప్రతిబింబించేలా ఊదానీ ఎంపిక చేశారట.




# ఆమె సేవలకు గ్లోబల్ టీచర్ ప్రైజ్



చాలా మంది తమ జీవితాల్లోనే సంతోషం వెతుక్కుంటారు. కానీ తోటి వారి ఎదుగుదలలో సంతోషం వెతుక్కునే వారు కనిపిస్తారు. రూబల్ నాగీ ఇదే కోవకు చెందుతారు. 'అన్ని దానాల్లోకెల్లా విద్యా దానం గొప్పది' అని నమ్మిన ఆమె.. చదువుకు నోచుకోని చిన్నారులందరినో విద్యావంతుల్ని చేస్తోంది. వారికి విద్యాబుద్ధులు నేర్పుతూ వారి బంగారు భవితకు బాటలు వేస్తున్నారు. ఈ సమాజ సేవే తాజాగా ఆమెకు 'గ్లోబల్ టీచర్' ప్రైజ్ తెచ్చిపెట్టింది. టీచింగ్ నోబెల్ ఈ పురస్కారంతో పాటు దాదాపు రూ.9 కోట్ల ప్రైజ్ మానీనీ అందుకుదామె. ఈ డబ్బుతో మరింత మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమంటోన్న రూబల్ స్ఫూర్తి ! సమాజ సేవకే కొందరు తమ జీవితాన్ని అంకితం చేస్తారు. ఇందులోనే తమ సంతోషాన్ని వెతుక్కుంటారు. నాగిది కూడా ఇలాంటి నిస్వార్థమైన మనస్తత్వమే 1980లో జమ్మూ కశ్మీర్‌లో పుట్టిన ఆమె.. పొలిటికల్ సైన్స్ డిగ్రీ చేశారు. లలిత కళలపై మక్కువతో లండన్‌లోని స్లేడ్ స్కూల్‌లో ఈ కోర్సు చేశారు. ఆపై అక్కడే యూరోపియన్ ఆర్ట్ కూడా నేర్చుకున్నారు.



**ఆర్ట్‌తో పాఠాలు !**...చిన్నతనం నుంచి సామాజిక స్పృహ ఎక్కువగా ఉన్న నాగి.. ఈ మక్కువతోనే చదువు పూర్తయ్యాక రెండు స్వచ్ఛంద సంస్థల్ని నెలకొల్పారు. 'రూబల్ నాగీ ఆర్ట్ ఫౌండేషన్', రూబల్ నాగీ డిజైన్ స్టూడియో.. పేరుతో తాను ప్రారంభించిన ఈ ఎన్జీవోల ద్వారా పేద చిన్నారులకు ఉచిత విద్య అందించాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో, మురికి వాడల్లో.. స్కూలుకు వెళ్లలేని, చదువుకు నోచుకోని చిన్నారుల కోసం దాదాపు 800 మందికి పైగా విద్యా కేంద్రాల్ని నెలకొల్పారు. వీటి ద్వారా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడమే కాదు.. ఆ ప్రాంతాలను బ్లాక్‌బోర్డులుగా మార్చి.. వాటిపై మ్యూరల్ ఆర్ట్ పెయింటింగ్స్ వేస్తున్నారు. మ్యాథ్స్, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ.. ఇలా ఎన్నో అంశాలని పెయింటింగ్స్ రూపంలో రూపొందించిన చిన్నారుల్లో ఆయా అంశాలపై అవగాహన పెంచుతున్నారు. ఇలా తన ఆర్ట్‌లో ఓవైపు చిన్నారుల భవితకు బంగారు బాటలు వేస్తూనే.. మరోవైపు మురికి వాడలు, గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా మార్చేస్తున్నారు నాగి. చిన్నారుల్లో ఆయా అంశాల పై అవగాహన పెంచుతున్నారు. ఇలా తన ఆర్ట్‌లో ఓవైపు చిన్నారుల భవితకు బంగారు బాటలు వేస్తూనే.. మరోవైపు మురికి వాడలు, గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా మార్చే స్తున్నారు నాగి. ఇలా తన నైపుణ్యా లను 2017లో 'రాష్ట్రపతి భవన్ మ్యూజియం'లో ప్రదర్శించారు నాగి. ఈ అవకాశం అందుకున్న తొలి ఆర్టిస్ట్‌గా ఘనత సాధించారు. టీచింగ్ నోబెల్ ఈ అవార్డుతో పాటు రూ.9 కోట్ల నగదు బహుమతీ ఆమె సొంతమైంది. 'గ్లోబల్ టీచర్ ప్రైజ్ అందుకోవడం గర్వంగా అనిపిస్తోంది. ఇది నాతో పాటు దేశానికీ దక్కిన గౌరవం. 24 ఏళ్ల క్రితం 30 మంది చిన్నారు లతో కలిసి ఈ ప్రయాణాన్ని ప్రారంభించా. ఇప్పుడు లక్షల మంది ఇందులో భాగమయ్యారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు నేను చేసిన ప్రతి ప్రయత్నం, ప్రారంభించిన ప్రతి కార్యక్రమం మరింత ముందుకెళ్లేందుకు నాకు స్ఫూర్తినిచ్చింది..

# దైవాన్ని చేరాలంటే..

సాధకులు సదా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తారు. ఇతరులు ఏవైనా ఇబ్బంది కలిగించినా సహనం చూపి ఔదార్యాన్నీ, ఔన్నత్యాన్నీ చాటుకుంటారు. ముఖ్యంగా ఈర్ష్య, ద్వేషాలు మనిషినిదిగజారుస్తాయి. ఉద్వేగ స్థితిలో మనసు మాట విన్నామంటే పిల్లవాడు చెప్పిన సలహా పండితుడు పాటించినట్లుంటుంది. 18 క్షణాలు పాటు ఆలోచనారహిత స్థితని సాధిస్తే ఆత్మజ్ఞానం సిద్ధించినట్లే అన్నాడో ఆధ్యాత్మికవేత్త. అదంత సులభం కాదు మరి. అందు కెంతో సాధన అవసరం.

కోపతాపాలు శరీరంతోపాటు మనసునూ ప్రభావితం చేస్తాయి. కోపం, కామం విశ్వామిత్రుణ్ణి సైతం సాధనలో ఆటంకపరిచాయి. వందల సంవత్సరాల కఠోర తపస్సు నిరుపయోగ మైంది. బ్రహ్మ ప్రత్యక్షమై నబ్రహ్మర్షిత్వం ఇచ్చినా వశిష్ఠుడే చెప్పాలని పట్టుపట్టాడు. అంటే అక్కడ తనస్సు నిరుపయోగ మైంది. బ్రహ్మ ప్రత్యక్షమై బ్రహ్మర్షిత్వం ఇచ్చినా వశిష్ఠుడే చెప్పాలని పట్టు పట్టాడు. అంటే అక్కడ అహం అంగీకరించలేదు. తీవ్ర తపస్సు వల్ల లోకానికి ముప్పు వాటిల్లుతుందని వశిష్ఠుడు వచ్చి చెబితే అప్పుడు తపస్సు విరమించాడు. విజయ గర్వితుడయ్యాడు. తర్వాత నిజానిజాలు గ్రహించి తనకున్నా అతడే గొప్పవాడని తెలుసుకున్నారు. ఎదుటివారి సంపద, పదవి, గౌరవాలు చూస్తే ఈర్ష్య కలుగుతుంటుంది. రాజసూయ యాగంతో పాండవులకు లభించిన సంపద, గౌరవాలు చూసి అసూయ చెందిన దుర్యోధనుడు వైరానికి దిగడంతో కురుక్షేత్రసంగ్రామం సంభవించింది. వినాశనానికి దారితీసే అసూయను తృప్తితో, అశాంతి కలిగించే ద్వేషాన్ని ప్రేమతో జయించాలి. ప్రేమ శత్రువులను కూడా మిత్రులుగా మారుస్తుంది. సుఖాలకు ఆనందం, దుఃఖాలకు విచారం సాధకుడికి కూడదు. అవి ద్వితీత స్థితి వస్తేనే సాధకుడి ప్రయాణం గాడిలో పడినట్లవుతుంది. అలాగే పుట్టుకను మరణం వెంటాడుతుందనే ఆలోచన భయాన్ని కలిగిస్తుంది.



# కొవ్వును కరిగించాలా?

శొంఠి పొడి వేసి టీ కాస్తే.. ఆ రుచి భలే పసందుగా ఉంటుంది. జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కూడా.

**ఇవే కాదు శొంఠితో మరిన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయండోయ్!**

* రోజూ కాసింత శొంఠిపొడిని ఆహారంలో చేర్చుకుంటే నెలసరి సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే వాళ్లకి చక్కని ఉపశమనం దొరుకుతుంది. మొదటి మూడు రోజులు శొంఠిపొడి వేసిన అన్నం తింటే నొప్పి కూడా తగ్గుతుంది.
* కాలి పిక్కలు పట్టేయడం, కండరాల నొప్పులతో బాధపడటం వంటి సమస్యలుంటే ఇది మంచి ఔషధం.
* . కొవ్వుని కరిగించడంలో శొంఠి ముందుంటుంది. ట్రైగ్లిజరాయిడ్ సమస్యతో బాధపడేవారు. కొన్ని రోజులు శొంఠి టీ తాగితే చక్కని ఫలితం కనిపిస్తుందట.
* శరీరం లోపలి వాపులకి, కీళ్లదగ్గర పట్టేసిట్టుగా ఉన్నా ఇది మేలు చేస్తుంది.

# పులుపు

ఆరోగ్య భాగ్యం

ఇదొక ఆమ్లరుచి. అధిక మొత్తంలో ఆమ్లం ఉండడం వల్ల పుల్లని రుచి వస్తుంది. దీనికి రుచి హైడ్రోజన్ అయాన్ సాంద్రత వల్ల వస్తుంది. పులుపు అనేది ఆహారాల్లో అధిక మొత్తంలో ఆమ్లం యొక్క ఫలితం నాలుక కిరువైపులా పులుపు రుచిని తెలిపే రుచి మొగ్గలుంటాయి. ఇదొక రసాయనిక లోపం. ఇది తరుచు ఆమ్లాలతో సంబంధం కల్గి ఉంటుంది. లాక్టిక్ ఆసిడ్, సిట్రిక్ ఆసిడ్ మాలిక్ ఆసిడ్, ఎసిటిక్ ఆసిడ్ వంటి ఆర్గానిక్ ఆసిడ్స్, హైడ్రోక్లోరిక్ ఆసిడ్, నైట్రిక్ ఆసిడ్, సల్ఫ్యూరిక్ ఆసిడ్ వంటి ఇన్ఆర్గినిక్ ఆసిడ్స్ వల్ల తెలుస్తుంది. ఇది ఆసిడ్ అనే లాటిన్ పసదం నుంచి వచ్చింది. దీని అర్థం సొర్ (పులుపు)'. ఇది చాలా పోషకాలు, ఆంటి ఆక్సిడెంట్స్ అని పిలవబడే మొక్కల సమ్మేళనాల్లో సమృద్ధిగా ఉంటాయి. ఉదా: పండ్లు : గ్రీఅన్ ఆపిల్, ద్రాక్ష, స్ట్రాబెర్రీలు, చింతపండు, పచ్చిమామిడి, జామ, జసనీ ఆప్రికరాట్‌నసై, గూస్బెర్రీస్, కాన్బెర్రీస్, చీనీ, బ్లూబెర్రీస్, అరెంజెస్, నిమ్మ, పైనాపిల్, రాసెబ్బెర్రీన్, టూర్ట్ చెర్రీస్.

డైరీ ప్రొడక్ట్స్ : వెన్న, మీగడ, సొర్‌క్రీమ్, పెరుగు, కూరగాయలు : ఊరగాయలు, టమోటాలు

**లక్షణాలు** : ఇది వేడిచేసి జఠరాగ్నిని వృద్ధి పరుస్తుంది. ఆహారానికి రుచిని కల్గిస్తుంది. ఇది శరీరానికి జ్ఞానేంద్రియల పుష్టిని, ధృఢత్వాన్ని, జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. మూత్రాన్ని ఎక్కువ చేస్తుంది. గ్యాస్ బైటికి పోవడానికి, శరీరంలో కణాల పోషణకి, శరీరంలోని స్రావాల్ని, ముఖ్యంగా లాలాజలాపికప ఎక్కువ ,చేస్తుంది. జీర్ణకోశ ఎంజైమ్‌ని ఉత్పత్తి చేసి మెటజాన్ని స్టిములేట్ చేస్తుంది. లివర్ ఫంక్షన్స్‌కి, పైతాన్ని సిగా ఫ్లో అయ్యేలా చేస్తుంది ఇది. గుండెకి, గొంతు నోరుకి మంచిది. లాలాజలంలో ప్రధాన బఫరింగ్ ఏజెంట్ అయిన మైకార్బనేట్స్ స్రావాల్ని పెంచుతుంది ఇది. కణాల్ని దెబ్బ తినకుండా రక్షిస్తుంది. ఇది ఆసిడ్ బేస్‌ల సాంద్రతను శబ్దతని కదిలిస్తుంది. శక్తినిస్తుంది. పిత్త ప్రవాహాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది కాలేయం పని తీరుని మెరుగుపరుస్తుంది. **కారణాలు:** క్రమ తప్పకుండా బ్రష్ చేయక పోయినా దంత పరిశుభ్రత పాటించకపోయిన పుల్లని రుచివస్తుంది. డీ హైడ్రేషన్, నోరు పొడారిపోవడం, ఆసిడ్ రిఫ్లెక్స్ వల్ల జలుబు, సైనస్ ఇన్ఫెక్షన్ వంటి అంటువ్యాధులు స్మోకింగ్, ఆల్కహాల్ త్రాగడం వల్ల గర్భధారణ, బహిష్టు సమయంలో, మెనోపాజ్‌లో హార్మోన్ల మార్పుల వల్ల న్యూరాలాజికల్ డిస్ ఆర్డర్స్ ఉన్న వరాలు దెబ్బతినడం వల్ల కరోనా-19, అనారోగ్యాలు వల్ల వస్తుంది. ఒరల్ థ్రష్ గొంతు, ముక్కు వ్యాధులు, పోషకాహార లోపం, జింక్ లోపం, కేన్సర్ వ్యాధులు రేడియేషన్ వల్ల బి.పి. ఆంటి సైకోటిక్ మందుల వల్ల, ఒత్తిడి, భావోద్వేగాలు, ఆందోళన, స్ట్రెస్ వంటి మానసిక కారణాలు వల్ల, పర్యావరణ కారకాలు, హానికరమైన రసాయనాలు, టాక్సిన్స్‌కు గురికావడంవల్ల పుల్లని ఆహారాన్ని కోరుకుంటారు. లాలాజలం స్టిములెంట్ వల్ల, బైకార్బనేట్ లెవల్స్ అధికంగా ఉండడం వల్ల ముఖకండరాల ఆకృతిలో తేడా రావడాన్ని సొర్ ఫేస్ అంటరు.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి



# విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, హిట్ మెషిన్ అనిల్

బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి తన మచ్ ఎవైటెడ్ నెక్స్ట్ మూవీ అనౌన్స్‌మెంట్ తో మరోసారి అందరిలో ఆసక్తిని పెంచారు. వరుసగా తొమ్మిది బాక్సాఫీస్ విజయాలతో అదరగొట్టిన అనిల్ రావిపూడి.. ఈ సంక్రాంతికి వచ్చిన భిమన శంకరవరప్రసాద్ గారుఖితో ఆల్ టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్ అందిస్తూ బిగ్గెస్ట్ సక్సెస్ ని నమోదు చేశారు. ఇప్పుడు ఆయన కొత్త ప్రాజెక్ట్‌లో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా నటించనున్నారు. ఏఫ్2, ఏఫ్3, సంక్రాంతికి వస్తున్నం వంటి బ్లాక్‌బస్టర్ ఎంటర్‌టైనర్‌ల తర్వాత ఇది అనిల్ రావిపూడి వెంకటేష్‌తో కలిసి చేస్తున్న ఐదవ చిత్రం కావడం విశేషం. ఇటీవలే లీఖీబిలో అతిథి పాత్రలో అదరగొట్టారు వెంకటేష్. అలాగే సంచలనాత్మక బ్లాక్‌బస్టర్ పటాస్ తర్వాత కళ్యాణ్ రామ్‌తో ఇది అనిల్ రావిపూడి రెండవ చిత్రం. దర్శకుడు అనిల్ రావిపూడి దగ్గుబాటి, నందమూరి కుటుంబాల నుంచి వచ్చిన స్టార్స్‌ని కలిపి ఈ కొత్త చిత్రాన్ని ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైనర్‌గా అందరికీ కనెక్ట్ అయ్యే కథాంశంతో రూపొందిస్తున్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అయ్యే కంప్లీట్ ఎంటర్టైనర్ గా ఉండబోతుంది. అనిల్ రావిపూడి ట్రేడ్‌మార్క్ స్టయిల్, హ్యూమర్, ఎమోషన్స్, ఎంటర్టైమెంట్ తో సంక్రాంతికి ఫెస్టివ్ ట్రీట్‌గా నిలవనుంది. ఈ చిత్రం ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉంది, ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న భారీ అంచనాలను తగ్గట్టుగా దర్శకుడు స్క్రిప్ట్‌ను జాగ్రత్తగా మెరుగుపరుస్తున్నాడు. సాంకేతిక బృందం గురించి వివరాలు, ఇతర నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తారు.

# 'ఓ మాట అనుకుందామా!' ఫస్ట్ లుక్ పోస్టర్,



మాస్టర్ కనిష్క మహాబలాహ్ సమర్పణలో శ్రీ శుభకర క్రియేషన్స్ బ్యానర్‌పై రూపుదిద్దుకుంటోన్న లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం'ఓ మాట అనుకుందామ్మా!. సుహాసిని , వినోద్ కుమార్, ఇంద్రజ కీ రోల్ ప్లే చేస్తున్నారు. శ్రీనివాస్ అనంతనేని, మోనికా మిశ్రా హీరోహీరోయిన్లు కాగా, శుభలేఖ సుధాకర్, కార్తికేయ దేవ్, అజీజ్ ఖాన్, అన్నపూర్ణమ్మ మిగతా పాత్రలు పోషిస్తున్నారు. భీమ్‌జీ కథ, దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి పెంటి నాగరాజు, పెంటి నీరజ్ సందీప్ నిర్మాతలు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ లుక్ గ్లింప్స్‌ని సుహాసిని మణిరత్నం, వినోద్ కుమార్ చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భగా దర్శకుడు భీమ్‌జీ మాట్లాడుతూ.. ముందుగా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ విడుదల చేసిన సీనియర్ నటీనటులు సుహాసిని మేడమ్‌కు, వినోద్ కుమార్ సార్‌కు ధన్యవాదాలు.

# సంచలనం సృష్టిస్తోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' కొత్త పోస్టర్..

త్వరలోనే ప్రత్యేక గ్లింప్స్ తో అభిమానులకు విందు

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. ఇప్పుడు ఆ అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్ళేలా కొత్త పోస్టర్ విడుదలైంది. పవన్ కళ్యాణ్ హ్యాట్ ధరించి స్టైలిష్ గా కనిపిస్తున్న పోస్టర్, సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన తక్షణమే పోస్టర్ వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రియులు పవన్ కళ్యాణ్ అద్భుతమైన లుక్ కి ఫిదా అవుతున్నారు. ఈ భారీ స్పందన మరోసారి ఈ చిత్రంపై ఉన్న అపారమైన క్రేజ్‌ను నిరూపించింది. ప్రారంభం నుంచే 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రచార చిత్రాలు సంచలనంగా మారి, అన్ని సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతూ భారీ బజ్ సృష్టించాయి.



# 'విష్ణు విన్యాసం' ఫ్యామిలీ అంతా హాయిగా నవ్వుకోవచ్చు: శ్రీ విష్ణు

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు హిలేరియస్ జాయ్‌రైడ్ 'విష్ణు విన్యాసం'తో అలరించ బోతున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్ గా నటిస్తోంది.



**మీరు గ్రహాలని, జాతకాలని నమ్ముతారా?**

అన్ని ఫాలో అవ్వను, కానీ మనం చిన్నప్పటి నుంచి అందరితోపాటు అలవాటు చేసుకున్న కొన్నిటిని ఫాలో అవుతాను. పర్సనల్ గా నాకైతే ఫలానా టైము ఫలానా నెంబర్లు అనే నమ్మకాలు లేవు.

**విష్ణు విన్యాసం ప్రాజెక్టు ఎలా మొదలైంది?**

డైరెక్టర్ మారుతి కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. అందరూ రిలేట్ అయ్యే కథ, చాలా మంచి క్యారెక్టర్.

**ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ చాలా డామినేటింగ్ గా ఉంది కదా?**

ఆ క్యారెక్టరైజేషన్ ని ప్రేక్షకులు చాలా బాగా ఎంజాయ్ చేస్తారు.నయన్ సారిక రెండు మూడు పేజీలు సీన్ కూడా సింగిల్ టేక్ లో చేసింది. తన పెర్ఫార్మన్స్ ఈ సినిమాలో చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఫస్ట్ హాఫ్ యూత్ కి సెకండ్ హాఫ్ యూత్‌తో పాటు ఫ్యామిలీ కూడా కనెక్ట్ అవుతుంది.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలాంటి ఎక్సైట్మెంట్ ని క్రియేట్ చేసింది?**

ఇలాంటి క్యారెక్టర్ చేయడం నాకు కొత్త. ఈ క్యారెక్టర్ కి కొన్ని రూల్స్ ఉంటాయి. చాలా నమ్మకాలుని ఫాలో అవుతుంటాడు. చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది డైరెక్టర్ మారుతి సినిమాని చాలా బాగా హ్యాండిల్ చేశాడు. చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్.

**మ్యూజిక్ గురించి?**

రథన్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. అన్ని కూడా కథ నుంచి వచ్చిన పాటలే. నాలుగు పాటల్లో కూడా మంచి ఫన్ ఉంటుంది.మేము షూటింగ్ కి వెళ్ళకముందే పాటలన్నీ చేయించుకున్నాం. మీ మార్క్ డైలాగ్స్ ఇందులో ఉంటాయాఅన్నీ ఉంటాయి. కథ, క్యారెక్టర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా సరదాగా అనిపిస్తాయి.

**నిర్మాతల సపోర్టు గురించి ?**

సుబ్రమణ్యం గారు, సుమంత్ గారు 100 సపోర్ట్ చేశారు. సినిమా విషయంలో వాళ్ళు చాలా హ్యాపీగా ఉన్నారు. మాకు చాలా ఫ్రీడమ్ ఇచ్చారు. మేము అనుకున్న బడ్జెట్లో ఒక పది, పదిహేను శాతం తక్కువ లోనే పూర్తి చేశాం.

## తెర

# 'పెద్ది' సెకండ్ సింగిల్ 'రై రై రా రా' మార్చి 2న రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది' సినిమా వేసవిలో గ్రాండ్‌గా విడుదల కానున్న నేపథ్యంలో బజ్ నెక్స్ట్ లెవల్‌కి చేసుకుంది. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇది భారీ హాలిడే సీజన్ షోడౌన్‌కు వేదికగా నిలుస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన పెద్దిలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఆస్కార్ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఫస్ట్ షాట్ప్ గ్లింప్స్, బ్లాక్ బస్టర్ ఎక్సయిట్మెంట్ ని మరింతగ్ధ్వ పెంచుతూ మార్చి 2న రెండవ సింగిల్ 'రై రై రా రా' విడుదలతో బజ్ నెక్స్ట్‌కి వెళ్ళబోతోంది. AR రెహమాన్ పవర్ ఫుల్ సంగీతం ఇప్పటికే సంచలనం సృష్టించింది. పెద్ది ఈ సంవత్సరం అత్యంత ఎదురుచూస్తున్న మాస్ స్పెషాలిటీలలో ఒకటిగా రాబోతోంది.

# నాని 'ది ప్యారడైజ్' ఆయా షేర్ సాంగ్



నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్ ది పారడైస్ ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ వరల్డ్ వైడ్ సంచలనం సృష్టించింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విడుదలైన కొద్దిసేపటికే ఆయా షేర్ ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంది. ఈ పాట యూట్యూబ్ గ్లోబల్ చార్ట్స్‌లో 9 దేశాల్లో ట్రెండింగ్‌లో నిలిచింది. భారత్, యూఏఈలో నంబర్ 1 స్థానాన్ని దక్కించుకోగా, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, సౌదీ అరేబియా, అమెరికా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా అద్భుతమైన ర్యాంకులు సాధించింది. ఒక తెలుగు పాటకు ఈ స్థాయి అంతర్జాతీయ ఆదరణ రావడం విశేషం. ఈ సాంగ్ లో రా ఎనర్జీ, నాని స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోయింది. ఆయన చేసిన ఐకానిక్ హుక్ స్టెప్ ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకుంది. ఫ్లోర్ మూవ్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్‌లలో ట్రెండ్ అవుతూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరిస్తోంది.



పాకిస్థాన్ ఓడితే కివీస్‌కు సెమీస్ అవకాశం

## కివీస్‌పై ఇంగ్లండ్ విజయం

**కొలంబో:** టీ20 ప్రపంచకప్ 2026లో ఇప్పటికే సెమీస్‌కు దూసుకెళ్లిన ఇంగ్లాండ్ మరో విజయం సాధించింది. బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన చివరి సూపర్8 పోరులో 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇంగ్లాండ్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది సూపర్8 గ్రూప్-2లో టాప్ పొజిషన్ పొందింది.

తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. కివీస్ జట్టులో గ్లేన్ ఫిలిప్స్(39), టిమ్ సీఫెర్ట్(35) రాణించారు. అదిల్ రషీద్, విల్ జాక్స్, రేహాన్ అహ్మద్ రెండేసి వికెట్లు తీసి న్యూజిలాండ్‌ను కట్టడిచేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ 19.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని పూర్తి చేసింది. టామ్ బాటన్ (33), విల్ జాక్స్ (32), సామ్‌కరన్ (24), హ్యారీ బ్రూక్ (26), బేతెల్ (21) కీలక ఇన్నింగ్స్ ఆడారు. రచిన్ రవీంద్ర మూడు వికెట్లు తీశాడు. న్యూజిలాండ్ ఓటమితో పాకిస్థాన్‌కు సెమీస్ ఆశలు నిలిచాయి. చివరి మ్యాచ్‌లో పాక్ భారీ విజయం సాధిస్తే సెమీస్ చేరే ఛాన్స్ ఉంటుంది.

## రెండో వన్డేలోనూ అమ్మాయిలకు ఓటమి



**హోబర్ట్:** ఆస్ట్రేలియా గడ్డపై టీ20 సిరీస్‌ను నెగ్గిన భారత మహిళా జట్టుకు వన్డే సిరీస్‌లో షాక్ ఎదురైంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడి మూడు వన్డేల సిరీస్‌ను కోల్పోయింది. హోబర్ట్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్‌పై 5 వికెట్ల తేడాతో ఆసీస్ గెలుపొందింది. భారత్ నిర్దేశించిన 252 పరుగుల లక్ష్యాన్ని 36.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఆసీస్ బ్యాటర్ జార్జియా వోల్ (82 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్స్) సెంచరీతో ఆసీస్ విజయంలో కీ రోల్ పోషించింది. ఓపెనర్ అలీస్సా హీలీ సింగిల్ డిజిట్‌కే అవుటైనా.. మరో ఓపెనర్‌ఫోయిబ్ లిట్చ్‌ఫీల్డ్ (62 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్స్‌తో 80 రన్స్) జతగా రెండో వికెట్‌కు 120 రన్స్ జోడించిన వోల్... మూడో వికెట్‌కు బెత్ మూనీ(36)తో కలిసి 82 రన్స్ భాగస్వామ్యం నడిపింది. సెంచరీ చేసి అవుటైనా మిగతా పనిని గ్రాడ్‌నర్(19) పూర్తి చేశాడు. భారత బౌలర్లలో కాష్వీ గౌతమ్ 2, దీప్తి శర్మ 2, క్రాంతి గౌడ్ ఒక వికెట్ తీశారు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ విమెన్స్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 251 రన్స్ చేసింది. ఓపెనర్ ప్రతీకా రావల్ (52), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (54) హాఫ్ సెంచరీలు సాధించారు. స్మృతి మంధాన (31), రిచా ఘోష్ (22), కాష్వీ గౌతమ్ (25), క్రాంతి(19) ఫర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో ఆష్లే గార్డెనర్, అన్నాబెల్. అలానా కింగ్ తలా రెండేసి వికెట్లు పడగట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా జార్జియా వోల్ నిలిచింది. నామమాత్రమైన మూడో వన్డే మార్చి1న హోబర్ట్ వేదికగా జరగనుంది.

# విండీస్‌ను దాటితేనే!




### తక్కువగా అంచనా వేయొద్దు: సన్నీ

కరేబియన్లను తక్కువగా అంచనా వేయొద్దని సూర్య సేనను లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ హెచ్చరించాడు. విండీస్‌తో సవాల్ భిన్నమైందని పేర్కొన్నాడు. విండీస్ బ్యాట్స్‌మెన్ మంచి ఫామ్‌లో ఉన్నారు... బౌలర్లూ రిథమ్‌తో బౌలింగ్ చేస్తున్నారు. ఏదైనా పొరపాట్లు చేస్తే శిక్షించేందుకు సిద్ధంగా ఉంటారని వార్నింగ్ ఇచ్చాడు. విండీస ను కట్టడి చేయాలంటే టీమిడియాకు సరైన ప్లాన్ అవసరమని, ముఖ్యంగా ఆ జట్టు బ్యాటింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించాడు.

### వరుణ్‌ను ఆపడం విండీస్‌కు కష్టం: ఇర్ఫాన్

కోల్‌కతాలో టాప్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఆపడం విండీస్‌కు చాలా కష్టమని మాజీ ప్లేయర్ ఇర్ఫాన్ పఠాన్ వ్యాఖ్యానించాడు. ఈడెన్ గార్డెన్స్‌లో వరుణ్ వికెట్ల పంట పండిస్తాడని జోస్యం చెప్పాడు. ఈడెన్ పిచ్ వరుణ్‌కు బాగా అలవాటు... ఒక్కసారి లెంగ్త్‌ను అడ్జస్ట్ చేసుకుంటే చాలు. స్టంప్స్‌కు కాస్త దగ్గరగా బంతులేస్తే అతడిని ఆపడం ఎవరి వల్లా కాదు. ఇక ఆరంభంలోనే వికెట్ తీశాడంటే.. అత్యంత ప్రమాదకరంగా మారిపోతాడని ఇర్ఫాన్ పఠాన్ విశ్లేషించాడు.

### ఇదే రిథమ్ కొనసాగించాలి: సచిన్

జింబాబ్వేపై టీమిండియా ప్రదర్శనకు బ్యాటింగ్ మాస్ట్రో సచిన్ తెండూల్కర్ కితాబిచ్చాడు. సూర్యసేన ఇదే రిథమ్‌ను విండీస్‌పై కొనసాగించాలన్నారు. కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో టీమ్ఇండియా పాజిటివ్ గేమ్ ఆడాలని సూచించాడు. అభిషేక్ కూడా పరుగుల గాడిలో పడడం శుభసూచకమన్నారు. విండీస్ బ్యాటింగ్‌ను భారత బౌలర్లు కట్టడి చేయగలిగితే ఎదురుండదని పేర్కొన్నాడు. బుమ్రా కీలకమవుతాడని, సౌతాఫ్రికా తరహాలో విండీస్‌ను కట్టడిచేయాలన్నారు.

**కోల్‌కతా:** టీ20 ప్రపంచకప్‌లో సూపర్8 మ్యాచ్‌లు ఉత్కంఠ రేపుతున్నాయి. నాలుగు సెమీస్ బెర్త్‌ల్లో రెండుస్థానాలు ఖరారయ్యాయి. ఇంగ్లాండ్, సౌతాఫ్రికా సెమీస్ స్థానాలు పక్కా చేసుకున్నాయి. ఇంకా మిగిలినవి రెండు బెర్త్‌లు. అవి ఏ జట్టను వరిస్తాయన్న ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా అతిథ్య టీమిండియా సెమీస్ చేరుతుందా అన్నది హాట్ టాఫిక్‌గా మారింది.

### సెమీస్‌లో సఫారీలు

సూపర్8 గ్రూప్-1లో భారత్‌తో పాటు సౌతాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే జట్లు ఉన్నాయి. సౌతాఫ్రికా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది నాలుగు పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఉంది. నెట్ రన్‌రేట్(2.89) కూడా మెరుగ్గా ఉండడంతో సెమీస్ బెర్త్‌కు ఢోకా లేదు. జింబాబ్వేతో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో జింబాబ్వే ఓడినా, గెలిచినా పెద్దగా సౌతాఫ్రికాకు నష్టం ఉండదు. ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఓడి జింబాబ్వే సెమీస్‌కు దూరమైంది.

### సెకండ్ బెర్త్ ఫైట్

ఇక రెండో బెర్త్ కోసం భారత్, వెస్టిండీస్ మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఇరు జట్లు ఆదివారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తలపడతాయి. వెస్టిండీస్, భారత్ ఒక మ్యాచ్ నెగ్గి మరో మ్యాచ్‌లో ఓడి రెండు పాయింట్లతో సమవుజ్జీగా ఉన్నాయి. అయితే నెట్ రన్‌రేట్ పరంగా టీమిండియా(-0.100)కంటే వెస్టిండీస్ (1.791)తో పైచేయిగా ఉంది. దీంతో ఈ మ్యాచ్ సూర్యకుమార్ సేనకు డూ ఆర్ డైగా మారింది. జింబాబ్వేపై గెలిచి నిలిచిన మెన్ ఇన్ బ్లూ.. కరేబియన్లపై గెలిస్తే రెండో సెమీస్ బెర్త్ దక్కుతుంది. లేదంటే నిష్క్రమణే.

ఒకవేళ మ్యాచ్‌కు అకాల వర్షం అడ్డంకిగా నిలిస్తే టిమిండియా సెమీస్ ఆశలు గల్లంతవుతాయి. మెరుగైన నెట్ రన్‌రేట్‌తో విండీస్ సెమీస్‌లోకి దూసుకెళ్తుంది. అయితే భారత అభిమానులు దిగులు చెందాల్సిన వాతావరణం కోల్‌కతాలో లేదు. ఎలాంటి వర్ష సూచన లేదని ఐఎండీ తెలిపింది. ఉష్ణోగ్రత 23 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉంది.

గ్రూప్ స్టేజ్ నుంచి అజేయంగా సూపర్8లో ప్రవేశించిన టీమిండియా.. తొలి మ్యాచ్‌లోనే సఫారీల చేతిలో చిత్తు చిత్తుగా ఓడి విమర్శల పాలైంది. అయితే జింబాబ్వేతో జరిగిన రెండో మ్యాచ్‌లో సూర్యసేన గెలిచి నిలిచారు. జింబాబ్వేపై విజయంతో టీమిండియా మంచి జోష్ మీదుంది. ఇదే జోష్‌ను విండీస్ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తే భారత్‌కు సెమీస్ బెర్త్ ఖాయం.

## రింకూ సింగ్ కుటుంబంలో విషాదం

**న్యూఢిల్లీ:** టీమ్ఇండియా క్రికెటర్ రింకుసింగ్ కుటుంబంలో విషాదం నెలకొంది. అతని తండ్రి ఖాన్‌చంద్ సింగ్ శుక్రవారం కన్నుమూశారు. కొంతకాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధ పడుతన్న ఖాన్‌చంద్‌ను నోయిడాలోని ఓ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు. రింకు సింగ్ క్రికెటర్‌గా ఎదగడంలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. ఉత్తరప్రదేశ్‌లోని అలీఘడ్‌లో ఎల్పీజీ గ్యాస్ డెలివరీ విభాగంలో పనిచేసేవారు. తండ్రి మరణంతో రింకూ విషాదంలో మునిగారు. అతనికి టీమిండియా ఆటగాళ్లు ధైర్యం చెప్పారు. ఖాన్ చంద్ మృతిపట్ల పలువురు మాజీ క్రికెటర్లు సంతాపం తెలిపారు.

## జర్మన్ ఓపెన్‌లో ముగిసిన భారత్ షట్లర్ల పోరు

**బెర్లిన్:** జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరు ముగిసింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో కిదాంబి శ్రీకాంత్ 14-21, 9-21తో లిన్ చున్(చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పొందాడు. తొలి గేమ్‌లో 9-2తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ దానిని సద్వినియోగం చేసుకోలేక పోయాడు. రెండో గేమ్‌లో మాత్రం ఆరంభం నుంచే చైనీస్ తైపీ ప్లేయర్ ఆధిపత్యం చలాయించాడు. మహిళల సింగిల్స్‌లో భారత ప్లేయర్లు ఆకర్షి కశ్యప్, మాళవిక, తస్నిమ్, రక్షి తశ్రీ, తన్వీ శర్మ, ఇషారాణి తొలి రౌండ్‌లోనే

## రెజ్లర్ సుజీత్ కల్కాల్‌కు స్వర్ణం

**టిరానా:** అల్బేనియాలో జరిగిన వరల్డ్ ర్యాంకింగ్ సిరీస్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో భారత రెజ్లర్ సుజీత్ కల్కాల్... పసిడి పతకం సాధించాడు. పురుషుల ఫ్రీస్టయిల్ 65 కేజీల విభాగంలో సుజీత్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో సుజీత్ టెక్నికల్ సుపీరియారిటీపద్ధతిలో అజర్‌బైజాన్ రెజ్లర్ రషీద్ బాబాజాదెను చిత్తుగా ఓడించాడు. బౌట్ మొదలైన 77 సెకన్లకే సుజీత్ 10-0తో ఆధిక్యంలోకి వెళ్లి స్వర్ణాన్ని ఖాయం చేసుకున్నాడు. సెమీస్‌లో 11-0తో జోసెఫ్ క్రిస్టోఫర్ (అమెరికా) పై, క్వార్టర్ ఫైనల్లో 10-0తో నికా జకాష్విలి (జార్జియా)పై నెగ్గాడు.

## జమ్మూ కశ్మీర్‌కు భారీ ఆధిక్యం



**హుబ్లీ:** తొలిసారి రంజీ ఫైనల్ చేరిన జమ్మూ కశ్మీర్ అదే జోరు కొనసాగిస్తోంది. కర్ణాటకతో జరుగుతున్న ఫైనల్లో భారీ ఆధిక్యం సాధించింది. ఫైనల్‌కు చేరుకున్న తొలిసారే ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ అందుకునే దిశగా కొనసాగుతోంది.

కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌ను 293 పరుగులకు తెరదించిన జమ్మూకశ్మీర్..నాలుగో రోజు ఆటముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసింది. ఓపెనర్ యావర్ హసన్, తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో శుభమ్ పండిర్(4) నిరాశపరిచినా...మరో ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ సూపర్ బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. మిగతా వారిలో అబ్దుల్ సమద్ 32 రన్స్ చేశాడు. నాలుగో రోజు ఆటముగిసేసరికి కమ్రాన్ ఇక్బాల్ (94), సాహిల్ లోత్రా(16) క్రీజ్‌లో ఉన్నారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 291 రన్స్ కలుపుకుని జమ్మూ కశ్మీర్ మొత్తం లీడ్ 477 పరుగులకు చేరుకుంది. మరో రోజు ఆట మాత్రమే మిగిలిఉండడంతో ఛాంపియన్ కానుంది.

అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 220/5తో 5వ రోజు ఆట కొనసాగించిన కర్ణాటక తొలి ఇనింగ్స్‌లో 293 రన్స్‌కు ఆలౌటైంది. 73 పరుగులే జోడించి మిగతా 5 వికెట్లు కోల్పోయింది. మయాంక్ అగర్వాల్ 160 రన్స్‌కు అవుట్ కాగా, ఆ తర్వాత వేగంగా వికెట్లు కోల్పోయింది. కృతిక్ కృష్ణ 36 రన్స్‌తో రాణించాడు. జమ్మూకశ్మీర్ బౌలర్లలో అఖిబ్ నబీదార్ 5 వికెట్లతో మెరుగైన ప్రదర్శన చేశాడు. సునీల్ కుమార్, యుద్ధ్వీర్‌సింగ్ చరక్ తలో 2 వికెట్లు పడగొట్టారు.



### వాణిజ్యం

## మూడోత్రైమాసికంలో భారత్ జిడిపి వృద్ధిరేటు 7.8%

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 27:** భారత్ ఆర్థికవృద్ధి అక్టోబరు డిసెంబరు మధ్యకాలంలో 7.8శాతంగా ఉందని కేంద్రం ప్రకటించింది. ఆర్థిక నిపుణుల అంచనాలనుసైతం జిడిపి వృద్ధి బ్రేక్‌చేసింది. నిపుణుల అంచనాలు 7.6శాతం మాత్రమే ఉన్నాయి. వివిధ దేశాలమధ్య నెలకొన్న వాణిజ్య ఆంక్షలు ఉన్నప్పటికీ భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నా భారత్ ఆర్థికవృద్ధి కొనసాగుతోందని చెపుతున్నారు. ప్రభుత్వం జిడిపి బేస్ ఇయర్‌ను 2011-12 నుంచి 2022-23కు మార్చేసింది. ఆర్థికవ్యవస్థపరిధిలనే ఉత్పత్తిరంగ డిమాండ్‌ల శ్రేణి మారుతుండటంతో బేస్ ఇయర్‌ను కూడా మార్చింది. సవరించిన మందస్తు అంచనాలప్రకారం 2026 ఆర్థికసంవత్సరంలో జిడిపి వృద్ధి 7.6శాతంగా ఉంటుంది. అంతకుముందు 7.4శాతంగా మాత్రమే ఉంది. ఆర్థికసర్వేలో భారత్ ఆర్థికవృద్ధి 2027లో పైపైకి వెళుతుందని 7 నుంచి 7.4శాతంగా ఉంటుందని వెల్లడించింది. పాత సిరీస్‌లో 6.8 నుంచి 7.2శాతంగా మాత్రమే ఉందని ప్రధాన ఆర్థికసలహాదారు వి అనంతనాగేశ్వరన్ మీడియాకు తెలిపారు. రెండో త్రైమాసికంలో ఆర్థికవృద్ధి 8.2శాతంగా ఉంది. అమెరికా ట్యారిఫ్‌లు 50శాతం సుంకాలు విధించినా ఆర్థికవృద్ధి పెరిగిందని భారత్ చెపుతోంది. 2026-27కల్లా భారత్ జిడిపి నాలుగు లక్షలకోట్ల డాలర్ల మార్కును దాటుతుందని అనంతనాగేశ్వరన్ తెలిపారు. అలాగే ద్రవ్యోల్బణం దిగువస్థాయిలోనే ఉంది. నామినల్ జిడిపి వృద్ధి డిసెంబరు త్రైమాసికంలో 8.9శాతంగా ఉంది.

## సెబీ పేరిట మార్కెట్‌లో డీప్‌ఫేక్ నోటీసులు!

**ముంబయి, ఫిబ్రవరి 27:** మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లను క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ అప్రమత్తం చేసింది. నకిలీ సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) నోటీసులు, గ్యారంటీ లాభాల పేరుతో మోసపూరిత అకౌంట్ హ్యాండ్లింగ్ సేవల మోసాలు పెరిగిపోతున్నాయని హెచ్చరించింది. కొంతమంది మోసగాళ్లు సెబీ పేరు, లోగో, సీల్‌తో నకిలీ లెటర్‌హెడ్‌లు సృష్టించి, ఎస్టీటీ బకాయిలు చెల్లించాలంటూ ఇన్వెస్టర్లకు ఫేక్ నోటీసులు పంపుతున్నట్లు సెబీ గుర్తించింది. 2004 ఫైనాన్స్ చట్టం ప్రకారం ఎస్టీటీని ప్రతి లావాదేవీ సమయంలో బ్రోకర్లే ఆటోమేటిక్‌గా వసూలు చేస్తారని, తాము ఎలాంటి డిమాండ్ నోటీసులు జారీ చేయమని సెబీ స్పష్టం చేసింది. సెబీ అధికారులుగా నటిస్తూ ఈ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. ఎలాంటి నష్టం లేకుండా గ్యారంటీగా లాభాలు అందిస్తామని చెబుతూ పీఎంఎస్ సర్వీస్ ప్రొవైడర్లు లేదా ఫండ్ మేనేజర్లుగా చెప్పుకునే వారి పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని సెబీ సూచించింది. ఇతర ఇన్వెస్టర్ల ఖాతాలలో తాము భారీ లాభాలు సంపాదించి పెట్టామని నమ్మించి, పెట్టుబడిదారుల డీమ్యాట్ లేదా ట్రేడింగ్ ఖాతాలను తమ చేతుల్లోకి తీసుకుని మోసం చేస్తున్నారని వివరించింది. సెబీ నుంచి వచ్చే అధికారిక ఈమెయిల్స్ అన్నీసెబిడాట్‌జివోవిడాట్‌ఇన్ డొమైన్‌తోనే ముగుస్తాయని, ఇన్వెస్టర్లు గమనించాలని సూచించింది. ఏదైనా ఉత్తర్వులకు సంబంధించిన ఆన్‌లైన్ చెల్లింపులు చేయాల్సి వస్తే, సెబీ అధికారిక పేమెంట్ గేట్‌వే ద్వారా మాత్రమే చేయాలని స్పష్టం చేసింది. మధ్యవర్తుల ప్రామాణికతను నిర్ధారించుకునేందుకు ఇటీవల సెబీ చెక్ అనే కొత్త విధానాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా యూపీఐ ఐడీ లేదా బ్యాంకు ఖాతా వివరాలు ఎంటర్ చేసి, సదరు మధ్యవర్తి సెబీ రిజిస్టర్డ్ అవునో కాదో తెలుసుకోవచ్చు. ఇన్వెస్టర్లు ఎల్లప్పుడూ తమ గుర్తింపు పొందిన మధ్యవర్తులతోనే లావాదేవీలు జరపాలని సెబీ స్పష్టం చేసింది.

## మార్చి ఒకటో తేదీ నుంచి వచ్చే మార్పులు ఇవే!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** ఏడాదిలో ప్రతి నెల ముగుస్తున్న తరుణంలో కొత్తనిబంధనలు అమలులోకి వస్తుంటాయి. వచ్చే మార్చి 1 నుంచికూడా కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. వంట గ్యాస్, ఆర్థిక విషయాల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. సాధారణ ప్రజల దినచర్య, బడ్జెట్‌ను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. మార్చి 1 నుండి కొత్త రూల్స్ వంట గ్యాస్ ధరలు, రైలు ప్రయాణం, మొబైల్ ఫోన్ వినియోగ నిబంధనలను ప్రభావితం చేస్తాయి. మార్చి 1 నుండి అత్యంత ముఖ్యమైన మార్పు వంట గ్యాస్ సిలిండర్ల ధరలకు సంబంధించినది. చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెల మొదటి తేదీన గృహ, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లకు కొత్త ధరలను విడుదల చేస్తాయి. కొత్త రేట్లు మార్చి 1 ఉదయం ప్రకటిస్తారు. గ్యాస్ ధరలు పెరగొచ్చు లేదా తగ్గొచ్చు లేదా స్థిరంగా ఉండే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగితే లేదా సబ్సిడీలు మారితే, గ్యాస్ సిలిండర్లు మరింత ఖరీదైనవిగా మారవచ్చు, ఇది గృహాల నెలవారీ బడ్జెట్‌లపై ప్రభావం చూపుతుంది. ధర తగ్గడం వినియోగదారులకు ఉపశమనం కలిగించవచ్చు. రైల్వే ప్రయాణికులకు మరో ప్రధాన మార్పు. మార్చి 1 నుండి, భారతీయ రైల్వేలు పాత యుటిఎస్ యాప్‌ను నిలిపివేసి, కొత్త రైల్‌వన్ యాప్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. అన్‌రిజర్వ్, జనరల్, ప్లాట్‌ఫామ్ టిక్కెట్ల బుకింగ్‌లు ఇప్పుడు కొత్త యాప్ ద్వారా చేయబడతాయి. దీని వలన ప్రయాణీకులు కొత్త వ్యవస్థకు అనుగుణంగా మారవలసి ఉంటుంది. ప్రారంభంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తవచ్చు, కానీ కొత్త వ్యవస్థ వేగంగా, సురక్షితంగా, మరింత యూజర్ ఫ్రెండ్లీగా ఉంటుందని రైల్వేలు చెబుతున్నాయి.

## లాకర్ ఛార్జీలు పెంచిన హెచ్‌డిఎఫ్‌సి

**ముంబయి, ఫిబ్రవరి 27:** బ్యాంకుల్లో దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ బ్యాంకుల్లో లాకర్ యాక్సెస్ రూల్స్ కఠినతరం చేసినట్లు తెలిపింది. యాక్సెస్ మంజూరు చేసే ముందే అన్ని లాకర్ హోల్డర్లకు ఆధార్ బయోమెట్రిక్ ఆథెంటికేషన్ తప్పనిసరి చేసినట్లు తెలిపింది. అలాగే ప్రతి లాకర్ సరిగ్గా సురక్షితంగా ఉందని నిర్ధారించుకునేందుకు ఇకపై బ్యాంకు ప్రతినిధిని లాకర్ గది బయటే ఉంచుతారని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. లాకర్ ప్రాంగణంలో ఎండ్‌టుఎండ్ పర్యవేక్షణ ఉండేలా ఈ మేరకు చర్యలు తీసుకునట్లు వెల్లడించారు. కార్యకలాపాలను క్రమబద్ధీకరించేందుకు మా డిజిటల్ విధానంలో మార్పులు చేస్తున్నాం. ఇందులో భాగంగా లాకర్ యాక్సెస్ కోసం కాగిత రహిత ప్రయాణంలోకి మారుతున్నామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రకటించింది.




కస్టమర్లు ఇప్పుడు ఆధార్ అనుసంధాన బయోమెట్రిక్ ఆథెంటికేషన్ ద్వారా మాత్రమే తమ లాకర్లను యాక్సెస్ చేసేందుకు వీలు కలుగుతుంది. లాకర్ సదుపాయాన్ని మరింత సురక్షితంగా, సమర్థవంతంగా చేస్తుందని బ్యాంక్ తెలిపింది. మెట్రో, అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక లాకర్ ఫీజులు గణనీయంగా పెంచినట్లు హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. పెంచిన ఛార్జీలు ఏప్రిల్ 1 నుంచే అమలులోకి వస్తాయి. మెట్రో నగరంలో చిన్న లాకర్‌కు వార్షిక ఫీజు రూ. 5,000గా నిర్ణయించింది. ఇది ప్రస్తుత రూ. 2,250గా ఉండదా దానినిరెట్టింపుచేసింది. పెద్ద లాకర్ ఛార్జీలు రూ. 10,000 నుంచి రూ. 15,000కి పెంచారు. ప్రస్తుత మార్కెట్ రేట్లకు అనుగుణంగా దశాబ్దం తర్వాత లాకర్ రేట్లను సవరించినట్లు బ్యాంకు తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త మార్గదర్శకాల ప్రకారం లాకర్ ఛార్జీలను పెంచినట్లు సోషల్ మీడియా వేదికగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది. కొత్త పెంచిన ఛార్జీలు అధిక భద్రతా ప్రమాణాలు, భీమా, సాంకేతిక నవీకరణల కోసం ఖర్చులను కవర్ చేస్తాయని పేర్కొంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకుగా కొనసాగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా చూసుకుంటే 10వ స్థానంలో ఉంది. దేశ్యాప్తంగా 9 వేలకు పైగా బ్రాంచీలు ఉన్నాయి.

## స్టాక్ మార్కెట్లలో అమ్మకాల సునామీ! - నష్టాల్లో ముగిసినసెన్సెక్స్ నిఫ్టీలు

**ముంబయి, ఫిబ్రవరి 27:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలను చవిచూశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా అమ్మకాలకు పాల్పడటం, అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు వెలువడటంతో సూచీలు కుప్పకూలాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గ చూపడంతో రోజంతా మార్కెట్లలో ఒత్తిడి కొనసాగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 961 పాయింట్లు నష్టపోయి 81,287 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 317.90 పాయింట్లు క్షీణించి 25,178 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా దాదాపు 1.10 శాతం చొప్పున నష్టపోయాయి. మార్కెట్ మొత్తం మీద 1,515 షేర్లు లాభపడగా, 2,300 షేర్లు నష్టాల్లో ముగియడం అమ్మకాల తీవ్రతను సూచిస్తోంది. రంగాల వారీగా చూస్తే ఐటీ, మీడియా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా మిగిలినవన్నీ నష్టాల్లోనే ట్రేడయ్యాయి. నిఫ్టీ రియల్టీ అత్యధికంగా 2.26 శాతం పతనం కాగా, ఆటో, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా 1.69 శాతం వరకు నష్టపోయాయి. బ్యాంక్ నిఫ్టీ సైతం 1.08 శాతం క్షీణించింది. అమెరికాఇరాన్ అణు చర్చల్లో పురోగతి లేకపోవడంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతాయనే ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని విశ్లేషకులు చెబుతున్నారు. నిఫ్టీ కీలకమైన 25,350 మద్దతు స్థాయిని కోల్పోవడం సమీప భవిష్యత్తులో మార్కెట్ ధోరణి మారబోతోందనడానికి సంకేతమని వారు పేర్కొన్నారు. మొత్తం మీద, అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ నిధుల ప్రవాహంపై ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ స్వల్పంగా క్షీణించి 90.06 వద్ద ముగిసింది.



## మళ్లీ పెరిగిన గోల్డ్, సిల్వర్ ఫ్యూచర్స్

**ముంబయి, ఫిబ్రవరి 27:** బంగారం వెండిధరలు శుక్రవారం మళ్లీపెరిగాయి. అమెరికా ఇరాన్‌లమధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, అమెరికా డాలర్ స్వల్పంగా క్షీణించడం వంటి వాటితో బంగారంధరలు మళ్లీపెరిగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఏప్రిల్ ఫూచర్‌ట్రేడ్స్ 0.43శాంపెరిగి పదిగ్రాములు రూ.1,60,399కి చేరింది. ఇంట్రడే బేసిస్‌లో ఈ ధరలునమోదయ్యాయి. ఎంసిఎక్స్‌లో వెండి మార్చి ఫ్యూచర్లు కూడా 3.05శాతం లాభపడి కిలోకు రూ.2,67,600నమోదయ్యాయి. అమెరికా ఇరాన్‌లమధ్య జరిగిన అణు చర్చలు కొలిక్కిరాకుండానేముగిసాయి. ఎలాంటి ప్రగతి కనిపించలేదు. దీనితో భౌగోళిక ఉద్రిక్తతలు మళ్లీపెరిగాయి. అమెరికా దళాలు చుట్టుముడితే రెండుదేశాలు ఒకరిపై ఒకరు హెచ్చరికలు చేసుకోవడంతో ఈప్రభావం అటు బులియన్, ఇటు ఈక్విటీ మార్కెట్లపై పడింది. అమెరికా ఆర్థికవ్యవస్థ పటిష్టతకు కొంతమేర రేట్ కట్ ఉంటుందన్న అంచనాలతో అమెరికా ఆర్థికవ్యవస్థ పెరిగింది. సెబీ ఇటీవలే మొత్తంమూచువల్‌ఫండ్స్ ట్రేడింగ్ వ్యవస్థలను మార్చింది. గోల్డ్‌సిల్వర్ ఇటిఎఫ్‌లలో సమూలమార్పులు తెచ్చింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు రూ.1,55 వేలనుంచి రూ.1.65 వేలకు పెరిగాయి. ఒకదశలో రూ.1.80 లక్షలనుంచి రూ.1.81 లక్షలవరక వెళ్లినవి తర్వాత క్రమంలో సర్దుబాటయ్యాయి. ఎంసిఎక్స్‌లో వెండి కూడా కిలోకు రూ.2.25 లక్షలు నుంచి రూ.2.35 లక్షలుగా నడిచింది. ఒకదశలో రూ.3 లక్షలనుంచి రూ.3.25 లక్షలవరకూ చేరుతుందన్న అంచనాలున్నాయి. అయితే హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారంధర రూ.1,61,830కాగా 22 కేరట్ల ధర రూ.1,48,350గా ఉంది. ముంబయిలో 24 క్యారెట్లు రూ.1,61,830గాను 22 క్యారెట్లు రూ.1,48,350గాను నమోదయింది. ఇవేధరలు బెంగళూరులో కూడా కొనసాగితే చెన్నైలో మాత్రం 24 క్యారెట్ల బంగారం రూ.1,63,130గాను, 22 క్యారెట్ల బంగారం సుమారు రూ.1,49,600గాను ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.